# కథా మంజరి

పది కథల సమాహారం



## కథా మార్గదర్శి


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త


**జనవరి 2022 సంచిక**


© Copyright 2020 - Editorial Board Kathamanjari

# నూతన సంవత్సర శుభాకాంక్షలతో



# సుస్వాగతం

# కథామంజరి శ్రావ్య సంచిక

ఈ సంచికలో 'గళ' సహకారం అందించిన కళాకారులు –

- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ వెంపటి కామేశ్వర రావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు

## ఈ నెల శ్రావ్య సంచిక కోసం

ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథాకీయం | | iii |
| IV | విశిష్ట అతిథి | | v |
| V | కథా మార్గదర్శి | | viii |
| | **కథలు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
| 1 | ఆత్మీయ బంధం | దేవులపల్లి దుర్గాప్రసాద్ | 1 |
| 2 | రీయూనియన్ | ఓలేటి శశికళ | 8 |
| 3 | గురు దక్షిణ | సింగరాజు శ్రీనివాసరావు | 15 |
| 4 | గాజు బొమ్మలు | గొర్తి వాణీ శ్రీనివాస్ | 19 |
| 5 | దృఢ నిశ్చయం | తరిగొప్పుల వి ఎల్ ఎస్ మూర్తి | 23 |
| 6 | చెదిరిపోని సుగంధం | కే. కే. భాగ్యశ్రీ | 28 |
| 7 | బొమ్మరిల్లు | కొత్తపల్లి ఉదయబాబు | 34 |
| 8 | ఒకటే కోరిక | సరస్వతి | 40 |
| 9 | ఐదో సంతానం | భాగవతుల భారతి | 46 |
| 10 | కార్తీక ఘోరం | పి. రాజేంద్రప్రసాద్ | 50 |
| పుష్పవిలాపంలా తాబేళ్ళ విలాపంతో.. పాఠకుడిని కన్నీళ్లు పెట్టించే కీ.శే. గండికోట బ్రహ్మాజీరావు గారి కథల అంబుధి నుంచి ఓ కథామృతం "తాబేళ్ళు" ఈ సంచిక ప్రత్యేక కథ. | | | |
| 11 | తాబేళ్లు | ఘండికోట బ్రహ్మాజీ రావు | 53 |
| 12 | ప్రత్యేక వ్యాసం | అత్తలూరి విజయలక్ష్మి | 58 |



# మా జట్టు

## సాంకేతిక సహకారం

harbinger PUBLISHING

## బొమ్మలు

శ్రీ కొయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

శ్రీ సూరంపూడి చలపతిరావు

## సంపాదక సహకారం

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు


శ్రీ కృపాకర్ పోతుల

# కృతజ్ఞతలు


# ఈ సంచిక దాతలు

శ్రీ పున్నమరాజ రఘు

శ్రీమతి పున్నమరాజ భాను పల్లవి







# కథాకీయం

ఏ విషయం మీద కథ రాయొచ్చు, కథాంశాలు ఎలా వుండాలి, ఏవుండాలి... అనే సందేహాలు కథలు రాయడానికి ఉత్సాహం చూపించే కొత్తలో సహజంగానే రచయితలకు వస్తాయి. ఉత్సాహమో, ప్రోత్సహమో, స్ఫూర్తో, తపనో, తపస్సో.. వీటి ప్రభావంతో కథ రాయడానికి ఉపక్రమిస్తే, ఎలా మొదలెట్టాలనే ఆలోచనలు, తర్వాత ఒకట్రెండు పేజీలకే ముగింపు రావడాలు, తన కథ తనకే నచ్చక పోవడాలు, కించిత్ నిరుత్సాహం రావడాలు.. ఇవి రచనలు చేసేవారికి మొదట్లో వచ్చే అనుభవాలు!

కొంచెం చెయ్యి తిరిగిన తర్వాత కథాంశాల వేటలో మస్తిష్కం పనిచేస్తూ ఉంటుంది. ఆ కథాంశాలు మెదడులో చక్కర్లు కొడుతుంటాయి. అక్షరరూపం దాల్చి, కాగితం మీదకు వచ్చేసరికి కొంత సమయం పడుతుంది. ఇంకా బాగా చెయ్యి తిరిగిన తర్వాత... ప్రతీ విషయం మీద కథ అల్లగలిగే నేర్పరితనం వచ్చేస్తుంది. కలం ఆగకుండా పరుగెడుతుంది! అతి చిన్న కథాంశాన్ని కూడా నవలగా మలచ్చే పట్టు వస్తుంది. అయితే రెండో స్థాయికి చేరుకునే సరికే తనదాంటూ ఓ శైలి ప్రతీ రచయితకు అలవడుతుంది. పాఠకులను ఆకట్టుకునే కథాంశాలను ఎన్నుకునే నేర్పు వస్తుంది. తన సిద్ధాంతాలను, ఆలోచనలను కథాంశాలలో చేర్చి రచనలు చేసే పట్టు వస్తుంది.

ఈ విషయం మీదే ఈమధ్య చర్చా వేదికలు జరుగుతున్నాయి. సీనియర్ రచయితలు వర్ధమాన రచయితలకు సూచనలు చేస్తున్నారు. కాని తాము కూడా ఎప్పటికీ విద్యార్థులమే అని సవినయంగా విన్నవించుకుంటున్నారు. నిజమే.. విద్య, విజ్ఞానం.. ఇవన్నీ అనంతమే. అలాగే రచనలు చేయడం కూడా అనంతమే! ఓ రచయిత రాసిన కథలన్నీ ఒకే మూసలో ఉండకపోవచ్చు. అన్నీ ఉత్తమ కథలనీ కూడా ముద్ర పడకపోవచ్చు. ఎన్ని రచనలు చేసినా ఇంకా చేయాలనే తపన ఉంటుంది కాబట్టి, కొత్త విషయాల మీద కొత్తగా రాయాలనీ ఉంటుంది. వర్తమానంలో డెబ్బై ఏళ్ల పైబడిన సీనియర్ రచయితలు ఇంకా పోటీలకు కథలు రాస్తూ, బహుమతులు వచ్చినా రాకపోయినా సరే.. మనసుకు నచ్చినది, తట్టినది కథారూపంలో పదిమందికి అందించాలనే తపనతో ముందుకు నడుస్తున్నారు. వారిని చూస్తుంటే ఆనందం వేస్తుంది. అంతకంటే ఆశ్చర్యపోయే విషయం ఏమిటంటే.. మారిన కాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రచనలు చేస్తూ ఉండటమే కాకుండా, సాంకేతిక పరిజ్ఞానంలో కూడా వయోపరిమితి అడ్డుపడకుండా, వర్ధమాన రచయితలతో పోటి పడి, ముందుండి, వాటిని ఉపయోగిస్తూ రచనలు

చేస్తున్నారు. ఇప్పుడు ఉన్న సామాజిక మాధ్యమాలలో వారి రచనలు ముమ్మరంగా కనబడటమే ఇందుకు నిదర్శనం! ఇది తప్పకుండా రచనావ్యాసంగంలో తొలి అడుగులు వేస్తున్న వారికి మార్గదర్శకంగా ఉంటుంది.

ఇక... కాలమాన పరిస్థితులలో వచ్చే మార్పుల ప్రభావం తప్పకుండా కథాంశాల మీద ఉంటుంది. ఉండాలి కూడా! ఆ మార్పులు ప్రకృతి పరంగా ఎంత సహజమో... రచయితల ఆలోచనలు కూడా అంతే సహజంగా వాటి చుట్టూ తిరుగుతాయి. అందులో మంచి చెడ్డలను వెలికి తీసి, రచనలు చేయలాసే తపన రచయితలకు రావాలి. అలా వచ్చినప్పుడే... మనిషి గతం తెలుసుకుని వర్తమానంలో నుంచి భవిష్యత్తులోకి అడుగు పెట్టగలుగుతాడు.

వ్యవహారిక భాషా ఉద్యమం తరువాత ఆనాటి దురాచారాల మీద కథలు నుండి, కాలానుగుణం మారిన సమాజం స్థితి, గతి.. లమీద కథలు వచ్చాయి. నాటి నుండి నేటి వరకు తెలుగు కథా గమనాన్ని ఓసారి గమనిస్తే, పేదరికం, వరకట్నం, పురుషాధిక్యత, స్త్రీవాదం, విద్య, కుటుంబ వ్యవస్థ, విప్లవం, పల్లెల జీవితం, పట్నవాసం, పోలీసు, రాజకీయవాదులు, ఉద్యోగాలు, మానవ సంబంధాలు, ప్రేమలు, పెళ్ళిళ్ళు, దూరమవుతున్న మనుషులు, సాంకేతిక పరిజ్ఞానం... ఒకటేమిటి రవిగాంచని చోటల్లా రచయితలు చొచ్చుకు వెళ్ళి రచనలు చేసారు. ఆణిముత్యాలాంటి కథలు అందించారు. సమాజానికి మంచి అందించాలనే తపనతో కథలు రాసారు, రాస్తూనే ఉన్నారు.

కథ.. విశేషము, సశేషమే గాని సమాప్తం కాదు!!

సంపాదకుడు

# విశిష్ట అతిథి



## కథామంజరి::పి.ఎస్.నారాయణ

కనిపించే బాహ్య ప్రపంచంకన్నా అంతర్ ప్రపంచమే పెద్దది, సంక్లిష్టమయినది. వ్యక్తిని నడిపించేది మనసు. దాని లీలలే మనం ఎదుర్కొనే సమస్యలకు మూలం. త్రిశంకు స్వర్గంలో నివసించే మధ్యతరగతి మనుషుల మనస్తత్వాలు చిత్రాతిచిత్రంగా ఉంటాయి. వాటి విశ్లేషణే కథలకు బీజం. ఆ పాత్రలు పాఠకుడిని ఆలోచింపచేస్తాయి, ఆగ్రహిస్తాయి, ఏడిపిస్తాయి, నవ్విస్తాయి.

నా పూర్తిపేరు పొత్తూరి సత్యనారాయణ. నేను జన్మించింది గుంటూరు జిల్లా, మంగళగిరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చినకాకాని. నా తల్లిదండ్రులు వరలక్ష్మమ్మగారు, రామయ్యగారు. ఆ ఊరిని వదిలి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సరంలో మంగళగిరిలో ఫస్ట్‌ఫారం చదివి గుంటూరు వచ్చాను. 1957లో హిందూకాలేజీలో బి.కాం పూర్తిచేసి, ఆరు సంవత్సరాల పాటు గుంటూరు జిల్లాలోనే వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగం. 1963లో హైదరాబాదులోని ఐడిపియల్‌లో జేరి1993లో సీనియర్ ఎకౌంట్స్ ఎక్సుటివ్‌గా స్వచ్ఛంద పదవీ విరమణ. ఇది స్థూలంగా నా జీవనయానం.

కథలు రాయటం నాకు హాబీ. ఇంతవరకూ 300+ కథలు, 50 నవలలు వ్రాశాను. రెండు స్టేజి నాటికలు, పదికిపైగా రేడియో నాటికలూ రాశాను. ఇది నా సాహిత్య కృషి.

కథగాని, నవలగాని ప్రారంభంలోనే పాఠకుడిని తన గుప్పిటలోకి తీసుకోగలిగితే అది విజయవంతమైన రచనే అవుతుంది అనేది అనుభవం నేర్పిన పాఠం. అశ్లీలము, జుగుప్స ఉండనటువంటి రచనలు పాఠకుల మన్ననలు పొంది నాలుగు కాలాలపాటు నిలుస్తాయి. తన రచనలు సమాజాన్ని బాగుచేయలేకపోయినా, పాడుచేయకుండా ఉండేలా చూడటం రచయిత కర్తవ్యం.

పాఠకుడిని ఆకట్టుకోని శిల్పం లేని రచన వృథా అవుతుంది. వస్తువు ప్రాణమయితే, శిల్పం శరీరం. సౌందర్య సాధనకు శిల్పం తప్పని సరి. శిల్పమంటే జిమ్మిక్కులు చేయటం కాదు. గొప్పగా సమాసభరితమైన భాష వాడటం కాదు. పాఠకుడికి ఆసక్తి కలిగించేటట్లు, అవసరపడితే గిలిగింతలు పెట్టేట్టుట్లు ఉండేదే శైలి, శిల్పం. పాఠకుడిని తన వెంట తీసుకు వెళ్ళగల శిల్పం జోడిస్తే ఆ రచన పాఠకుల మనస్సుల్లోకి దూసుకుపోతుంది.

1957 లో కథలు రాయటం మొదలుపెట్టాను. పుట్టుకతోనే ఇలాంటివి అబ్బుతాయి అనే మాటకంటే కృషే విజయానికి సోపానమని నమ్మేవాడిని నేను. నా అభిలాషను గమనించి కథకు కావాల్సిన కిటుకులు నేర్పారు కాలేజీలో చదివేరోజుల్లోనే ప్రముఖ రచయిత, మా లెక్చరర్ మన్నవ గిరిధర్‌రావు గారు. అదే నా కోరిక కార్యరూపం దాల్చటానికి దోహదమయింది.

కథ మొత్తాన్ని మూసిన గుప్పిటలో పెట్టుకుని పాఠకుడికి ఉత్కంఠ కలిగిస్తూ ఒక్కొక్కవేలు తెరిచి, ముగింపు పాఠకుడి ఊహకు అందకుండా రాయగలిగేతే ఆ కథకు తిరుగుండదు.

నా మొదటి నవల 'రాగమయి' 1962–63 లో బెంగళూరు నుండి వచ్చే ప్రజామతలో సీరియల్‌గా వచ్చింది. ఆ సమయంలోనే 'శిక్ష' అనే కథకు ఆంధ్రప్రభ వారపత్రిక వారు నిర్వహించిన దీపావళి కథల పోటీలో ఇంకా ఇంకా ముందుకు దూసుకుపొమ్మంటూ ద్వితీయ బహుమతి ఇచ్చారు. అలాగే 1966లో అదే పత్రిక వారు నా నవల 'మిథ్యాబింబాలు' కు ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి ఇచ్చారు. ఆ నవలకు 'బాపు' గారు 18 అద్భుతమైన బొమ్మలు గీసి మరింత వన్నె తెచ్చారు. ఇంతవరకూ నాకు 8 నవలలకు, 19 కథలకు వివిధ పత్రికలు నిర్వహించిన పోటీలలో బహుమతులు లభించాయి. ఇవి గాక కొన్ని కథలు 'కథాపీఠం' శీర్షిక క్రింద రచన మాసపత్రికలో ప్రత్యేక స్థానాన్నీ పొందాయి.

మనిషి అంతర్మథనంలోనుంచే అమృతం పుట్టే అవకాశమున్నది. చాలా కథల్లో ఆ సూత్రాన్నే అన్వయించాను.

నా వయసు ఇప్పుడు ఎనభై నాలుగు అందులో అరవై ఆరు సంవత్సరాలుగా తృప్తికరమైన వివాహజీవితం గడుపుతున్నాను. నా శ్రీమతి మాధురి అన్నపూర్ణ. 'మాధురి' అనే కలం పేరుతో ప్రారంభంలో కొద్ది సంవత్సరాలపాటు కథలు వ్రాశాను. ఎక్కువగా ఆంధ్రసచిత్ర వారపత్రికలోనూ, కృష్ణాపత్రికలోనూ ఆ పేరు మీదే ప్రచురింపబడినాయి. నాకు ఇద్దరబ్బాయిలు, ఒక అమ్మాయి, ముగ్గురు మనవళ్లు, ఇద్దరు మనవరాళ్లు.

ఇంతకాలంగా రచనలు చేస్తున్నా ఓ విద్యార్థిలాగానే. ఇంకా ఇంకా చదవాలి, కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపనే నా చేత కథలు చదివిస్తుంది, రాయిస్తోంది. మారుతున్న రోజుల్లో కొత్త ప్రపంచంలోకి చొరబడగలిగితే నేటి పాఠకులు ఆనందించ గలిగే రచనలు చేయగలను గాని వయసు వెనక్కు గుంజుతోంది.

జీవితాలల్లోనుంచి పుట్టే కథలలోనే ఆర్ద్రత ఉంటుంది.

చాలా కథలు కన్నడంలోకి అనువదించబడ్డాయి. కొద్దిగా తమిళంలోనూ వచ్చాయి.

మిత్రులతో గడపటం నాకు ఆనందకరమైన విషయం. రచయితలయితే మరీను.

మనలో పుస్తకాలు కొని చదవటం ఇప్పుడు, ఎప్పుడూ తక్కువే. 1960, 70ల్లో ప్రచురణకర్తలు నావో తొమ్మిది పుస్తకాలు ప్రచురించారు. గత పదేళ్ల కాలంలో మరో ఎనిమిది పుస్తకాలు నేను ప్రచురించాను.

నేను స్త్రీ వాదినని నా రచనలు చదివిన ఓ ప్రముఖ పత్రిక సంపాదకులు అన్నారు. నేను స్త్రీని బలపరుస్తూ పెక్కు రచనలు చేసినమాట వాస్తవమే. సమాజంలో అన్యాయాన్ని స్త్రీ సమర్థవంతంగా ఎదుర్కోవాలి అనేది నా కోరిక. సమాజంలో సగం మందిని గురించి, ఆపైన స్వేచ్ఛగా ఊపిరి పీల్చలేని మహిళలగురించి రాయకపోవటం అసాధ్యం. ఏ రచయితా స్త్రీని నిర్లక్ష్యం చేయలేడు. స్త్రీ పాత్రకు ప్రాధాన్యతనిస్తూ చాలా కథలు రాశాను. అలాంటి కథలు ఎక్కువమంది పాఠకుల ప్రశంశలనూ అందుకున్నాయి. నేను ఎవరి పక్షపాతినీ కాదు, నా పక్షపాతం వాస్తవికత పట్ల. నాలుగు కాలాలపాటు నిలబడగలిగిన పాత్రలను, సహజంగా వుండే పాత్రలను సృష్టించాలనేదే నా అభిలాష.

ఒకప్పుడు పత్రికలను ఆత్రంగా చదివింది ఎక్కువగా గృహిణులే. ఇప్పుడు వారికి టీవీ సీరియల్సే ఇష్టంగా మారాయి. తెలుగు వాడకమే తగ్గిపోతున్నది. తమ పిల్లలకు తెలుగు రాదని గర్వంగా చెప్పుకునే తల్లిదండ్రులూ

కనబడుతున్నారు.  నేటి తరంవారే అంతంతమాత్రంగా తెలుగు రచనలు చదువుతున్నప్పుడు భవిష్యత్ తరాలు ఎంతవరకు వీటిని ఆదరించగలవు అనేది ప్రశ్నే.

2013లో 'పి.ఎస్.నారాయణ జీవితం, రచనలు– ఒక పరిశీలన' అనే విషయం మీద శ్రీదండు మల్లేష్ అనే విద్యార్థి ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫ్యాకల్టీ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజస్, తెలుగు శాఖకు సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి పిహెచ్‌డి పట్టా పొందటంతో నా రచనా కృషికి సార్థకత పొందినట్లయింది.

ఇంతవరకు ఎన్నో రాశాననే తృప్తి. ఇంకా మానకుండా రాస్తుండటం తుష్టి.

నాకీ అవకాశాన్ని ఇచ్చిన కథామంజరి సంపాదకులకు ధన్యవాదాలు.

***0***

# కథా మార్గదర్శి



## శ్రీ ఘండికోట బ్రహ్మాజీరావు గారు

ఆ రోజు విశాఖ సాహితీ సమావేశంలో స్వీయ కథాపఠనం జరుగుతోంది. అప్పటికే పెద్ద రచయితగా పేరు సంపాదించుకున్న ఓ పెద్దాయన.. తను రచించిన కథ చదువుతున్నారు. సభికులందరూ రచయితలే. ఉత్కంఠగా సాగుతున్న తరుణంలో, అక్కడే ఉన్న ఓ వర్ధమాన రచయిత తన పక్కనున్నాయనతో.. 'ముసలాయన బోరు కొట్టిస్తున్నారు!' అంటూ గొణిగాడుట. ఆ మాటలు విన్న ఆ పెద్దాయన, ఆ వర్ధమాన రచయిత దగ్గరకి వచ్చి... 'అయ్యా కథ ఎక్కడ బోరు కొట్టింది?' అంటూ అడిగారుట. ఆ వర్ధమాన రచయిత కొంచెం నీళ్లు నమిలినా సరే.. 'ఫలానా దగ్గర కథ బోరు కొట్టిందని' చెప్పాడుట. ఆ పెద్దాయన ఆ కథని మార్పులు చేసి, తర్వాత సమావేశంలో చదివి వినిపించారుట! ఆ కథ తెలుగు కథా ప్రియుల హృదయాల్లో అజరామరంగా నిలిచిపోయింది. ఆ కథ 'తాబేళ్లు'. ఆ రచయిత కీ.శే. ఘండికోట బ్రహ్మాజీరావు గారు.

శ్రామిక శకటం, విజయవాడ జంక్షన్ వంటి నవలల పేరు వినగానే జ్ఞాపకం వచ్చేది బ్రహ్మాజీరావు గారే! తాను పనిచేసిన రైల్వే రంగాన్ని ఇతివృత్తంగా తీసుకుని, తన అనుభవాలను హృద్యంగా అద్ది, రచనలు చేసిన ఘనత ఘండికోట వారిదే! ముప్ఫై నవలలు, నూట ఏభై కథలే కాకుండా, శ్రీమత్ సుందరకాండ - సౌందర్య దర్శనం వంటి ఆధ్యాత్మిక గ్రంథాల్ని, మరెన్నో సాహితీ వ్యాసాల్ని తనదైనా శైలిలో తెలుగు పాఠకలోకానికి అందించారు. ఏ రచన చేసినా, ముందుగా రచనాంశాన్ని నిశితంగా పరిశీలించి, పరిశోధనలు చేసిన తర్వాతే బ్రహ్మాజీరావుగారు అక్షరరూపం ఇచ్చేవారు. ఆయన రచించిన "శ్రీ పర్వతం" నవల కోసం సుమారు పన్నెండు సంవత్సరాలు ఎన్నో గ్రంథాలను, శాసనాలని అధ్యయనం చేసి, ఎంతోమంది నిపుణులను స్వయంగా కలిసి, వారితో మాట్లాడి, ఏడు వందల పేజీల నవల వ్రాసారు. ఆర్కియాలజీ

నేపథ్యంలో వచ్చిన తొలి చారిత్రిక నవల ఇదే అని చెప్పాలి. ఈ నవలపై అధ్యయనం చేసిన ఓ విద్యార్థికి, పి.హెచ్.డి. పట్టా కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించింది. మూడు దశాబ్దాల పాటు తాను పనిచేసిన బెంగాల్ రాష్ట్ర ప్రజల నేపథ్యంలో వారి ప్రవర్తన నుంచి.. జీవన విధానాల వరకు నిర్మొహమాటంగా "ప్రతిమ" నవలలో చిత్రించారు. అటువంటి కథలు, నవలలతో పాటు, కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోరికపై బర్టన్ 'అరేబియన్ నైట్స్' లోని కొన్ని కథలను ' వెయ్యిన్నొక్క రాత్రులు' గాను, శశిదేవ్ పాండే రాసిన 'థట్ లాంగ్ సైలెన్స్' ను 'ఆ దీర్ఘ మౌనం' గాను తెలుగులో అనువదించారు.

1922 డిసెంబరు22 న శ్రీకాకుళం జిల్లా పొందూరు గ్రామంలో జన్మించిన బ్రహ్మాజీరావు గారి విద్యాభ్యాసం శ్రీకాకుళం, విశాఖపట్నం లలో జరిగింది. ఇంటర్మీడియట్ వరకు చదివిన తర్వాత రైల్వేలో మెకానికల్ ఇంజనీరింగ్ అప్రెంటిస్ ఉద్యోగం చేరి, ప్రయివేటుగా బి.ఏ. ఎం.ఏ. (విడి విడిగా ఆంగ్లం, సంస్కృతం, తెలుగు) చేసారు. అలాగే ఏ.యమ్.ఐ.ఇ. కూడా చేసారు. అంతటితో ఊరుకోకుండా "తెలుగు కథానిక - ఉద్భవ వికాసాలు" అనే అంశంపై ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ చేయడానికి కృషి చేసారు. కాని ఆ పరిశోధన పూర్తికాలేదు. పదహారో ఏటనే రచనలు చేయడం ప్రారంభించిన ఘండికోట బ్రహ్మాజీరావుగారు తన జీవిత చివరి క్షణం వరకు రచనావ్యాసంగం మీదే కాలం గడిపారు. వారి సంతానం ఏడుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. వారబ్బాయి శ్రీ విశ్వనాథం గారు కూడా కథా రచయితే! అక్టోబర్ 12, 2012 న పరమపదించిన బ్రహ్మాజీరావుగారి సాహితీ ప్రస్థానం వెనుక నిరంతరం ప్రోత్సాహం అందించిన వారి సతీమణి శ్రీమతి సీతారామగారు కూడా ఇటీవల కాలంలోనే కాలం చేసారు.

సాహిత్యం జీవితాలకు ప్రతిబింబంగా ఉండాలని భావించిన బ్రహ్మాజీరావు గారి రచనలలో.. సామాజిక జీవనానికి దగ్గరగాను, చరిత్రలో జరిగిన సంఘటనలకు అద్దం పట్టేవిగాను ఉంటాయి. పల్లె జీవనం, ప్రకృతి రమణీయాలు, కార్ఖానాలో పనిచేసే కార్మికుల సాంఘిక, సాంస్కృతిక జీవనశైలిలు వీరి రచనలలో తొంగిచూస్తాయి. రావిశాస్త్రిగారు, బాలాంత్రపు రజనీకాంతరావు గారు, అబ్బూరి వరద రాజేశ్వరరావు గారు, మండా సూర్యనారాయణ గార్ల సహచర్యం సాహిత్యం పట్ల మక్కువను బాగా పెంచింది. 1971 లో ఏర్పడిన 'విశాఖ సాహితి' వ్యవస్థాపక అధ్యక్షులుగా, అక్కడ ఎందరో రచయితలను తీర్చిదిద్దారు. వారి మరణానంతరం, వారి సతీమణి అధ్వర్యంలో "ఘండికోట సాహితీ పీఠం" ఏర్పరచి, ప్రతీ ఏటా ఓ తెలుగు రచయితకు 'శ్రీ ఘండికోట బ్రహ్మాజీరావు స్మారక పురస్కారం' అందిస్తున్నారు.

బ్రహ్మాజీరావు గారి శతజయంతి ఉత్సవం జరుగుతున్న తరుణంలో, తెలుగు కథా శ్రామికుడ్ని తలుచుకోవడం ఓ అదృష్టంగా భావిస్తూ, వారి కథా ముత్యాలలో ఓ ఆణిముత్యం "తాబేళ్లు" కథను ఈ సంచిక ప్రత్యేక కథగా అందిస్తున్నాం.

వందేళ్ళ కథా"బ్రహ్మ"జీరావు గారికి ఘనమైన నివాళి తెలుపుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

**దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**



# ఆత్మీయ బంధం

దేవులపల్లి దుర్గాప్రసాద్

"అబ్బ ఎంతసేపు అలా మురిసిపోతావు? ఆహా! ఏం తిప్పుకోవడాలు? ఇంట్లో చిన్నపిల్లవని అందరూ ముద్దు చేస్తుంటే మరీ ముద్దుగా తయారవుతున్నావ్! ఓహో! రెండు జళ్ళనీ ముందుకేసుకోవడం!" రెండేళ్ళ వయసున్న తులసి, నా ముందు నిల్చుని వయ్యారాలు పోతోంది. బహుళపక్షంలేని ఆ వయ్యరాల నెలవంక పెరిగి పెద్దదవుతోంది. మరో వసంతం గడిచింది.

"ఓహో! పట్టుపరికిణీ వేసుకున్నావా! ఏంటి విశేషం? నీ మూడో పుట్టిన రోజా? ఎక్కువగా బయట తిరక్కు. దిష్టి తగులుతుంది." తులసి సంగతేమో కానీ కాలం గిర్రున తిరిగిపోతూనే ఉంది. మరో రెండేళ్ళు గడిచిపోయాయి.

"ఒసే తులసీ, ఎక్కడున్నావే"

"అదిగో మీ అమ్మ పిలుస్తోంది. ఆగాగు. స్కూలు డ్రెస్లో ఎంత బాగున్నావో! తాజా పూలగుత్తిలా ఎంత మెరిసిపోతున్నావు!" తులసి ఓమాటు ముందుకీ, వెనక్కి గిర్రున తిరిగి గట్టిగా నవ్వింది.

"ఎక్కడే... పద స్కూలు టైమ్ అయిపోతోంది" తల్లి హెచ్చరిక.

"ఇదిగో ఇక్కడుందే అమ్మా! తిప్పులాడి."అంటూ నవ్వుతూ తులసి అన్న సతీష్ నా ముందు నుండి తులసిని లాక్కెళ్ళాడు.

"ఇంకెన్నాళ్ళులే ఈ తిప్పులాటలు. ఈరోజు నుండి దీనికి స్కూలు మొదలు కదా! ఇంకన్నీ తిప్పటలే. పాపం పిచ్చిపిల్లకి!" తులసిని ముద్దులాడుతూ అంది తల్లి.

"అయినా అమ్మా... దీనికి ఆ అద్దం ముందు కూర్చోడం బాగా అలవాటైపోయిందే."

“ఆడపిల్లకి అద్దానికి అదే బంధంరా. అదే అందం కూడా.”

ఆవిడ చెప్పింది నిజమే. నాముందు కూర్చుంటే ఆడవారికి కాలం తెలియదు. అందులో తులసిలాంటి చిట్టితల్లులైతే నా ముందునున్నంతసేపు నాకు లోకం తెలియదు.

నేను, తులసి దాదాపు ఒకేసారి ఆ ఇంట్లోకి వచ్చాము. వడ్రంగి చేత ప్రత్యేకంగా తమకి కావాల్సిన విధంగా నన్ను తయారుచేయించారు తులసి తల్లిదండ్రులు.

ఒకసారి తులసి మేనత్త నన్ను చూసి, "ఒరేయ్ తమ్ముడూ చాలా బాగుందిరా ఈ నిలువుటద్దం. నాకిచ్చెయిరా. నువ్వు వేరేది చేయించుకో." అని నా ముందు నిలబడి మురిసిపోతూ చెప్పింది.

"నీకు నిలువుటద్దం ఒకటేనా అక్కా, దాని వెనకాతల చిన్న అల్మరా కూడా ఉండేలా, అదే వడ్రంగి చేత చేయించి ఇస్తాలే" అని తులసి తండ్రి నన్ను వదులుకోలేనని చెప్పకనే చెప్పాడు.

"అది కాదురా నాకిదే కావాలి. నువ్వే ఆ కొత్తదేదో చేయించుకో" అని పట్టుపట్టింది ఆవిడ.

"అక్కా! మనం చెప్పేది విని అర్థం చేసుకోవడం తప్ప మట్లాడలేదు కదే తులసి. తను ఒంటరిగా కూర్చుని మౌనంగా మాట్లాడుకునే ఒకే ఒక్క ఆత్మీయులారే ఈ అద్దం. అందుకే." అని తులసి తండ్రి గొంతు గాద్గదికమవడంతో,  అక్కగారు వెంటనే తమ్ముడి చేతిలో చేయివేసి "అయ్యో! మన తులసికి అంత ఇష్టమైనదైతే నాకెందుకురా. వద్దులే!" అనడంతో తులసికి దూరమయే ప్రమాదం తప్పింది నాకు.

సృష్టిలో అందమైన అపురూప ఆవిష్కరణల్లో ఒకటి ఆడపిల్ల. అలాంటి అందాన్ని ప్రతిబింబించే అదృష్టం నాకిచ్చాడు భగవంతుడు. ఇక్కడ తులసి అందాన్ని చూపించడం వరకే కాదు, తను నాతో అనుబంధాన్ని పెంచుకోడానికి కూడా కారణభూతమయాను నేను. లోకానికి తను మూగదే కావచ్చును కాని, నాతో మాత్రం తన జీవితంలోని ప్రతి ముఖ్య ఘటనను, తన భావాలను స్పష్టంగా పంచుకునేది.

***

అందంతోనే కాదు, అణకువతోనూ, చదువుతోనూ కూడా అందరి మన్ననలు అందుకుంది తులసి. డిగ్రీ ఆఖరి సంవత్సరంలో ఉండగానే తనకి పెళ్ళి సంబంధాలు చూడడం మొదలెట్టారు.

అన్నీ బాగున్నా, మూగపిల్ల అనగానే చాలా సంబంధాలు వెనక్కెళ్ళిపోయాయి. నాకు చాలా బాధ వేసింది, ఇంత చక్కని బంగారుతల్లిని ఇంట్లోకి తెచ్చుకునే అదృష్టం వాళ్ళకు లేకపోయిందే అని.

తులసి ఒంటరిగా వచ్చి నాముందు కూర్చుని దీర్ఘాలోచనలో మునిగిపోయేది. నాకే చేతులుంటే అక్కున చేర్చుకుని ఓదార్చాలనిపించేంత విషాదవదనంతో పదేపదే తనని తాను నాలో చూసుకునేది. ఆ బాధ భరించలేక బద్దలైపోతానేమో అనిపించేది నాకు.

ఒక రోజు సతీషు, తల్లి, తండ్రి, నా ముందే మంచం మీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు."అబ్బాయికి అమెరికాలో ఉద్యోగమట. మాట్లాడకపోతే మాకేంటి? మీ అమ్మాయి మాకు బాగా నచ్చింది అంటున్నారు." అంటున్నాడు తండ్రి.

"మరింకేంటి నాన్నగారు? ఎందుకాలస్యం? కట్నాలేమైన ఎక్కువగా అడుగుతున్నారా? ఆ బాధ్యత నాకు వదిలేయండి." చెప్పాడు సతీషు.

"అదేమీ కాదు. తులసి  ఈ అద్దాన్ని తనతో పాటు తీసుకెల్దామనుకుంటోంది."

"తీసుకెళ్ళమనండి. దీనికి ఏమాత్రం దెబ్బ తగలకుండా పేక్ చేయించి అమెరికా చేర్చే ఏర్పాటు చేస్తాను"

"నేనూ అదే చెప్పాను. కాని వాళ్ళు ఒప్పుకోవట్లేదు. ఆ అబ్బాయికి బదిలీలు ఉంటాయట. ప్రతిసారీ ఈ అద్దాన్ని ఎంతకని జాగ్రత్తగా తిప్పగలం? అన్నారు!" చెప్పాడు తండ్రి కనుకొలకుల్లోంచి వచ్చే నీటిని తుడుచుకుంటూ.

"దానికి బాధపడకండి నాన్నగారు. వాళ్ళన్నదీ నిజమే కదా!"

"ఏంట్రా నిజం? దాంతోపాటూ ఇంకో మాట కూడా అన్నారు. మూగపిల్లతో పాటు ఈపాత సామాను, గొంతెమ్మ కోర్కెలు అన్నీ మేమెలా భరించగలం అని..!" ఆమాట చెప్తూ తల్లి కూడా కన్నీళ్ళ పర్యంతమయింది.

"ఛా! ఛా! అంత తేలిక భావంతో జాలిపడి చేసుకునే వాళ్ళు రేప్పొద్దున తులసిని ఎలా చూసుకుంటారో? వద్దులే. మరో సంబంధం చూద్దాం!" అని తల్లిని, తండ్రిని ఓదారుస్తూ వాళ్ళ భుజాల మీద చేరో చెయ్యి వేసాడు సతీషు.

***

అయ్యో! నా బంగారుతల్లి సుఖానికి నేనే అడ్డమయానా? ఏంటో ఈమనుషులు! తరిగిపోయే తమ బాహ్య సౌందర్యాన్ని చూసుకుంటూ మురిసిపోతారు కాని, అంతకన్నా విలువైన తమ అంతఃసౌందర్యాన్ని మాత్రం స్వచ్ఛంగా ఉంచుకోరు.

ఆరు నెలలు గడిచాయి. ఒకరోజు ఇల్లంతా సందడిగా ఉంది. తులసి పెళ్ళి ఆరోజే. ఇల్లంతా కళకళలాడుతోంది. నేనున్న గదిలోకి తులసి తల్లి, మేనత్త మాట్లాడుకుంటూ వచ్చారు."అవును వదినా, ఆ అబ్బాయి కూడా మూగవాడే! అయితేనేం వాళ్ళ మంచితనం గొప్పది. అందులోనూ హైదరాబాదులోనే ఉద్యోగం. తులసితో సహా మా అందరికీ నచ్చింది ఈ సంబంధం!" చెప్తోంది తులసి తల్లి.

"అదేమిటే ఇదెలాగూ మాట్లాడలేదు కదా, దంపతుల్లో ఒక్కరైనా మాట్లాడగలిగితే బాగుంటుంది కదా!"

"అలా అనుకుంటే ఎలా వదినా! మన తులసిలాంటివాడే ఆ అబ్బాయి. మనమ్మాయిని కాదన్నట్టే ఆ అబ్బాయిని ఎంతమంది కాదన్నారో? మరి ఈ ఇద్దరూ ఒకరినొకరు కావాలనుకున్నపుడు కలపడమే మంచిది కదా!"

ఓహో ఎంత చక్కగా చెప్పారో ! ఇక నావంతు, తులసి సరాగాల జీవితాన్ని నాలో చూపడమే కదా, సదా!

అంగరంగ వైభవంగా జరిగిన తులసి పెళ్ళి విశేషాలు నా ముందు మాట్లాడుకునే వారి వలన, మరీ ముఖ్యంగా నవవధువు శోభతో వెలిగిపోతున్న తులసి చిద్విలాస మోము వలన తెలుస్తూనే ఉన్నాయి. తన భర్త పేరు మాధవ్. పేర్లతో సహా మనసులు కూడా కలిసిన ఆ కొత్తజంట ముచ్చట గొలుపుతున్నారు.

తులసీమాధవీయంలోకి అడుగు పెట్టాను. వాళ్ళది ఉమ్మడి కుటుంబం. తులసీమాధవులతోపాటు, అతని తల్లిదండ్రులు, అన్న, వదిన ఉంటారు. తమ పడకగదిలో ఒకమూల, తాను నాతో తీరిగ్గా కూర్చుని ముచ్చట్లాడే వీలుగా, తమ భార్యాభర్తల ముచ్చట్లు నాకు కనబడకుండా నను నిలబెట్టుకుంది తులసి.

మొదటిరోజు ఇద్దరూ వచ్చి నా ముందు నిల్చున్నారు. మాధవ్ చాలా బాగున్నాడు. నన్ను చూపించి సైగలతో చెప్తోంది, నేనంటే తనకెంత ఇష్టమోనని. అతను నా వైపు ప్రేమగా చూస్తూ దగ్గరికి వచ్చి గట్టిగా హత్తుకున్నాడు నన్ను. వాళ్ళిద్దరినీ చూస్తుంటే నాకెంతో ముచ్చటేసింది. తులసి మనసు తెలుసుకుని ప్రవర్తించే మనిషి దొరికాడు అంతే చాలు.

తనుకూడా తులసిలాగే నాతో అప్పుడప్పుడు ముచ్చట్లాడేవాడు. వాళ్ళిద్దరూ కలసి తమ ప్రణయకలహాల వివరాలను నాతో పంచుకునే వారు. తులసీమాధవుల అనురాగాల కులాసాల జోరులో కాలపు వేగమే తక్కువనిపించింది. రెండు సంవత్సరాలు గడిచాయి.

ఒకరోజు తులసి చాలా విచారంగా నా ముందు కూర్చుంది. దీర్ఘంగా ఆలోచిస్తూ గంటపైనే ఉండిపోయింది. మాధవ్ వచ్చాడు. తన తలపై అనునయంగా చెయ్యివేసి దగ్గరకి తీసుకున్నాడు. మాధవ్ ఎదపై తలపెట్టిన తులసి కాస్సేపు తరువాత బొటబొటా కన్నీరు కారుస్తుంటే, తులసి కళ్ళను మునివేళ్ళతో తుడిచి తమ భాషలో ఏదో చెప్పాడు.

ఇంతలో ఎవరో తలుపు కొట్టడంతో ఇద్దరూ ఒకరి నుండి ఒకరు దూరంగా జరిగారు. తులసి అత్తగారు వచ్చింది. ఎరుపెక్కిన కళ్ళతో ఉన్న తులసిని చూసి, "ఒక్క ఆరునెలలే కదా తులసీ! ధైర్యంగా ఉండమ్మా. అయినా మాధవ్ ఆఫీసు పని మీద మూడు, నాలుగు ఊర్లలోని ఎన్నో బ్రాంచిలు చూసుకు రావాలి. అలాంటప్పుడు నిన్ను తనతో ఎక్కడకీ తీసుకెళ్ళడానికి కుదరదు!" అంది అనునయంగా తులసిని దగ్గరకు తీసుకుని.

"నెలరోజుల్లో వచ్చే దసరాలకు తనెలాగూ ఇంటికి వస్తాడు. తర్వాత నువ్వు మీ పుట్టింటికి వెళ్ళి హాయిగా ఉందువు గాని. మళ్ళా మాధవ్ వచ్చే వారం రోజుల ముందు వచ్చేసావంటే సరి." అంది తులసి చెయ్యి తన చేతుల్లో తీసుకుంటూ.

తల్లీకొడుకులిద్దరూ చెరోవైపూ కూర్చుని సముదాయిస్తున్న తీరు చూసి, తులసి అదృష్టానికి పొంగిపోయాను.

***

అప్పటికి వారం రోజులయింది మాధవ్ ఊరెళ్ళి. ఆ రోజెందుకో తులసి ఒంట్లో నలతగా ఉంది. పొద్దున్న నుండీ ఎక్కువగా పడుకునే ఉంది. సాయంత్రమయింది. అత్తగారు, తోటికోడలు పట్టుచీరలు బంగారు ఆభరణాలతో ముస్తాబయి మంచం మీద పడుకుని ఉన్న తులసి పక్కన కూర్చున్నారు. వాళ్ళను చూసిన వెంటనే దిగ్గున లేచి కూర్చుంది.

"ఇప్పుడు బాగానే ఉందా తులసీ! మాతో పెళ్ళికి రాగలవా?" అడిగింది అత్తగారు.

బానే ఉంది కానీ కొంచెం రెస్టు తీసుకుంటాను, రాలేనని చెప్పింది.

"సరే! నీకు వంట చేసి ఉంచేస్తాము. తినేసి పడుకో. తెల్లవారుఝాము పెళ్ళిముహూర్తం చూసుకుని రేపు పొద్దున్నే వచ్చేస్తాము. నీకేది అవసరమయినా మాకు వెంటనే ఫోన్ చెయ్యి." సరేనని తలూపుతూ వాళ్ళని సాగనంపడానికి తలుపు వరకు వెళ్ళింది.

మామగారు కూడా దగ్గరకొచ్చి, "రెస్టు తీసుకోమ్మా. తలుపలవీ మేం వేసుకువెళ్తాం. ఒక తాళం చెవుల సెట్టు నీ దగ్గరుంది కదా!" అన్నారు. ఉందని తలూపుతూ, తోటికోడలిని అడిగింది తులసి, 'బావగారేరని.'

"తనకి ఆఫీసులో పనుందట. ముహూర్తం వేళకి వస్తానన్నారు. ఇప్పుడు క్యాబ్ బుక్ చేసుకున్నాం. వచ్చేటప్పుడు తనుంటారు." అంది తోటికోడలు.

వాళ్ళు వెళ్ళిన తరువాత కాస్సేపు మాధవ్ తో ఫోన్లో ఛాట్ చేస్తూనే ఏదో కొంచెం తినేసి తిరిగి పక్కమీద వాలిపోయింది. మాధవ్ తో చాట్ చేసిన తరువాత కొంచెం హుషారుగా కనిపించింది తులసి. ఫోన్ చూస్తూనే పడుకుండి పోయింది లైటు కూడా ఆర్పకుండా.

కాలింగ్ బెల్ పదేపదే మోగడంతో తెలివొచ్చి లేచి కూర్చుంది. గబగబా బయటకెళ్ళింది. ఐదు నిమిషాల తరువాత మొదట తులసి వచ్చింది గదిలోకి. తరువాత తులసి బావగారు వచ్చారు. మనిషి కొంచెం తూలుతూ ఉన్నాడు. "సారీ తులసీ. నా దగ్గర స్పేరు తాళాలు లేవు. అందుకే నిన్ను లేపాల్సి వచ్చింది. ఆఫీసు పార్టీలో కొంచెం డోస్ ఎక్కువయింది. నేనిక పెళ్ళికి కార్ డ్రైవు చేసుకుంటూ వెళ్ళలేను. గుడ్ నైట్" అంటూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన వైపే చూస్తూ పడుకుంది లైటార్పకుండానే నిద్రమత్తులో. ఒక గంట తర్వాత పక్కకి ఒత్తిగిల్లిన తులసికి ఏదో అడ్డు తగలడంతో తెలివొచ్చింది. బావగారు తన పక్కనే పడుకుని ఫోను చూస్తున్నారు. వెంటనే దిగ్గున లేచి కూర్చుంది. "ఆ! పడుకో పడుకో తులసీ. నువ్వు వాడే సెంటు ఫ్లేవర్ ఏంటి చాలా బాగుంది." అంటూ పడుకునే చాలా కాజువల్ గా మాట్లాడుతున్నాడు.

తులసి వెంటనే తలుపు దగ్గరికి వెళ్ళింది. "తలుపుకు ఇన్నర్ లాక్ వేసేసాను. ఇదిగో నా దగ్గరుంది తాళం." అని చూపించాడు. అతని దురుద్దేశం అర్థమయింది. వెంటనే గట్టిగా అరుస్తూ బయటకు పొమ్మని చూపించింది చేత్తో.

"ఊరంతా పెళ్ళిళ్ళ హడావుడిలో ఉన్నారు. నీ మూగ అరుపులు ఇంత రాత్రివేళ ఎవరికీ వినబడవు. సరే కాలయాపన ఎందుకు. నువ్వన్నా, నీ అందమన్నా నాకెంతో పిచ్చి. నీతో గడపాలని ఎప్పటినుండో నాకుంది. ఈ రాత్రికది కుదిరింది. మరేమీ కాదనక సరదాగా గడిపెయ్. నేను మరింకెప్పుడూ నిన్నిబ్బంది పెట్టను. ఈ ఒక్కసారే. ఎవరికీ చెప్పను. కొంచెం కోపరేట్ చెయ్యి." అంటూ లేచి తులసి దగ్గరకొచ్చి తన చెయ్యి పట్టుకున్నాడు. విదిలించి కొట్టి అతనికి దూరంగా వెళిపోయింది.

తన బావగారేనా ఇలా ప్రవర్తిస్తున్నది? తానీ ఇంట్లో అడుగు పెట్టిన దగ్గర నుండీ ఇప్పటి వరకూ అతనిలో ఇలాంటి ఉద్దేశమున్నట్లు ఎప్పుడూ బయటపడలేదే! అమ్మో! ఇంత కుళ్ళు మనసులో దాచుకుని ఎంతలా

అవకాశం కోసం చూస్తున్నాడు? ఈ ఆలోచలనతో ఆందోళన ఎక్కువయింది తులసికి. తన ఫోన్ కోసం వెతుకుతోంది.

"నీ ఫోనా? ఇదిగో ఇక్కడుంది!" అని ఇచ్చాడు. ఆత్రంగా అందుకున్న తులసి ఫోన్ చూసి హతాశురాలయింది. అందులో ఏమీ కనబట్టం లేదు.

"మనకి డిస్టర్బెన్సు ఎందుకని నేనే దాన్లో బేటరీ తీసేసాను" అన్నాడు నవ్వుతూ.

నిలువునా కూలబడిపోయింది. అయ్యో నా చిట్టితల్లీ! మనిషిలో దాగున్న మదపు మృగం ఇలా బయట పడుతుందని కలలోనైనా ఊహించి ఉండలేదే? ఏం చేయడమిప్పుడు?

తటాలున లేచి అతని చేతిలో ఫోన్ లాక్కోవడానికి ప్రయత్నించింది. కానీ అతని పశుబలం ముందు తన శక్తి చాల్లేదు. తులసిని దూరంగా తోసేసాడు. ఆ తోపుడుకు మంచం మీదకి పడిపోయింది.

"మనిద్దరమూ ఒకే కుటుంబంలోని వాళ్ళం. ఒకేఇంట్లో ఉంటున్నాం. మనమధ్య ఈ తోపులాటలేంటి చెప్పు అసహ్యంగా?" అంటూ తను కూడా మంచం మీదకు వచ్చేసి, తులసి మొహం మీద మొహం పెట్టి అన్నాడు.

చ! చ! ఏంటి వీడి వికృత స్వభావం? నా బంగారుతల్లి ఇప్పుడెలా ఈ గండం నుండి బయట పడ్డం?

"తులసీ! టైము వేస్టు చెయ్యకు. బెట్టు చేయకింక" అంటూ తన మీదకి వస్తున్న అతన్ని బలంకొద్దీ తోసేసి పరిగెత్తి నా దగ్గరికి వచ్చేసింది.

"ఇదిగో నాలో రాక్షసుడిని నిద్ర లేపకు. నేనిక్కడే ఉంటాను. వచ్చేయ్." అని తులసిని చూస్తూ తన చొక్కా బనియనూ తీసేసాడు.

అది చూసి బాత్రూంలోకి పరిగెత్తి పారిపోయింది. "బాత్రూం లోపలి గడియ, ఇందాకలే విరిగిపోయింది!" అంటూ నవ్వుతున్నాడు.

అయ్యో నా చిట్టితల్లికి ఎంత కష్టమొచ్చింది? ఇపుడెలా తనని కాపాడడం? ముద్దుల తులసి జీవితంలో అందమైన ఎన్నో మధుర క్షణాలకు సాక్షిగా నిల్చిన నేను, ఇలాంటి ఘోరమైన ఘటనను చూస్తూ ఉండాలా? ఎంత దురాలోచనలతో అన్నిదార్లూ మూసేసాడు! తులసి ఈ క్రూరమైన మగమృగపు కుటిలమైన వేటకి బలిపశువు కావల్సిందేనా?

"తులసీ నువ్వు రాకపోతే ఇదిగో నా చేతిలో స్టీలుసీసా ఉంది చూసేవా... అది విసిరేస్తాను, నీ మీదకి కాదు. నువ్విష్టపడి తెచ్చుకున్న అద్దం మీదకి. అది బద్దలయిపోతే నన్నేమనకూడదు." అని హెచ్చరిక చేసాడు. అయినా అటునుండి ఏ సమాధానమూ లేదు.

“రాకు తల్లీ నా వైపు రాకు. నువ్వక్కడే ఉండు.” అనుకున్నాను.

ఐదు నిమిషాల తరువాత దుర్మార్గుడు, అనుకున్నంతా చేసాడు. తులసిని లోబర్చుకోవడానికి, మానసికంగా బలహీనురాలిని చెయ్యడానికి, తన చేతిలో ఉన్న స్టీలుసీసా నా మీదకి విసిరేసాడు.

పెద్ద శబ్దంతో ఒక పక్కంతా నిలువునా బద్దలయిపోయాను. ఆ శబ్దానికి ఏడుస్తూ పరుగున వచ్చి నన్ను కావలించుకుంది తులసి. నన్ను పట్టుకుని ఆపుకోలేని దుఃఖంతో విలపిస్తూ ఉండిపోయింది.

"చాలింక. రావాలి పిల్లా. సరే, నేనే వచ్చితీసుకెళ్తాలే" అని నన్ను పట్టుకు ఏడుస్తున్న తులసి దగ్గరకొచ్చి బలవంతంగా లేపాడు.

కట్టలు లు తెంచుకున్న ఆవేశంతో ఊగిపోయింది తులసి. తన అసహాయతని అలుసుగా తీసుకున్నందుకు, తనకు ప్రియమైన నన్ను  ఛిద్రం   చేసినందుకు వాడికి సరైన శిక్ష వేయాలనుకుంది.

ఒక బద్దలైన అద్దంముక్కను ఎప్పుడు తీసుకుందో తన చేతుల్లోకి తెలియదు కానీ, ఆ అద్దం ముక్కతో ముందూ వెనకా, క్రిందాపైనా చూడకుండా ఆ కామాంధుడిని మెరుపు వేగంతో చాలా చోట్ల పొడిచేసింది. వాడు కేకలు పెడుతున్నా పట్టించుకోకుండా, నేలమీదకి తోసి మరీ.  గాయాలనుండి రక్త స్రావం, నొప్పి ఎక్కువయి వాడు స్పృహకోల్పోయాడు.

వెంటనే వాడి ఫోన్లోంచే మాధవ్ కు, అత్తగారికి, తోటికోడలికి మెసేజులు పెట్టింది, ఆ గోముఖవ్యాఘ్రపు అసలు రంగు తెలిపే అక్కడి ఫొటోలతో సహా.

హమ్మయ్యా! నా బంగారుతల్లి బ్రతుకు భద్రంగా ఉంది. నేను బద్దలైనా సరే.  ఆడపిల్లని అద్దంలా, అందంగా పదిలంగా చూసుకోవాలి. కాదని అసహ్యంగా ప్రవర్తిస్తే శిక్ష తప్పదు.

ఆనాటి విషాదకర, అవాంఛనీయ సంఘటన తరువాత ఇంట్లో వాతావరణం గంభీరంగా మారిపోయింది. తులసి బావగారిని అందరూ దాదాపుగా వెలివేసినట్టుగా ప్రవర్తించారు,  తన భార్యతో సహా. తొందర్లోనే వాళ్ళు వేరే ఇంటికి మారిపోయారు. మాధవ్ కి, అతని తల్లిదండ్రులకి తులసి మీదా, నా మీద మునుపటి కన్న ప్రేమ ఎక్కువయింది. నాకు నిలువుగా ఒకపక్క బద్దలైన ప్రదేశానికి అతుకులు వేసి కొత్తగా తయారుచేసారు, కాని నన్ను ఆ ఇంట్లోంచి పంపేయలేదు.

తులసిది, నాదీ అంత ఆత్మీయబంధం మరి.

***0***

# దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



# రీయూనియన్

## ఓలేటి శశికళ

విశాఖతీరంలో అందమైన రిసార్ట్స్ అవి! ప్రకృతి రమణీయత, నాగరికతల సమ్మిళనంలా, అత్యాధునికమైన విలాసవంతమైన సౌకర్యాలతో చాలా ఆహ్లాదంగా ఉన్నాయి.. ఆ పరిసరాలు! ఒక పక్క సముద్రపుటలల ఘోష, మరొక ప్రక్క ముప్పై యేళ్ళ తరువాత కలిసిన ఓ వందమంది స్నేహబృందపు నవ్వుల, తుళ్ళింతల, ఎప్పటెప్పటి కబుర్ల కలబోతల హోరు, ఆ ప్రశాంత వాతావరణాన్ని ధ్వని ప్రకంపనలతో నింపేస్తున్నాయి! ఇంత హడావిడిలో మనిషక్కడ, మనసెక్కడోలా ఉన్నది 'మానస' ఒక్కతే!

పునఃపరిచయ కార్యక్రమాలూ, కుటుంబ నేపథ్యాలూ, ఉద్యోగ, వ్యాపార విజయాలూ, ఉదయమే ఆడిటోరియమ్ లో ఫార్మల్ గా పూర్తయ్యాయి. కొందరి పరిచయాల్లో ఆత్మస్తుతీ, అహంభావం తొంగిచూస్తుంటే, కొందరిలో విజయంతో పాటూ వినయాన్నీ వరించిన వినమ్రత! కొందరిలో జీవితంలో అనుకున్నది సాధించలేకపోయిన ఉక్రోషం, మరికొందరిలో ఉన్నంతలో సుఖంగానే ఉన్నామన్న సంతృప్తి! కొందరిలో ఆ చిన్నప్పటి దర్పం, ఢాంబికం కొత్త రూపు దాల్చుకుంటే, మరికొందరిలో అదే దాస్యభావన.. ఎవరేం చెప్పినా ఒదిగి ఒదిగి వింటూ!

గత ఆరునెలలుగా వాట్సాప్ గ్రూప్ గా తయారయ్యి, ఒకరితో ఒకరు మనసులు విప్పి మాట్లాడుకుంటూ, బాల్య స్మృతులతో పాటూ వర్తమాన జీవిత విశేషాలూ పంచుకుంటూ, చిన్నప్పటి బిడియాలూ, హద్దులన్నీ చెరుపుకుని, చక్కని సుహృద్భావంతో ఇప్పుడు ఈ రీయూనియన్ ఏర్పాటు చేసుకున్నారు వీరంతా!
సాయం సంధ్యవేళ అందరూ రిసార్ట్స్ చుట్టూ ఉన్న పచ్చిక బయళ్ళలో చేరారు! మారిన జీవన ప్రమాణాలకు, జీవన విధానాలకూ ప్రతీకలా ఉంది అక్కడ వాతావరణం! అలవాటుగానో, మరి అవకాశం దొరికిందనో, మగవాళ్ళందరి చేతుల్లో మిలమిల మెరుస్తున్న ద్రావకాల గ్లాసులే! మేమూ సాధికారత సాధించాం, మాకేంటి తక్కువ అనుకుంటూ, షాంపేయిన్ గ్లాసులతో అధికశాతం ఆడవాళ్ళు! మానసకు ఎందుకో ఉక్కిరిబిక్కిరిగా ఉంది ఈ వాతావరణం!

తన తోటివాళ్ళంతా... కలకలలాడుతూ, ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతూ, జోక్స్ వేసుకుంటూ, పడీపడీ నవ్వుతుంటే, ఎక్కడలేని ఆత్మన్యూనతా ఆవహించింది మానసను. మొదటి రోజుకే తనకింత నిస్సత్తువ ఆవహిస్తుంటే, ఇంకా మూడురోజులు అక్కడే... ఆ వాతావరణంలో ఎలా ఉండాలో అర్థం కావడం లేదు.

అసలు రీయూనియన్ కు రావడమే అతిపెద్ద సాహసం తన జీవితానికి! ఎన్ని అభ్యర్ధనలు, ఎన్ని వాదనలు, ఎన్ని గొడవలు తనింట్లో... తనకూ, భర్తకూ మధ్య! ఆఫ్టరాల్ నాలుగు రోజులు తనను స్వేచ్ఛగా వదలడానికి! భర్త గుర్తు రాగానే వెంటనే ఫోన్ లోకి తొంగిచూసింది. అతని నుండి ఎలాంటి మెసేజ్ లేదు. ఎందుకో వెన్నులో చలి... వెళ్ళాకా ఎదురుకోబోయే మాటల బాణాలు తలుచుకుని!
“ఛీ! ఏం జీవితం తనది. ఈ వందమందిలో చదువులో టాపర్ తను! తన అందానికి దాసోహం అంటూ ప్రేమలేఖలు వచ్చేవి ఆరోజుల్లో. గళం విప్పి పాడినా, కుంచెతో ఓ గీత గీసినా... కప్పు గెలుచుకుని రావలసిందే! 'వివాహం విద్యానాశాయ' అన్నట్టు... పెళ్ళి, ఉమ్మడికుటుంబం, ఆంక్షల కాపురం తన కలలను, ఆశలను, చదువునూ నిర్దాక్షిణ్యంగా అణిచేసి, ఈ రోజు వీళ్ళందరి ముందూ తననొక పనికిమాలిన దాన్నిలా నిలబట్టాయి” ఉక్రోషం ముంచుకొస్తుంటే, అన్యమనస్కంగా ఉంది ఆమె అంతరంగం!
“ ఏంటి మానసా! వాట్సప్ లో ఎంత హుషారుగా ఉన్నావ్ మొన్నటిదాకా! ఏమయింది సడన్ గా, అంత ముభావంగా మారిపోయావ్? ఇంట్లో బేగేజ్ ఇక్కడకూ మోసుకొచ్చావా? వదిలేయవే తల్లీ! రా... అక్కడ మన గుంపులో కూర్చుందాం. ఆనంద్ బెంగ పెట్టేసుకున్నాడు నీ గురించి!” అంటూ లాక్కుపోయింది నీరజ... మానస జీవన పరిస్థితులు చూచాయిగా తెలిసిన చనువుతో!
“ఛ! అలాంటిదేం లేదే! రేపు మా అమ్మాయి....” అంటూ ఏదో చెప్పబోతుంటే..
”కమాన్ మానసా! కాసేపు ఆలంపటాలు పక్కన పెట్టు. అక్కడ ఆనంద్, గుణ పాటలు పాడుతున్నారు! నీచేత పాడించమని అందరూ గోల!” అంటూ లాక్కుపోయింది నీరజ!
చుట్టూ పిండారపోసినట్టు వెన్నెల! అక్కడక్కడా బుట్టల నిండా కళాత్మకంగా అమర్చిన మల్లెలు, జాజులు, సంపెంగలు... గాలిని పుష్పసుగంధాలతో నింపేస్తోంది. మానస మనసులో దృఢనిశ్చయంగా అనుకుంది ”ఎంతో పోరుపెట్టి సాధించుకున్న అవకాశం! స్నేహితులతో ఎంజాయ్ చెయ్యకుండా... ఏంటీ ఇంటి జంఝూటన!” అనుకుంటూ, తల విదిల్చుకుంది! కాసేపటికే ఆమెలోని బాల్యం పునర్జీవితమైంది. అందరితో కలిసిపోయి, ఆ క్షణాలను ఆస్వాదించడం మొదలుపెట్టింది.
“నిండుపున్నమి పండువెన్నెలలో.. నిను చేరగనే సెటుల రాగలనో..
తెల్లతెల్లని బొండు మల్లెలతో తనువంతా..
చల్లగ దాచుకుంటేనూ...” అంటూ ఆమె గొంతెత్తి శ్రావ్యంగా పాడుతుంటే, ఆ గాత్రమాధుర్యానికి అందరూ మంత్రముగ్ధులయ్యారు!

పాట ముగించగానే, ఆనంద్ ఒక బుట్టెడు మల్లెలు, ఉన్నఫళంగా మానస మీద గుమ్మరించేసాడు. అతని చేష్టకు ఒక్కసారి నిశ్చేష్టురాలయిపోయింది మానస! అందరూ చప్పట్లు కొడుతుంటే, ఏమనలేక నవ్వేసి ఊరుకుంది.

ఆ ప్రశంసలు, ఆ మెచ్చుకోళ్ళు మానసను ఎక్కడికో మోసుకుపోయాయి. ఎన్నాళ్ళయింది తనకు తానుగా, తన ప్రతిభను ప్రదర్శించి! ఎక్కడికెళ్ళినా... భర్త వెనుక మరబొమ్మలా... "జడ్జిగారి భార్య" హోదాలో, అక్కరలేని మొహమాటపు మన్ననలు అందుకుంటూ... "హు! ఎంత పరాధారపు బ్రతుకు తనది" అనుకుందామె!

స్కూల్లో, కాలేజీలో తన నోట్సులు చదివి పాసయిన మిత్రురాళ్ళు ఈరోజు పెద్దహోదాల్లో! తను మాత్రం... ఇల్లు, పిల్లలు, అత్తమామలంటూ, అసూర్యం పశ్య జీవితం!" పదేపదే తనను వారితో పోల్చుకుంటూ... అసూయతో భగ్గుమంటోంది ఆమె మనసు! తన తెలివితేటలను బుగ్గిపాలు చేసి, తనింటిని పుష్టి చేసిన భర్త మీద కోపం ఉవ్వెత్తున లేచింది!

ఎవరో కవితలు చదవడం మొదలుపెట్టారు. విసుగొచ్చి, మెల్లగా అక్కడ నుండి జారుకుని, దూరంగా విరగపూసిన పున్నాగచెట్టు కింద పూలతివాచీ పరిచినట్టున్న బెంచీ మీద కూర్చుంది. ఆమె కళ్ళు తన అపజయాలను, అసమర్థతలూ తలుచుకుంటూ కన్నీటి చెలమలవుతున్నాయి.

"నా జీవితం నాకు మళ్ళీ మొదలు పెట్టాలనుంది! నాబాల్యాన్ని నాకియ్యి భగవంతుడా!" అని మొరెత్తి అరవాలనుంది. ఒంటరిగా ఏ దూరతీరాలకో పారిపోవాలనుంది ఆమెకు!

"మానసా!" మార్దవమైన పిలుపు... ఆనంద్ ది! ఒక్కసారి మొహం తిప్పుకుని, కన్నీరు తుడుచుకుని, అతని వేపుకు తిరిగింది. ఆమె అనుమతి లేకుండానే, బెంచీ మీద, ఆమె పక్క కూర్చున్నాడు అతను! మెల్లగా మానస చెయ్యి తనచేతిలోకి తీసుకుని, "ఏంటిరా తల్లీ ఇది? ఏమయింది? అలా పువ్వులు పొయ్యడం తప్పే! క్షమించు. అందరికీ దూరంగా.. అమెరికాలో ఉండిపోవడంతో కొన్ని మన సభ్యతలు మర్చిపోయాను!" అంటూ మెత్తగా పలుకుతుంటే... ఎన్నాళ్ళ నుండో తను కోరుకుంటున్న సాంత్వనేదో మనసుకు దొరికినట్టుంది మానసకు!

ఆరునెలలు గ్రూప్ చాట్స్ లో బాగా దగ్గరయ్యాడు ఆనంద్. చక్కని సెన్స్ ఆఫ్ హ్యూమర్, అంతర్జాతీయంగా పేరున్న శాస్త్రవేత్తగా... తన పరిశోధనల పట్ల మానస చూపే ఆసక్తి చూసి, ఆమెతో తరచూ శాస్త్రవిషయాలు చర్చిస్తూ, బాగా దగ్గరయ్యాడు ఆనంద్! ఏనాడూ తన హద్దులు మీరని మానసంటే విపరీతమైన గౌరవమూ, ఆమె అపారమైన తెలివితేటలు బూడిదలో పోసిన పన్నీరయ్యాయని బాధ.. అతనిలో!

"ఇట్స్ఓకే ఆనంద్! నేనసలు పట్టించుకోలేదు అది! ఇక్కడకు నా భర్త అభీష్టానికి వ్యతిరేకంగా వచ్చా! వచ్చాకా నేను కోల్పోయినది నాకు భూతద్దాలలో కనిపిస్తూ, చాలా అశాంతికి గురిచేస్తోంది. ఎన్నో సాధించాలని చదువుకున్నా. కానీ ఇంటి సాంప్రదాయం, ఇంటి కోడళ్ళు ఉద్యోగాలకు వెళ్ళకూడదంటూ..

ఆంక్షల చట్రంలో బిగించేసారు నన్ను. ఆ సప్రెస్డ్ ఏంగర్ నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జీవితంలో ఏదో ఒక గట్టి నిర్ణయం తీసుకోమని నన్ను ప్రేరేపిస్తోంది. కేన్ యూ హెల్ప్మీ ప్లీజ్!" అంటూ ఆనంద్ చెయ్యి ఆర్తిగా పట్టుకుని, వెక్కివెక్కి ఏడవసాగింది మానస!

ఒకప్పటి తన ఆరాధ్యదేవత, తనలాంటి వాడి కేసి కన్నెత్తి కూడా చూడని అభిజాత్యపు అమ్మాయి... అలా అబలలా ఏడుస్తుంటే, తట్టుకోలేక పోయాడు ఆనంద్!

"నాతో వచ్చేయ్ మానసా! నిన్ను అమెరికా తీసుకుపోతాను. అతన్ని వదిలిపడేయ్! నేనెలాగూ సింగిల్ ! నీకు వీసా తెప్పిస్తా! అక్కడ కొత్త జీవితం మొదలుపెట్టు! కెమిస్ట్రీలో రీసెర్చ్ చేద్దువుగాని. నీ సొంత పేటెంట్స్ చేద్దువుగాని. నీ తెలివికి తగ్గ గుర్తింపు, డబ్బు పుష్కలంగా సంపాదించచ్చు. నీకు నా మద్దతూ, సహాయం ఉంటాయి! నీకిప్పుడు నలభై ఐదేళ్ళు. అమెరికాలో అరవై ఏళ్ళొచ్చాకా జీవితం మొదలు పెడతారు! నీలాంటి మేధావికి, అక్కడ రెడ్ కార్పెట్ వేస్తారు. రెండేళ్ళలో డాక్టరేట్ నీ చేతిలో ఉంటుంది!" మెత్తగా చెవిలో అమృతం పోసినట్టు ఉన్నాయి అతని మాటలు... మానసకు!

క్షణాల్లో తన దుఃఖమంతా మరిపించేలా... ఎంత అందమైన కల!

ఆ క్షణంలో ఆనంద్ పరాయివాడిలా అనిపించలేదు మానసకు. పెళ్ళయినప్పటి నుండి తను అనుభవిస్తున్న మనోవ్యధ, భర్త కోపం, తన కెరియర్ పట్ల అతను చూపించే ఉదాసీనత, తను జీవితంలో అగాధంలా పేరుకుపోయిన అసంతృప్తి.., అన్నీ గోడువిప్పి చెప్పుకుంది. ఏనాడూ తన కన్నతల్లితో కూడా పంచుకోని ఎన్నో ఆంతరిక విషయాలు అతనితో విడమర్చి చెప్పుకుంది. అలా మాట్లాడుతుంటే కొండంత భారం దించుకున్నట్టు ఉంది ఆమెకు. ఆమె ఎంత గుట్టు మనిషో ఆమె స్నేహితురాళ్ళకు తెలుసు. ఆమె గుండె గోడలను దాటి ఒక్క విషయమూ వెలికిరాదని తెలుసు వారికి. అలాంటిది... అతి తక్కువ పరిచయంలో, ఇంచుమించు అపరిచిత వ్యక్తితో ఇన్ని మాటలు మాట్లాడడం.. ఆమెకు ఆ సమయంలో అతనే సరయిన వ్యక్తిగా తోచాడో ఏమో!

ఆ మర్నాడంతా మానస మనసు చాలా ఆహ్లాదంగా ఉంది. కారణం ఆనందా .. అంటే పాక్షికంగా అవునూ, పాక్షికంగా కాదు. ఆ రోజు చర్చ పిల్లల గురించి జరిగింది. కొందరు ఇష్టంగా, కొందరు క్లుప్తంగా, కొందరు అయిష్టంగా చెప్పుకొచ్చారు. కారణం పెద్దగా చెప్పుకోవడానికి లేకపోవడమే! మానస మాత్రం, ఒక గంట క్రితం నుండి క్లౌడ్ నైన్ మీద ఉంది. దానికి మొదటి కారణం... ఆమె భర్త చేసిన ఫోన్ కాల్!

హైకోర్ట్ జడ్జిగా ఎప్పుడూ బిజీగా, మునివేళ్ళ మీద ఉండే ఆయన, ఆరోజు చాలా ప్రసన్నంగా ఫోనులో ఆమెతో మాట్లాడారు. తల్లితండ్రులను చూసుకోడానికి తన చెల్లెల్ని రప్పించానని, మనసులో ఎలాంటి ఒత్తిడీ లేకుండా హాయిగా ఎంజాయ్ చెయ్యమని, ముందు రాత్రి అమ్మాయిలిద్దరూ, తనతో మాట్లాడి, తన ధోరణి మార్చుకోవాలని, ఇంటి కోసం అంత చేస్తున్న అమ్మకు కూడా తన స్వేచ్ఛ , స్పేస్ ముఖ్యమని అంటూ, ఇంకేవేవో చెప్పారట! 'అందుకని... కాసేపు బాధ్యతలూ, బరువులూ మర్చిపోయి ఆనందంగా గడపమని'

ఆయన మాటల సారాంశం! తన కన్నా ఎనిమిదేళ్లు చిన్నదయిన భార్యను... కంట్రోల్ చేస్తూ, అతిశయం ప్రదర్శించే భర్త, అంత ఆత్మీయంగా మాట్లాడడం మానసకు చాలా బాగా అనిపించింది.

మరొక ముఖ్యమైన వార్త ఆమె పెద్దకూతురు... యుపీఎస్ సీ పరిక్షలో జాతీయస్థాయిలో నాల్గవ రేంక్ లో నిలిచిందని అందిన వార్త!

మానస తన కూతురి విజయాన్ని అందరితో పంచుకుంటుంటే, అందరిలో చిన్న అసూయారేఖ పొడిచూపినా, అంతలోనే సర్దుకుని, మానసను పొగడ్తలతో ముంచివేసారు. తన కెరియర్ ను పక్కన పెట్టి, పిల్లలను తీర్చిదిద్దుకున్న మానసదే ఆ విజయం.. అనడం, మానసకు ఎనలేని సంతృప్తి కలిగించింది.

మరో రెండు రోజులు సునాయాసంగా గడిచిపోయాయి. ఆ నాలుగు రోజుల్లో తమ బాల్యాన్ని ఎంత వరకూ పునర్మించుకున్నారో తెలియదు కానీ, అందరి మధ్యా చక్కని స్నేహం, సుహృద్భావం నెలకొంది! ఏవో కారణాల వలన తమ సహచరుల నుండి విడిపోయి, సింగిల్ గా ఉంటున్న రెండు జంటలు కలిసి కొత్తజీవితం ప్రారంభించబోతున్నామని అనౌన్స్ చెయ్యడం... అందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచింది.

ఆఖరి రోజు వీడ్కోళ్ళు అయిపోయాయి. అప్పటికే అందరికీ ఇళ్ళ మీద ధ్యాసలు మొదలయ్యాయి. స్నేహితుల ముచ్చట్లు తగ్గి, ఇంటి ముచ్చటలు ఎక్కువయ్యాయి కబుర్లలో! ఈ మూడురోజులు ఆనంద్, మానసతో.. అదే స్నేహం, అదే దయతో ఉంటున్నాడు. ఆమె తనతో షేర్ చేసిన విషయాలను అనువుగా తీసుకుని, ఎటువంటి అడ్వాన్స్ మెంట్ కనిపించడం లేదు. మానసకు ఎందుకో అది ప్రాణానికి హాయిగా ఉంది! ఇంట్లో వాతావరణం సానుకూలంగా ఉంది. తను ఇంటిగుట్టు బయటపెట్టుకుని లోకువ చేసుకున్నానా అని అంతర్మధనం ఆమెలో!

ఆరోజు తన రెంటెడ్ కారులో మానసను ఎయిర్ పోర్టుకు తీసుకెళ్ళాడు ఆనంద్! దారంతా టెన్షన్ గానే ఉంది మానసకు... ఆనంద్ ఏమడుగుతాడో, తనేం సమాధానం చెప్పాలో... అని!!

సన్నగా ఇళయరాజా పాటలు పెట్టి, మౌనంగానే డ్రయివ్ చేస్తూ ఎయిర్ పోర్ట్ దగ్గర వదిలాడు మానసను. లోపలికి వెళ్ళబోతుంటే.."మానసా!" అని పిలిచాడు! మానస గుండె వేగంగా కొట్టుకుంది.. ఏం వినాలా అని! ఆనంద్ కారులోంచి ఒక తెల్లకవర్ తీసి చేతిలో పెట్టాడు.

"దీంట్లో నీ యుఎస్ వీసా అప్లికేషన్, నేను పనిచేసే యూనివర్సిటీ తరుఫున స్పాన్సర్ షిప్ తో సహా, అన్ని పేపర్ల నకళ్ళు ఉన్నాయి. నేను యుఎస్ వెళ్ళగానే.. అసలయిన ప్రోసెసింగ్ మొదలుపెడతా! అవన్నీ చూసే ముందు, నువ్వు దానిలో ఇంకో కాగితాన్ని చదవడం మర్చిపోకు! వీలయితే.. విమానంలోనే చదివేయ్!" అంటూ మానస బుజం మీద ఆప్యాయంగా చేతులు వేసి, " నువ్వెప్పుడూ ఆనందంగా ఉండాలి మానసా! నీకెప్పుడూ నేనున్నానని మర్చిపోకు!" అంటూ మృదువుగా భుజం తట్టి, సెలవు తీసుకున్నాడు ఆనంద్!

ఎందుకో తెలియదు మానస మనసంతా.. అతని పట్ల ఆత్మీయతతో నిండిపోయి, కళ్ళు చెమర్చాయి!

బోర్డింగ్ పూర్తి చేసుకుని, ఫ్లయిట్ లో కూర్చోవడం తోనే తెల్లకవర్ తెరిచి, దానిలో ఆనంద్ చెప్పిన తెల్లకాగితాన్ని తీసింది. ఆమె ఊహించినదే.. ఆనంద్ రాసిన ఉత్తరం!

“మానసా!

ఎంత పిచ్చితల్లివి నువ్వు! ఏదో ఉడుకుమోత్తనమే కానీ నిజంగా నువ్వు నీ కుటుంబాన్ని వదలగలవా? నువ్వు నీ కుటుంబానికి బేలన్సింగ్ ఫాక్టర్ వి. నువ్వు అటూ ఇటూ తూగితే అల్లకల్లోలం అయిపోదూ.. ఆ అందమైన సంసారం! చూసావుగా నాలుగురోజులు. అందరూ నటనలో నిష్ణాతులైపోయారు. ఏ ఒక్కరి జీవితం సవ్యంగా లేదు. భార్యలతో సఖ్యతలు లేనివాళ్ళు, భర్తలు దారి తప్పిన వాళ్ళు, ఇద్దరూ బాగుంటే... సంతానం సరయిన దారిలో లేక! అయినా అన్నీ మర్చిపోయినట్టు, నటించి గడిపేసారు. నీకు నటించడం రాక బాధపడ్డావు. వద్దమ్మా! ఎండమావుల వెంట పరుగులు వద్దు! జీవితంలో సాధించ దలుచుకున్నది... నీ కుటుంబంతో ఉంటూనే సాధించు. ప్రతీదీ అడగాలి. అడిగే విధానంలో అడగాలి, నచ్చచెప్పాలి, సాధించుకోవాలి. నీలో నువ్వే ముడుచుకుని పోతూ, అక్కరలేని అభిజాత్యంతో, ఆత్మన్యూనతతో, ఆత్మీయులకు దూరమైపోతూ, ఏవీ పొందలేవు.


నేను విన్నదాని బట్టి, నీ భర్తకు ఒక న్యాయమూర్తిగా మంచి పేరుంది. సంఘంలో గౌరవం ఉంది. మంచి భవిష్యత్తున్న అమ్మాయిలు ఉన్నారు నీకు! వీరందరికీ మూలాధారం నువ్వు! నువ్వు వేసే ఒక్క తప్పటడుగు, మొత్తం ఒక సంసారాన్ని చెల్లాచెదురు చేస్తుంది. ఒక్కసారి ఈ సిస్టమ్ నుండి బయటకొచ్చాకా, వెనక్కి వెళ్ళే దారులన్నీ మూసుకుపోతాయి. వద్దు! ఈ రీయూనియన్ల నుండి మనం తీసుకోవలసింది..., మన బాల్యపు స్వచ్ఛత, మచ్చలేని మంచి స్నేహం మాత్రమే! వ్యామోహాలూ, కుటుంబ విచ్చిన్నాలూ కాదు! కాస్త హాస్యాన్ని పంచి, మృదువుగా మాట్లాడితే, నేను మంచివాడినీ, నమ్మదగిన వాడినని ఎలా అనుకున్నావు మానసా? మానవ సహజమైన బలహీనతలన్నీ నాలోనూ ఉంటాయి కదా! నేనే సవ్యంగా ఉండి ఉంటే, నా భార్యతో విడిపోయేవాడినే కాదు కదా! అచ్చం నీ లాంటిదే స్వప్న కూడా! కానీ నాకు తను నచ్చలేదు. నిన్ను ఆరాధిస్తున్నాను! ఎంత తప్పు కదా! మనది కాని వాటి మీద మనకు పెరిగే మోహమే... ఈ బలహీనత! నువ్వు హాయిగా ఉండాలి. నీజీవితంలో, నీ కుటుంబ సహకారంతో నువ్వెన్నో సాధించగలవు. రీడిస్కవర్ యువర్ లైఫ్ విత్ ఫుల్లెస్ట్ పొటెన్షియల్ మానసా.. బై బీయింగ్ ఇన్ ద ఫేమిలీ!

'లేదూ, కాదూ, కూడదూ... నా జీవితం నిస్సారం. అనుభవించడానికి ఏమీ మిగల్లేదు నాకు 'అనుకుంటే, ఒక్క ఫోన్కాల్ దూరంలో నేనుంటా.. స్నేహితుడిగా సహాయం చేస్తా నీ ఎదుగుదలకు! నాకు తెలుసు... నువ్వు రావని. నాతో మనసు విప్పి మాట్లాడినపుడే, నీ ఒత్తిడంతా పోయి, నీ కుటుంబం పట్ల నీ దృక్కోణం మారిపోయింది. నీ భర్తా, పిల్లలూ, అత్తమామల గురించి తాపత్రయ పడడం మొదలుపెట్టావు! అదీ అసలయిన స్త్రీతత్వం! అందుకే భారతనారికి ప్రపంచమంతా మొక్కుతుంది. నీ జీవితాన్ని తిరిగి చూసుకోకుండా ముందుకు సాగిపో. నీ కుటుంబ విజయాలు నీవి కూడా! ఎంజాయ్ దెమ్!

నేను ఇక్కడ నుండి కాకినాడ వెళ్తున్నాను. స్వప్న ముందు నిలబడి కనీసం క్షమార్పణయినా అడగాలి! ఆమె తిరిగి రాగలిగితే, అంతకన్నా వేరేమీ కోరను. స్త్రీకయినా, పురుషుడికైనా పెళ్ళి ఇచ్చే భద్రతా, గౌరవం... మరే వ్యవస్థా ఇవ్వలేదు. అది నిండుగా నీకు దొరికింది. తొణకకుండా, ఆ అమృతభాండాన్ని రక్షించుకో! ఉంటా! ఎప్పటికీ నీ బాల్యమిత్రుడు...
ఆనంద్!

ఉత్తరం పూర్తికాగానే, బుగ్గల మీద కన్నీటిధారలను తుడుచుకుని, నిబ్బరంగా కూర్చుంది మానస! "థాంక్స్ టు దిస్ రీయూనియన్! నేను కోరుకున్న ఓదార్పూ, నేను కోరుకున్న పాఠం నాకు దొరికాయి! జీవితాంతం దన్నుగా ఉండే మంచిమిత్రుడు దొరికాడు! జీవనమాధుర్య జాడలు నా ఇంట్లోనే ఉన్నాయని తెలిసింది!" అనుకుంటూ కళ్ళు మూసుకుంది!

విమానం దిగగానే, తనను రిసీవ్ చేసుకోవడానికి స్వయంగా వచ్చిన భర్తను చూడగానే, అతనితో కొత్తగా ఆవిష్కరించుకున్న అంతరంగంతో, తను రచించుకోబోయే " రీయూనియన్" కు, భావిలో తన ఆశయాల సాధనకు పునాదులు పడ్డట్టే అనిపించింది మానసకు!



# గురుదక్షిణ

సింగరాజు శ్రీనివాసరావు

మనసంతా అదొక రకమైన దిగులుతో నిండిపోయింది. తప్పు చేశానన్న భావన ఒక వైపు, తప్పక చేశానన్న సమర్థింపు మరొక వైపు త్రాసులో తూగుతూ గుండెను అటుయిటూ ఊపేస్తున్నాయి. సమస్య చిన్నదైనా, పెద్దదైనా ఇంట్లో వాళ్ళ సహకారం లేనప్పుడు అది కంటిలోని నలుసే అవుతుంది. చిన్నతనంలో అన్నీ తనే అయి పెంచిన తల్లిని, మానసిక స్థితి సరిగా లేదనే నెపంతో, ఇంట్లో పోరు పడలేక కొత్తపట్నం వృద్ధాశ్రమంలో చేర్చాలనే నిర్ణయానికి వచ్చాను. అక్కడైతే మంచంలో ఉన్న వాళ్ళను కూడ చూస్తారని తెలిసి అక్కడి వాళ్ళతో మాట్లాడి వస్తున్నాను. పేరుకు పదిమందికి పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడిని. కానీ నాకు నేను పాఠాలు నేర్చుకోను చేతకాని నిరక్షరకుక్షిని. అయినా తప్పదు.

'ఆమె నాకు అత్తేగానీ అమ్మ కాదని' ఆలి తెగేసి చెప్పినపుడు మాట్లాడలేక పోయాను. అప్పటికి అదే నిజమనిపించింది నాకు.

'పిల్లలను కనడం, పోషించి చదివించడం పెద్ద విశేషమేమి కాదని, అంతమాత్రాన బిడ్డలు తల్లులకు ఋణపడినట్లు కాదని' లాజిక్కులు మాట్లాడి నా నోరు మూయించింది నా భార్య. అమ్మకు అధికారం సాగినన్ని రోజులు ఆమె మాటకు ఎదురులేకపోవడంతో, కోడలి స్థానంలో నా భార్య కొన్ని ఇబ్బందులు పడిన మాట వాస్తవమైనా, ఇప్పుడు లేవలేని స్థితిలో ఉన్న అమ్మ మీద కక్ష సాధించడం సబబేనా అని అనిపించినా, ఎదురు మాట్లాడలేని దుస్థితి నాది. అందుకే మనసు చంపుకుని, కొత్తపట్నం వెళ్ళి వివరాలు తెలుసుకుని, తిరిగి నెల్లూరు వెళ్ళడానికి కృష్ణా ఎక్స్ ప్రెస్ కోసం ఒంగోలు స్టేషనులో కూర్చుని ఉన్నాను.

ఎంత పక్కన పెడదామనుకున్నా ఆలోచనలు ముసురుతూనే ఉన్నాయి. అలా ఆలోచనలలో కొట్టుమిట్టాడుతున్న నాకు ఒక ముసలావిడను చంకన ఎత్తుకుని నడుస్తున్న యువకుడు కనిపించాడు. జుట్టు, గడ్డం బాగా పెరిగివున్నాయి అతనికి. ఆమెను మోసూకుంటూ నేను కూర్చున్న బల్లవైపుకు రాసాగాడు. మర్యాద పూర్వకంగా నేను బల్ల చివరికి జరిగాను. అతను ఆమెను తిన్నగా బల్ల దగ్గర దించి ఎత్తి బల్లమీద కూర్చోబెట్టాడు. ఆమె అసలే పొట్టిమనిషి కావడంతో వంగిపోయి గువ్వలా కూర్చుండి

పోయింది. అతను నావైపు చూసి "థాంక్యూ సర్. కొద్దిగా మా అమ్మను చూస్తుండండి. నేను ఇప్పుడే వాటర్ బాటిల్ తీసుకుని వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆమెను పరీక్షగా చూశాను. మా అమ్మ కంటే వయసులో చిన్నదిలానే ఉంది. చిన్నప్పటి నుంచి కష్టం చేసిన మనిషి కావడం వలననేమో వయసును మించిన ముసలితనం కనిపిస్తున్నది ఆమెలో.

"బాబూ. తిరుపతికి ఎల్లే బండి ఈడకే వసద్దా" అని అడిగింది ఆమె.

"అవునమ్మా. మీరు ఎక్కడికి వెళ్ళాలి" అని అడిగాను.

"తిరపతికయ్యా. నా బిడ్డకి ఉద్దేగం వత్తే ఆ ఏడుకొండలసామి కాడికి నడిచి వత్తానని నాలుగేల్ల కిందట మొక్కుకున్నా. కానీ నా గతి బాగులేక రెండెల్ల నాడు నడుములు సచ్చుబడి పోయినయి. ఎంతమంది కాడికి తిప్పినా పైనం లేకపోయె. ఏడకిబోయినా ఎత్తుకునే పోతాడు. సెక్రాల బండి కొనరా అయ్యా అంటే. నన్ను నువ్వు మోయలేదంటే సిన్నప్పుడు అని కసురుకుంటాడు. ఆ సామి దయో ఏమో నా బిడ్డకి పెద్ద ఉద్దేగమే వచ్చిందయ్యా" అని చెబుతుండగానే వచ్చాడా కుర్రాడు.

"అప్పుడే మొదలెట్టిందా సార్ మా అమ్మ. అందరితో అంతే సార్.. ఏదో ధోరణిగా మాట్లాడుతుంటుంది" అని సంజాయిషి చెప్పబోయాడు.

"భలేవాడివే. ఆమెది ధోరణి కాదు ఉన్న నిజాలు చెప్తుంది. అవును మీకేదో ఉద్యోగం వచ్చిందటగా. ఏ డిపార్టుమెంటులో"

"బ్యాంకులో క్లర్క్ గా వచ్చింది సర్. ఇంకా పోస్టింగ్ రాలేదు"

"కంగ్రాట్యులేషన్స్. నీ గురించి మీ అమ్మ చాలా గొప్పగా చెబుతున్నదయ్యా"

"ఆమె అంతే సార్. తల్లి ప్రేమో ఏమో అందరికీ నేనేదో తనకు గొప్ప సేవ చేస్తున్నట్లు చెబుతుంది. కానీ ఆమె నా కోసం పడిన కష్టం ముందు నేను ఆమెకు చేసేది ఏపాటిది సర్" అతని కళ్ళు చెమర్చాయి. "ఏం చేసినారా నేను. నువ్వు కలాసు కలాసు పాసయితుంటే సదివించినా. మరి కన్నాక నిన్నో దారి సెయ్యాలకదా. అసలికే మనం రెక్కాడితే గాని డొక్కాడనోల్లం. మీ అయ్య కట్టంసేసి బతికిండు. మన రాత బాగోలేక ఆడు మద్దెనే రాలిపోనాడని, నిన్ను సదువు మానిపిత్తే సచ్చినోడి కోరిక ఎట్టా తీరతది. 'నాబిడ్డ నాలా పనోడు కాకూడదే' అంటూ కలవరించి పోనాడు. తల్లికి బిడ్డ భారమయితడా! బిడ్డను సాకుడు గొప్పయితదా. తల్లిని బిడ్డ సూసుడే గొప్పయితది. అంతే గదయ్యా మీరే సెప్పండి?" ఆమె మాటల ప్రవాహం ఆగడం లేదు.

"నేను చేస్తున్న గొప్ప పనేమున్నది సార్ ఇందులో. నాకు పదేళ్ళ వయసులో మా నాన్న చనిపోతే, మా తెలుగు సార్ ను బ్రతిమాలుకుని నా చదువు ఆగకూడదని హాస్టలులో చేర్పించింది. ఆయన కూడ దేవుడే సార్. ప్రతి ఆదివారం హాస్టలుకు వచ్చి నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళేవాడు. తలకు పోసుకోమని చెప్పి ఆ రోజంతా వాళ్ళింట్లోనే ఉంచుకుని, భోజనం పెట్టి, నా మాటలలోని తప్పులు సరిదిద్ది నన్నొక మనిషిగా తీర్చిదిద్దాడు. ఆయనది పెద్దమనసు సార్. నన్ను ఏనాడూ తక్కువగా చూడలేదు. తన కొడుకులాగే

చూశాడు. నేను ఈరోజు ఈ మాత్రం మర్యాదగా మాట్లాడగలుగుతున్నానంటే అది ఆయన చలవే. ఆయన ఒకమాట చెప్పేవాడు సర్. 'ప్రపంచానికి మనలను పరిచయం చేసింది అమ్మ. జీవం పోసింది బ్రహ్మ అయినా జీవితాన్నిచ్చింది అమ్మ. చావుకు ఎదురీది నిన్ను నేలకు తెచ్చిన అమ్మను, ఆమె చనిపోయే వరకు వదలకు. అదే నువ్వు ఆమెకు ఇచ్చే ప్రతిఫలం. ఈ మాట జీవితాంతం మరిచిపోకు. అదే నువ్వు నాకు ఇచ్చే గురుదక్షిణ!' అని చెప్పేవారు సర్. ఆ దేవుడి మాటను నా మరణం వరకు మరచిపోను సర్!" అతనిలో ఏదో తెలియని ఉద్వేగం.

అతని మాటలు నాలో విచక్షణకు తెరలేపాయి. అమ్మను గూర్చి ఎంత గొప్పగా చెప్పాడతను. అవును. అమ్మను మించిన దైవం లేదని తెలిసి కూడ నేను ఎందుకిలాంటి నిర్ణయం తీసుకున్నాను. నా తొందరపాటుకు నాకే చిన్నతనం అనిపించింది.

"సార్. మీరెక్కడిదాకా" నా ఆలోచనలకు అడ్డుతగులుతూ అడిగాడతను.

"నెల్లూరు వరకు. నాకొక చిన్న సందేహం బాబు. నీకు ఉద్యోగం వస్తే కొండకు నడచి వస్తానని మీ తల్లిగారు దేవుడికి మ్రొక్కుకున్నారట కదా. ఇప్పుడీ స్థితిలో నడవగలదా?" నా సందేహాన్ని వెలిబుచ్చాను. "లేదు సర్. అమ్మను ఎత్తుకుని నేనే కొండనెక్కుతాను. అప్పుడు నాతో పాటు అమ్మకూడ ఎక్కినట్లే కదా. మొక్కు కట్టించుకున్న ఆ దేవుడే అమ్మను మోసే శక్తిని కూడ ఇస్తాడు సర్!" అతనిలో దృఢసంకల్పం కనిపించింది.

నాకు నోట మాట రాలేదు. తల్లిమీద ఇంత ప్రేమ ఉన్న వాళ్ళు ఉన్నారా? నాకు తెలిసి కావడిలో తల్లిదండ్రులను మోసిన శ్రావణకుమారుని కథ తెలుసు. కానీ అది కథే కదా అనుకున్నాను. కానీ ఇతడిని చూస్తుంటే ఆ కథ కూడ వాస్తవమే అనిపిస్తున్నది. అతనిప్పుడు నా కంటికి ఒక మహాత్ముడులా కనిపిస్తున్నాడు. అదే అతనితో అన్నాను.

"నేను అంత గొప్పవాడిని కాను సర్. నాన్న గారు కాలం చేసిన కొత్తల్లో నాకు ఫిట్సులా వచ్చిందట. వైద్యులు నయం కావడం కష్టమని చెప్పారట. మాది పల్లె కదా, అక్కడ పెద్ద డాక్టర్లు లేరు. పట్టణానికి వెళ్ళే స్తోమతూ లేదు. అప్పుడు అమ్మ ఇప్పటిలాగే ఆ ఏడుకొండల వాడికి మ్రొక్కుకున్నదట. నన్ను ఎత్తుకుని నడిచి కొండకు వస్తానని. 'ఇంత బక్క దేహంతో నన్ను ఎలా మోశావమ్మా' అని అడిగితే 'ఏమోరా ఆ బలం ఆ సామే ఇచ్చినాడు' అన్నది. అంత గొప్ప తల్లి కడుపున పుట్టి, ఈ మాత్రం చెయ్యకపోతే నేను పుట్టినందుకు ఫలితమేముంటుంది సార్! నేనెంత ఎదిగినా ఆ తల్లిముందు గడ్డిపరకనే సార్. తలవంచుకుంటానే గానీ తలయెత్తి బ్రతకను. నాకు అన్నీ అమ్మే సార్" అతని మాటలలో ఆమె మీద అతనికున్న ప్రేమ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

అతనింకా ఏదో చెబుతున్నాడు. కానీ నా చెవులు స్పందించడం మానివేశాయి. నా తల్లే నా కళ్ళముందు కదలాడసాగింది. ఒకసారి నాకు టైఫాయిడ్ జబ్బు చేస్తే తను ఎంత తల్లడిల్లిపోయిందో, నిద్రాహారాలు మాని

వారం రోజులు నా మంచం దగ్గరే ఉండిపోయింది. అది గుర్తుకు వచ్చి మనసంతా అల్లకల్లోలమయింది. ఎంత తప్పు చేశాను. నా స్వార్థం కోసం ఆమెను ఆశ్రమంలో దించడానికి సిద్ధమయ్యాను. ఏవో చిన్న చిన్న గొడవలు జరిగితే వాటిని పరిష్కరించుకోను చేతగాక, అసమర్థుడిలా ఆమెను వదిలించుకోవాలనుకున్నాను. పదిమందికి విద్యాబుద్ధులు నేర్పి, సంస్కారవంతులుగా తయారుచేసే ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, తల్లిని గాలికి వదిలేసే కుసంస్కారానికి తెరదీశాను. ఆ భగవంతుడే ఇతని రూపంలో వచ్చి నాకు సరియైన దారి చూపించాడు. కన్నతల్లి భారమనుకుని వదిలేసి రాకుండా బాధ్యతగా తన వెంట తిప్పుతున్నాడు. ఇతనితో పోల్చుకుంటే నేనసలు కొడుకునే కాదు. ఇప్పుడు నేను చేసిన పనే రేపు నా కొడుకు చేస్తే, మా గతేమిటి? సమస్య ఎదురయినపుడు దాన్ని పరిష్కరించుకునే దిశగా అడుగులు వేయాలి తప్ప, తప్పించుకుని పారిపోకూడదు. మనసు దృఢమయింది. కర్తవ్యం బోధపడింది.

"సార్. అనౌన్సుమెంటు" అని ఆ కుర్రాడు అతని తల్లిని ఎత్తుకుని నిలబడ్డాడు.

నేను కూడ ఈ లోకంలోకి వచ్చి వాళ్ళకు నమస్కరించి నా బోగీ వైపుకు కదిలాను. ఇప్పుడు నా మనసు ఆకాశమంత నిర్మలంగా ఉంది. అమ్మ రూపం నా కనులముందు కదలాడుతున్నది. అతని గురువు గారు అడిగిన గురుదక్షిణలో తల్లిఋణం తీర్చుకోమన్న సత్యం దాగి ఉన్నది. 'అవును నాకు నా తల్లిని మించిన గురువు లేదు. నేలమీద నా ఉనికిని నిలిపిన అమ్మకు గురుదక్షిణగా నా ఒడిని తలగడ చేస్తాను. ఆమె చివరి శ్వాస వరకు నాతోనే ఉంచుకుంటాను'. నాలో ఏదో సరికొత్త ఉత్సాహం పురుడుపోసుకుంది. సాగే ఆలోచనలలా రైలు ఊపందుకుంది.

***0***

**దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**




# గాజు బొమ్మలు


గొర్తి వాణి శ్రీనివాస్


ఒక ఆడా ఒక మగా కలిసి విడిపోతే ఏం నష్టం లేదు. కానీ ఒక అమ్మా ఒక నాన్నా విడిపోతే? ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుపై కట్టిన వంతెన కూలిపోయినట్లే. మరణం తప్ప వేరుచేయలేని గాఢమైన మూడుముళ్ల బంధానికి అహంభావం కత్తివేటని వీళ్ళకెలా చెప్పేది?

కోర్టు హాలులో రకరకాలుగా మాట్లాడుకుంటున్న జనం జడ్జిగారి రాకతో మాటలాపి లేచి నిలబడ్డారు. జడ్జిగారు తన సీటులో కూర్చోగానే అందరూ తమ స్థానాల్లో కూర్చున్నారు. తన ముందున్న ఫైల్ తీసి కేసు వివరాలు చదివి విచారణ ప్రారంభించమని చెప్పారు.

“రత్నమాలా.. రత్నమాలా...” అంటూ మూడుసార్లు పిలిచాడు అమీనా. రత్నమాల వచ్చి జడ్జిగారి ముందున్న బోనులో నిలబడింది.

అమీనా విఠల్ ని కూడా మూడుసార్లు పిలిచాడు. అతనూ వచ్చి ఎదురుగా ఉన్న బోనులో నిలబడ్డాడు. విచారణ ప్రారంభమైంది.

"యువరానర్! నా క్లైంట్ రత్నమాల తన భర్త విఠల్ నుంచి విడాకులు కోరుకుంటోంది. ఆమెది న్యాయమైన కోరిక. గత కొన్నేళ్లుగా భర్త నిర్లక్ష్యానికి గురై, మానసికంగా ఎంతో వ్యథ చెందింది. అతన్ని మార్చాలని తీవ్ర ప్రయత్నం చేసి ఓడిపోయింది. అతని ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాక చివరికి విసిగిపోయి చేసేదిలేక విడిపోయి బతకాలన్న నిర్ణయానికొచ్చి కోర్టు మెట్లెక్కింది. ఆమె కోరుకున్న న్యాయం జరిపించాల్సిందిగా మనవి చేస్తున్నాను యువరానర్!" అంటూ పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకి తన వాదన వినిపించాడు.

ఇద్దరు చిన్నపిల్లలున్న తల్లిదండ్రులు విడిపోవడం , వాళ్ళకి తన చేతుల మీదుగా విడాకులిప్పించడం జడ్జికి బాధగా అనిపించింది.

"మిస్టర్ విఠల్! మీరు చెప్పుకునేది ఏమన్నా ఉందా?" అన్నాడు అతనివైపు చూస్తూ.

పరస్పర అంగీకారంతో కోర్టు వరకూ వచ్చిన తర్వాత ఇక వేరే ఉద్దేశ్యాలేముంటాయి ఏమీలేదని తలాడించాడు విఠల్.

"బాబూ! నువ్వు అమ్మ దగ్గరుంటావా? నాన్నదగ్గరా? నీకెవరి దగ్గరుండటం ఇష్టం?" అరుణ్ ని అడిగారు జడ్జి.

"వాడు ఇంకా పసివాడు. సరైన నిర్ణయం తీసుకునే వయసు వాడికెక్కడిది?" ఆందోళనగా అంది రత్నమాల.

"ఇంతవరకూ సరైన నిర్ణయం తీసుకోవడం నీకు తెలుసా? అసలు అవతల వాళ్ళ వైపు నుంచి ఒక్కసారన్నా ఆలోచించావా?" కాస్త గొంతు పెంచి అన్నాడు విఠల్.

"అలా ఆలోచించనిది నేను కాదు... మీరు. అందుకే మనకీ పరిస్థితి వచ్చింది!" అంది రత్నమాల కోపంగా.

"ఇది మీ ఇల్లు కాదు. కోర్టని ఇద్దరూ గుర్తుంచుకోండి!" హెచ్చరించాడు జడ్జ్.

అటు తల్లి ఇటు తండ్రి మధ్యలో ఇద్దరు పిల్లలు. పన్నెండేళ్ల అరుణ్, పదేళ్ల అవంతి ఇద్దరూ ఒకరి చేతులు ఒకరు పట్టుకుని నిలబడ్డారు. ఎవరిని ఎంచుకోవాలో ఇద్దరికీ పాలుపోవడం లేదు. వాళ్ళకి ఇద్దరూ కావాలి. ఇంకా పూర్తిగా లోకం తెలియని చిట్టి మనసులు భయంతో వణుకుతున్నాయి. అవంతిక ఏడుస్తోంది. అరుణ్ ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు. పిల్లల్ని అలా చూస్తుంటే రత్నమాల హృదయం ద్రవిస్తోంది. విఠల్ కి పిల్లల దగ్గరకు పరిగెత్తికెళ్లి వాళ్ళని అమాంతం గుండెకు హత్తుకోవాలనుంది. కోర్టులో జడ్జ్ తో సహా అందరూ పిల్లల వైపే చూస్తున్నారు.

"నాకు డాడీ కావాలి. నేను నాన్న దగ్గరే ఉంటాను!" అన్నాడు అరుణ్ తండ్రివైపు వేలు చూపిస్తూ. "నేనొప్పుకోను" అరిచింది రత్నమాల.

"సైలెన్స్! మధ్యలో మీరు మాట్లాడకండి" అన్నాడు జడ్జ్.

"నువ్వు ఎవరి దగ్గర ఉంటావు పాపా?" అడిగాడు జడ్జ్.

అవంతిక అటూ ఇటూ చూసి "నాకు అన్నయ్య కావాలి." అంది. హాలులో చిన్నగా నవ్వులు వినిపించాయి. వెంటనే వాతావరణం గంభీరంగా మారిపోయింది.

"అన్నయ్య ఎక్కడుంటే నేనూ అక్కడే ఉంటాను." అంది. అందరూ వాళ్ళ పరిస్థితికి జాలిపడ్డారు.

"పసివాళ్ళకేం తెలుస్తుంది యువరానర్! నా పిల్లల్ని నాకిప్పించండి. వాళ్ళు లేకపోతే నేను బతకలేను" అంటూ భోరున ఏడ్చింది రత్నమాల.

"అవంతిక తల్లి దగ్గరే ఉండాలి. అరుణ్ మాత్రం మేజర్ అయ్యేంతవరకూ ఒక నెల అమ్మ దగ్గర ఒక నెల నాన్న దగ్గర ఉండాలి. పిల్లలిద్దరూ మేజర్లయ్యాక ఎవరి దగ్గర వుండాలీ అనేది వాళ్ళ నిర్ణయానికే వదిలేస్తూ అంతవరకూ ఒక ప్రభుత్వ న్యాయవాదిని పర్యవేక్షకుడిగా నియమించాలని" అదేశిస్తూ తీర్పు ఇచ్చాడు జడ్జ్.

'నా పిల్లలిద్దరూ నాకే చెందాలని తీర్పు వస్తే బాగుండేది ఎలాగైనా ఇద్దర్నీ నేనే దక్కించుకుంటాను. ఇంత వరకూ విజయం నాదే ఇక ముందు కూడా నాదే.' అని మమసులో దృఢంగా

నిశ్చయించుకుంది రత్నమాల.
కోర్టు విచారణ ముగిసింది. విఠల్ భావోద్వేగాలతో పిల్లల్నిద్దర్నీ దగ్గరకు తీసుకున్నాడు.
"నాన్నా! నువ్వూ మాతోనే ఇంటికి వచ్చెయ్!" అంది అవంతిక తండ్రి చేతులు పట్టుకుని. అరుణ్ మాత్రం తండ్రి వంక జాలిగా చూసాడు.
"అరుణ్ ని రేపు లాయర్ కి అప్పగిస్తాను. అతను నీ దగ్గరకు తీసుకొస్తాడు నువ్వు మాత్రం ఇంటికి రాకు." గాలితో చెప్పినట్టు చెప్పింది రత్నమాల.
విఠల్ తండ్రి పురుషోత్తం రత్నమాల నిర్ణయానికి బాధపడ్డాడు. "చాలా తొందరపడ్డావమ్మా! మీ మూడు ముళ్ల బంధంతో పిల్లల జీవితాలకు తెగని చిక్కుముడులు వేశారిద్దరూ. సర్దుకుపోవాలన్న ఇంగితం ఇద్దరిలోనూ లేకపోయాక ఎవరుమాత్రం ఏం చేస్తారు!" అంటూ నిట్టూర్చాడు.
విఠల్ నిస్సహాయంగా చూసాడు.
పిల్లల్ని కారెక్కించి డ్రైవ్ చేస్తూ ఏదో ఆలోచిస్తోంది రత్నమాల. వెనక సీట్లో అవంతిక అరుణ్ చెయ్యి పట్టుకుని కూర్చుంది. ఊహ తెలియని అవంతికకి అన్నయ్య పక్కనుంటే చాలు. కానీ అరుణ్ చిన్ని బుర్ర నిండా తెగని ఆలోచనలే. ఆటలాడుకునేటప్పుడు ఇద్దరూ కొట్టుకుంటుంటే ఎప్పుడూ కలిసిమెలిసి ఉండాలని చెప్పే అమ్మానాన్నలు ఇప్పుడెందుకు విడదీస్తున్నారో అర్థం కాలేదు.

***

అవంతిక నిద్ర లేచేసరికి అరుణ్ కనబడలేదు. అన్నయ్యకోసం ఇల్లంతా వెతుక్కుంది. రాత్రి ఇద్దరూ ఒకే బెడ్ మీద పడుకున్నారు. తనకు మంచి కథ కూడా చెప్పాడు. 'నేను కనపడకపోతే నువ్వేడుస్తావా' అని అడిగాడు.
'బాగా ఏడుస్తా నువ్వు ఎక్కడికీ వెళ్లద్దు' అని చెప్పి పడుకుంది. లేచేసరికి లేడు. అవంతికకి ఏడుపొచ్చింది. అతని బొమ్మలు ఎప్పుడు తీసుకున్నా పరిగెత్తుకొస్తాడు. తీయొద్దని గొడవపడతాడు. అవంతిక అరుణ్ ర్యాక్ తెరిచి బొమ్మల్ని తీస్తుంటే ర్యాక్ కి అంటించిన ఉత్తరం కనబడింది. దాన్ని తీసుకుని తల్లి దగ్గరకు వెళ్ళింది అవంతిక. రత్నమాల ఆ ఉత్తరాన్ని చదివింది.
"చెల్లీ! జడ్జ్ గారు నిన్ను 'ఎవరు కావాలి?' అని అడిగినప్పుడు అన్నయ్య కావాలన్నావు. నాకు చాలా సంతోషం వేసింది . మనిద్దరం కలిసి పెరిగాము. కలిసి ఆడుకున్నాం. ఒకరిని విడిచి ఒకరం వుండలేము. కానీ ఇప్పుడు ఇద్దరం ఒకే చోట వుండే అవకాశం లేదు. దానికి కారణం అమ్మా నాన్నలే. నాన్నని ఒంటరివాడిని చేయడం నాకిష్టం లేదు. అందుకే నేను నాన్నతో వెళ్లిపోతున్నాను. నా కాస్ట్లీ బొమ్మల్ని ఎప్పుడూ ముట్టుకోనివ్వనని ఏడ్చేదానివి కదా. ఇప్పుడు అవన్నీ నువ్వే తీసుకో. వాటిని విరిచేసినా నిన్ను కోప్పడేవాళ్ళు వుండరు. వాటితో హాయిగా ఆడుకో. నాకోసం ఏడవద్దు. అమ్మని విసిగించొద్దు. బై చెల్లీ"
లెటర్ చదివిన రత్నమాల మ్రాన్పడిపోయింది.
"నాకు బొమ్మలు వద్దు. అన్నయ్యే కావాలి" అంటూ ఏడ్చింది అవంతిక.

"అమ్మా! అన్నయ్యా నేనూ బొమ్మలతో ఆడుకునేటప్పుడు చాలా సార్లు ఎడ్జెస్ట్ అయ్యాం. ఒకరికి నచ్చిన ఆటలు ఇంకొకరం ఆడుకునేవాళ్ళం. మరి మా కోసం మీరెందుకు ఎడ్జెస్ట్ కాలేరమ్మా." అంటూ ఏడుస్తూ అడుగుతున్న కూతురి మాటలకు రత్నమాల ఆలోచనలో పడింది.

ఒక కడుపున పుట్టిన పిల్లలిద్దర్నీ విడదీయటం పాపమే. కానీ వాళ్ళ పుట్టుకకు కారణమైన వేర్వేరు మనుషులిద్దరూ మనసులు కలవకపోయినా కలిసుండాలా? లేక విడిపోవాలా? అనే ఆలోచన ఎంతకీ తెగట్లేదు. రత్నమాలకు ఆమె తల్లి ఎప్పుడూ చెప్పే మాటలు గుర్తొచ్చాయి. పిల్లల మనసులు తెల్ల కాగితాలు. దానిపై మంచి సంతకాలు చేయాల్సింది మనమే. గాజు బొమ్మల్లాంటి వాళ్ళని అపురూపంగా చూసుకోవాలి. చిన్న దెబ్బ తగిలినా పెద్ద మూల్యం చెల్లించాల్సొస్తుందనేది. ఇద్దరు పెద్దవాళ్ళు, ఇద్దరు చిన్నపిల్లలు. అహం అనురాగాల ఊగిసలాటలో త్రాసు ఏవైపు మొగ్గాలి?

అవంతిక ఏడుస్తోంది. రత్నమాల ఆలోచిస్తోంది. ఇన్ని గదులున్న పెద్ద యింట్లో తన భర్తకు చోటులేదు. మనసును కాస్త విశాలం చేసుకుని ఈ గాజుబొమ్మల్ని పదిలపరుచుకోకపోతే భవిష్యత్తులో క్షమార్హురాలిని కాకుండా పోతానేమో?! తను దేనికోసమైతే పోరాడుతోందో ఆ బంధం శాస్వతంగా దూరమైపోతే? రత్నమాల గుండె భయంతో కంపించింది.

అవంతిక కన్నీళ్లతో కోర్టు తీర్పును మించిన మార్పు మొదలైంది. అమ్మతనం కంటే తన ఈగో ముఖ్యం కాదని నిశ్చయించుకుంది రత్నమాల విఠల్ కి ఫోన్ చేసింది.

***0***

## దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



# దృఢ నిశ్చయం

తరిగొప్పుల వీఎలెన్ మూర్తి

నీలిమకి వేణు కావల్సినంత స్వాతంత్ర్యం ఇచ్చాడు. అతనామెను ప్రేమిస్తాడు. అంతేకాదు ఆమెపట్ల అనురాగంతో పాటు గౌరవం కూడా ఉంది. చాలామంది కూడా అదే మాట చెప్తుంటారు. పెద్ద ఇల్లూ, పెద్ద జీతం, అయినా ఆమెను సంతోషంగా ఉండనివ్వడంలేదు. ఎప్పుడూ భర్త తనమాట వినడని ఆమెలో ఒక అసంతృప్తి. ఓసారి కేవలం బర్గర్ తీసుకురాలేదని నీలిమకి విపరీతంగా కోపం వచ్చేసింది. రోజంతా అతనితో మాటాడలేదు.

'బాధ, దుఖం అనుభవించిడానికే ఈ ప్రపంచంలో పుట్టినట్లున్నాను... అందుకే దేవుడు మిమ్మల్ని మొగుడుగా ఇచ్చాడు. ఖర్మ అంతే'... అంటూ రుసరుసలు మొదలుపెట్టింది. మర్నాడు తన పుట్టింటికి వెళ్ళిపోయింది. బర్గర్ తెస్తేనే భర్త అనే లక్షణం ఆమెలో చాలా బలంగా ఉంది.

'నీలిమ అంతే... కోపం వస్తే ఆమెని భరించడం ఆమె అమ్మానాన్నలకీ కష్టమే. అందుకే తొందరగా పెళ్ళి చేసేసేరేమో' అని బంధువులు అంటుంటారు. విపరీతమైన పొగరు. అహంకారం. ఆమెని పువ్వుల్లో పెట్టుకుని చూసే వేణు ఒక్కోసారి ఆఫీస్ పని హడావిడిలో ఆమె అడిగిన బర్గర్, పిజ్జా, పాలకోవాలాంటి తినే పదార్థాలు ఇంటికి తీసుకురావడం మరిచిపోతుంటాడు. దాంతో ఆమెకి ఎక్కడలేని ఆవేశం వచ్చేస్తుంది. అవన్నీ ఫోన్ ద్వారా ఆర్డర్ ఇస్తానని అంటాడతను. కానీ మొగుడు తీసుకొస్తేనే ప్రేమ అంటుంది... ఆ కోపంతో రగిలిపోయి రెండు వీధుల అవతల ఉన్న పుట్టింటికి చెక్కేస్తూ ఉంటుంది. పుట్టినిల్లూ మెట్టినిల్లూ ఒకే ఏరియాలో ఉంటే వేణులాంటి మొగుళ్ళకి కష్టమేమో...

వేణు వచ్చి బతిమాలితే ఆమె కోపం మంచులా కరిగిపోతుంది. చీటికీ మాటికి ఇల్లు వదిలి పుట్టింటికి వెళ్లిపోయినా ఆమె గుణం అంతే అని సరిపెట్టుకుంటాడు. మర్నాడే ఆమెని మళ్ళీ తనతో తీసుకొస్తాడు.

ఈసారి మళ్ళీ అదే గొడవ. మార్కెట్లోకి వచ్చిన కొత్త 'మిర్చికా సలాన్' కొనడం మరిచిపోయి ఇంటికొచ్చాడు. ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పటికీ అతను చెప్తాడు 'ఇద్దరమూ అలా హాయిగా షికారు వెళ్ళినట్లు వెళ్ళి కొనుక్కుని తిందాం' అంటే ఒప్పుకోదు. తనమాటే నెగ్గాలనే పంతం.

సెప్టెంబరు ఆఖరివారం. వర్షాకాలం పూర్తి కావచ్చింది, కాని ఇంకా పడుతున్నాయి. కిటికీ తెరలు వేసేసి వేణు ఒంటరిగా కూర్చున్నాడు. బాధ, దుఖం అతని మనసుని ముసురుకున్నాయి. కాలం ఎలా

వెళ్ళబుచ్చాలో తెలియక సతమతమవుతున్నాడు. నిద్రపోవడం ఒక్కటే దారి అనిపించింది. కళ్ళు మూసుకున్నాడు. నిద్ర సరిగా పట్టలేదు. అటూ ఇటూ దొర్లుతున్నాడు. ఇంతలో వర్షం మొదలైంది. వాన వాతావరణాన్ని చల్లబరిచింది. గడియారం నాలుగు చూపిస్తోంది. చల్లని సాయంత్రపు వేళ ఎవరేనా వచ్చి కబుర్లు చెప్తే బాగుండననే భావన అతనిలో కలిగింది. మంచం మీదనే జరిగి బైటకి చూశాడు. వాన తగ్గుముఖం పట్టింది.

మంచమ్మీద నుంచి లేచి పార్క్ చేరుకున్నాడు. ఆ చలి సమయంలో తనకోసం ఎవరు కూర్చుంటారు? ఒక వింత ఆలోచన వచ్చింది. ఆ చలిగాలికి జ్వరం వస్తే., తనకేదైనా అయితే? **మరణం** వచ్చి తనని అన్ని బాధల నుంచి, దుఃఖాల నుండి దూరంగా తీసుకుపోతుంది. ఎప్పుడూ తనని ఒంటరిని చేసే భార్య అప్పుడు చూడటానికి వస్తుందా? ఆ రోజున ఏడ్చేవాళ్ళలో... నీలిమ కూడా ఉంటుందా!? ఉంటుంది. అప్పుడుగాని ఆమెకు అర్థం కాదు. ఆమె ఒంటరిదవుతుంది. ఇదేదో బాగుంది. వాన తుంపర్లలో నడుస్తూ ఉంటే అతనిలో ఏవేవో ఆలోచనలు. ఆమె మీద కక్ష సాధిస్తాడు. అతనికి తన నిర్ణయం నచ్చింది.

స్ట్రీట్ లైట్స్ వల్ల వెలుతురు రోడ్ మీద పడుతోంది. దీపపు పురుగులు వృత్తాకారంలో నాట్యం చేస్తున్నాయి. ముసురుకుంటోన్న చీకటిలో అతనికి పార్కు దగ్గర ఓ ఆకారం కనిపించింది. ముందు కెళ్ళి చూశాడు. తడిసి పోయిన బట్టల్లో 'ఎనిమిదేళ్ళ కుర్రాడు' చెట్టుకింద కూర్చున్నాడు.

దయనీయంగా ఉన్న ఆ కుర్రాడి అవతారం వేణు దృష్టినాకర్షించింది. ఆ కుర్రాడి దగ్గర కనీసం చిన్నపాటి రగ్గు కానీ, గొడుగు కానీ లేదు. వాడిముందు పెద్ద జంగిడి ఉంది. దాన్నిండా ఉడకబెట్టిన పల్లీలు పోగులు పోగులుగా పోసి ఉన్నాయి. అంత చలిలో ముడుచుకుని కూర్చున్నాడు. సాయంత్రం కొంతమంది కాలక్షేపం అతగాడికి జీవనాధారం.

వేణు దగ్గరయ్యేసరికి ఆ కుర్రాడు ఆశగా అతనికేసి చూసి, మళ్ళీ కళ్లు దించుకున్నాడు. వేణు మరికాస్త దగ్గరకెళ్ళి వాణ్ని పరిశీలించాడు. రోడ్ పక్కనుండి తినుబండారాలు అమ్మే వాళ్ళకుండే తెలివి ఆ కుర్రాడికి లేదు.

"ఒరే చోటూ... నువ్వూ నేనే రా ఈ ప్రపంచంలో కష్ట జాతకులం"... అని మనసులో అనుకున్నాడు వేణు. వాడి కళ్ళు ఎందుకో ఆకర్షించాయి. ఇద్దరి మధ్య ఎంతో అంతరం ఉండవచ్చు గాక, కాని బాధన్నది. ఏ మనిషికైనా ఒకటే.

"పోగు అయిదు రూపాయలు" వేణూ దగ్గరకి రావడం చూసి అన్నాడు కుర్రాడు

"అన్నీ కలిపి ఎంతకిస్తావ్?" అనడిగాడు వేణు.

"ఏభై రూపాయలు" అన్నాడు పోగులు లెక్క పెడుతూ,

"వేరే బేరం లేదా?" సంభాషణ పొడిగించాలని అడిగాడు.

గిరాకీ దొరికిందన్న ఆనందం ఆ కుర్రాడి మొహంలో మాయమైంది.

"అమ్మ తిడుతుంది!" ఆ మాటలు వేణు గుండెలకు సూటిగా తాకాయి.

"అంటే... మీ అమ్మ స్వయంగా ఉడకబెట్టి నీకు ఇచ్చి పంపిందా?" అనడిగాడు.

తలూపాడు కుర్రాడు

వేణు అక్కడే ఉన్న ప్లాస్టిక్ కవర్లో మొత్తం ఉడకబెట్టిన పల్లీలు కట్టమన్నాడు. ఆ కుర్రాడికి ఎవరెస్టు ఎక్కినంత ఆనందం కలిగింది. ఆనందంగా పల్లీలన్నీ కవర్లో కట్టి వేణుకి ఇచ్చాడు.

ఇంత చలిలో ఒకటీ రెండూ రూపాయల లాభం కోసం కూర్చున్న కుర్రాడి ఇంటి పరిస్థితి ఏమై ఉంటుంది? ఈ ఆలోచన రాగానే వెన్నులో వణుకొచ్చింది. ఒక అయిదువందల నోటు తీసి కుర్రాడి చేతికిచ్చాడు. అంత పెద్ద నోటు అంత దగ్గరనుంచి చూడగానే కుర్రాడి మొహంలో ఆనందం అంతా కరిగిపోయింది.

"నా దగ్గర చిల్లర లేదు!" అన్నాడు కుర్రాడు విచారంగా.

"మీ ఇల్లెక్కడ?" అడిగాడు వేణు.

"పక్క వీధిలో"

అతనిల్లు చూడాలనిపించింది వేణుకి.

"అయితే నడు... మీ ఇంటికెడదాం! నేనెలాగూ వెళ్ళాలి. దారిలో ఇంటి దగ్గర ఆగి చిల్లర తీసుకుంటాను." అన్నాడు వేణు.

"ఇంటి దగ్గర కూడా చిల్లర ఉండదు!"

"ఉంటుంది... నడు!" అన్నాడు వేణు.

కుర్రాడు కంగారుగా ఖాళీ జంగిడి పట్టుకుని ముందు నడుస్తుండగా వేణు వెనక నడుస్తున్నాడు.

"మీ నాన్న ఏం చేస్తుంటాడు?"

"నాన్న లేడండి!"

"మీ అమ్మ ఏం చేస్తుంటుంది?" కొంచెం ముందుకెళ్ళాక అడిగాడు వేణు.

"మా అమ్మ ఓ అయ్యగారింట్లో పనిచేసేది. వాళ్ళు పనిలోంచి తీసేశారు!"

"ఏం... ఎందుకని?"

"మా అమ్మ నెలకి మూడు వందల రూపాయలు తీసుకునేది. అది చాలా ఎక్కువ అనీ పనిలోంచి తీసేసారు!"

కుర్రాడు తొందరగా నడుస్తున్నాడు. వేణు బురదలోంచి కుర్రాడంత స్పీడుగా నడవలేకపోతున్నాడు.

"నీకు చలిగా లేదూ?"

"లేదండి" మరింత తొందరగా నడుస్తున్నాడు. పెద్ద కిటికీ అంత గుమ్మం వున్న ఇంటి దగ్గర ఆగి కుర్రాడు లోపలికి వెళ్ళాడు. అక్కడ గుమ్మంలో చిన్న దీపం తాలూకు గుడ్డి వెలుతురు పడుతోంది.

వేణు ఆ ఇంటిలోకి తొంగిచూశాడు. ఆ ఇల్లు ఇరుకుగా చిన్నదిగా ఉంది. ఒక మంచం గోడకి చేర్చి ఉంది. దాని మీద తడిసిన రెండు దుప్పట్లు వేళ్ళాడుతున్నాయి. ఆ గదిలో ఒక మధ్య వయస్కురాలు పాత చీర కట్టుకుని ఉంది. వేణు లోపలికి వెళ్ళలేదు...

"అప్పుడే పల్లీలన్నీ అమ్మేసావా!" ఆశ్చర్యంగా అడిగింది ఆ పిల్లాడిని చూడగానే.

"అమ్మేశానమ్మా. అయ్యగార్కి మనం చిల్లర ఇవ్వాలి!" అంటూ అయిదువందల నోటు ఆమెకి అందించాడు.

"అయ్యగారికి?" తల్లి అర్థంకానట్టుగా అడిగింది.

'ఆ అయ్యగారు. 'పల్లీలు' మొత్తం తీసేసుకున్నారు. చిల్లరలేదు. బైట నిలబడి ఉన్నారు!" చాలా ఉత్సాహంగా చెప్పాడు కుర్రాడు.

"నా దగ్గర చిల్లరలేదు. నోటు ఆయనకిచ్చెయ్ ఇల్లెక్కడో కనుక్కుని రేపు వెళ్ళిడబ్బులు తీసుకురా!" ఆమె మాటలు వేణుకి వినిపించాయి.

అయిదువందల నోటు తిరిగి ఇవ్వడానికని కుర్రాడు బైటికి వచ్చాడు.

"ఫరవాలేదు... ఉంచుకో!" కుర్రాడి తల్లికి వినబడేట్టు వేణు అన్నాడు.

"వద్దు బాబుగారూ! మీ నోటు మీరు తీసుకెళ్ళండి. మా పిల్లాడు వచ్చి రేపు డబ్బులు తీసుకుంటాడు!" అందామె.

'ఉంచుకో. మిగిలిన చిల్లరతో మీ అబ్బాయికేదైనా కొనిపెట్టు!" అన్నాడు వేణు తడబడుతూ.

"మీరన్ని డబ్బులు పిల్లాడికివ్వడం బాగాలేదు!" అందామె.

"సరే అయితే... ఈ వారం అంతా నేనే వచ్చి కొనుక్కుంటా పల్లీలు... నువ్వు ఉచితంగా ఇవ్వనక్కర్లేదు. నీ కొడుకుని మాత్రం వర్షంలో చలిలో పంపించవద్దు. సరేనా!" ఆమె మాట వినిపించుకోకుండా అలా చీకటిలో కలిసిపోయాడు

ఆమె ముఖం ఆనందంతో, కృతజ్ఞతతో నిండిపోయింది. అంత పెద్ద నోటుని అపురూపంగా కళ్ళకద్దుకుని కొంగుకి కట్టుకుని వెళ్ళి కుండీలో నీళ్ళతో చేతులు కడుక్కుంది. ఇంట్లో మూలకెళ్ళి పాత సత్తుడబ్బాలో ఉన్న రొట్టె తెచ్చి కొడుక్కి ఇచ్చింది.

"ఈరోజు కూడా జొన్నరొట్టేనా?" కుర్రాడు ఉక్రోషంగా అన్నాడు.

"ఉప్పూ కారం వెల్లుల్లి వేసాను. పచ్చి ఉల్లిపాయ నంచుకో. బావుంటుంది... తిను" కొడుకుని బతిమాల్తున్నట్టుగా అంది.

"పొద్దున్నా ఎండిపోయిన రొట్టె ఇచ్చావు. సాయంత్రమూ ఎండిపోయిన రొట్టే ఇస్తున్నావ్!" అంటూ కుర్రాడు రెండు అరచేతులు ముఖానికి అడ్డం పెట్టుకుని కుర్రాడు ఏడవడానికి సిద్ధపడుతున్నాడు. ఆమె పిల్లాణ్ని దగ్గరగా తీసుకుని...

"రేపు నీకోసం పప్పు కూడా వండుతాను. అయ్యగారు నీకు పెద్దనోటు ఇచ్చారు కదా... దాంతో పప్పు కొంటాను. ఎంతో రుచిగా చేస్తాను. ప్రతిరోజు నీ కోసం పప్పు వండుతాను!" తల్లి మాటలకి పిల్లాడు ఆనంద పడ్డాడు.

"అమ్మా.. నువ్వు తిన్నావా?" అనడిగాడు.

“నువ్వు తిను నాయనా. నాకు ఆకలి  లేదు!" అందామె పక్క పరుచుకుంటూ.

‘’ముక్క తినమ్మా’!"

"వద్దురా... నేను పొద్దున్న ఆలస్యంగా అన్నం తిన్నాను, నాకు ఆకలి లేదు. నువ్  తినెయ్!" అని పిల్లాడికి నోట్లో రొట్టె తుంచి పెట్టింది. అయితే ఆ తల్లీకొడుకులకి  రోడ్డుకి అటువైపు ఇంటికెదురుగా నిలుచుని వేణు చూస్తున్నాడని తెలియదు.

చిన్నప్పుడే తల్లి పోవడంవల్ల వేణుకి ఆ దృశ్యం ఎంతో మనోహరంగా అనిపించింది.  ఉచితంగా డబ్బు తీసుకోదని ఇంట్లో పనికి పెట్టుకుని  కుర్రాడికి చదువు  చెప్పించాలని మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాడు.

సెల్ ఫోన్ రింగవ్వసాగింది.  నీలిమ ఫోన్  చేస్తోంది.  లిఫ్ట్ చేసాడు.

"నేను బాధ, దు:ఖం అనుభవించిడానికే ఈ ప్రపంచంలో పుట్టినట్లున్నాను. నాకోసం ఇంకా రాలేదు ఎందుకూ?” ఏడుపు గొంతుతో అంది నీలిమ

వేణు మొహం జేవురించింది.  గట్టిగా ఊపిరి పీల్చుకుని తనలోని అనుకున్నాడు.

"నీలిమా! బాధ, దు:ఖం అంటే ఏమిటో నీకు తెలిసుంటే బావుండేది?" అని చెప్పాలనుకున్నా.. చెప్పలేదు.

‘’మా అమ్మానాన్న మీకోసం ఎదురుచూస్తున్నారు... మీరు ఎప్పుడు వస్తారా అనీ” బుంగమూతి పెట్టి అంది నీలిమ

“చూడు నీలిమా ఇవాళ్టినుంచీ నాకూ ‘తల్లీ … ఓ తమ్ముడూ’ ఉన్నారు.  నువ్వు లేకపోయినా వాళ్ళతో హేపీగా బతికేయగలను!”

వేణు ఫోన్ కట్ చేసాడు.

***0***

## దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



# చెదిరిపోని సుగంధం

కే. కే. భాగ్యశ్రీ

"మొన్నామధ్యన మీ అనకాపల్లి బాబాయ్ మనవరాలికి సంబంధాలు చూస్తున్నారన్నారు కదా! ఏమన్నా కుదిరిందా?" భర్తకి ఉదయపు ఫలహారం వడ్డిస్తూ అడిగింది భారతి.

"ఇంకా లేదు. అయినా అవన్నీ నీకనవసరం. కుదిరితే నేనే చెప్తాను కదా!" అసహనంగా అన్నాడు సురేష్ కరుకైన స్వరంతో.

చిన్నబుచ్చుకుంది భారతి.

సురేష్ కి అసహనం ఎక్కువ. భార్య అనేది తాను చెప్పేది వినడానికి మాత్రమే పుట్టింది అని భావించే సగటు మొగుడికి ప్రతిరూపం అతడు. అతడి నిరంకుశత్వానికి ప్రతి నిముషం బలైపోయే భార్య అనే బడుగుజీవి భారతి. అలాగని భారతి అసమర్ధురాలు, తెలివితక్కువది కాదు. చదువుకునే రోజుల్లో ఎంతో చలాకీగా, అన్నింటా ముందుంటూ 'రెబల్' అని పేరు తెచ్చుకుంది. కాని, భార్యాభర్తల సంబంధంలో ఎప్పుడూ భర్తగారిదే పైచేయి కావాలని అమ్మమ్మ, నాన్నమ్మలు నూరిపోసిన భావాలను ఒంటపట్టించుకుని, వాటిని తు.చ. తప్పక పాటిస్తూ ఉత్తమ ఇల్లాలుగా రూపాంతరం చెందింది.

భర్తగా అతడు అహంకారం ప్రదర్శించడం మగవాడిగా కాదు కాదు... 'మొగుడి' గా అతడి జన్మహక్కు అని సరిపెట్టుకుంది భారతి.

పిల్లల మీద ఆ ప్రభావం పడకుండా, వాళ్ళని మంచి వ్యక్తులుగా తీర్చి దిద్దాలని ఆమె అనుక్షణం తపిస్తుంది. ఒక మనిషి ఎలా ఉండాలో తెలియచెప్పడంతో పాటు, ఒక మగవాడు ఎలా ఉండకూడదో అన్న విషయం కూడా కొడుక్కి అర్ధమయ్యేలా బోధపరుస్తుంది. ఫలితం పిల్లలిద్దరూ తల్లి సాత్వికతను పుణికి పుచ్చుకున్నారు. కూతురు సుప్రజ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఓ పెద్ద కంపెనీలో ఉద్యోగం సాధించింది. దానితో, మునుపటిలా అన్నింటికీ భర్త ముందు చేయి చాచే పరిస్థితి నుంచి కొంచెం బయటపడింది భారతి. కొడుకు సుమన్ ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు.

'వాడికి కూడా మంచి ఉద్యోగం వస్తే... తన కష్టాలు తీరినట్లే' అనుకుని ఆనందపడుతుంది భారతి.

***

‘సుప్రజకి పెళ్లీడు వస్తోంది... మంచి సంబంధాలు చూడమని దగ్గరవాళ్ళకి చెప్పాలి’ అనుకున్న భారతి తన ఉద్దేశ్యాన్ని భర్త ముందు వెల్లడించడానికి భయపడింది. కాని, అంతలోనే ఆలోచించింది. ఒక తల్లిగా తన కూతురి భవిష్యత్తు గురించి మాట్లాడే అవసరం తనకుంది. అది ఎవరూ కాదనలేని హక్కు... అనుకుంది . కాని, ఆమె ఆ విషయం భర్త సముఖానికి తీసుకెళ్లకముందే సుప్రజ ఆమెకు తన మనసులో మాట చెప్పింది. తనతో పాటు పనిచేస్తున్న సాత్విక్ ని ప్రేమించానని, అతడితోనే తన జీవితం అని బలంగా నిర్ణయించుకున్నానని తల్లితో చెప్పింది.

భార్య నోటమ్మట కుమార్తె ప్రేమకథ విన్న సురేష్ ఆగ్రహోదగ్రుడైనాడు. కూతురు తన పరువు మంట కలిపింది అంటూ చిందులుతొక్కాడు. తన పెద్దరికాన్ని పక్కకు నెట్టేసి తన జీవిత భాగస్వామిని తానే వెతుక్కుందని దుర్భాషలాడాడు. ‘ఇదంతా నీ పెంపకం వల్లే జరిగిందంటూ’ భార్యని దుమ్మెత్తి పోశాడు.

అతడు అలా చిందులు తొక్కుతున్నంత సేపూ కూడా అలా శిలావిగ్రహంలా నిలబడి చూస్తూండిపోయింది భారతి. కదం తొక్కుతున్న గుర్రంలా ఎగిసిపడుతున్న అతడి ఆవేశం తగ్గుముఖం పట్టేవరకు సహనంతో వేచిఉంది.

అతడు కాస్త నెమ్మదించాక.. “చూడండి. సుప్రజ చదువుకున్న పిల్ల. మంచిచెడ్డ అన్నీ ఎరిగి తనకోసం ఒక తోడుని వెదుక్కుంటే మనం ఇలా రాద్ధాంతం చేయడం అర్ధరహితం. పైగా అతడేమీ అయోగ్యుడు కాదు. సుప్రజ కన్నా ఎక్కువే సంపాదిస్తున్నాడు. వాళ్ళది మంచి కుటుంబం అని సుప్రజ చెప్పింది. కాస్త ప్రశాంతంగా ఆలోచించండి!” అంటూ మెత్తని స్వరాన నచ్చచెప్పింది భారతి.

“నీకేం ఎన్ని కబుర్లైనా చెప్తావు. దాని మట్టుకు అది అంతా నిర్ణయించేసుకుని, బుగ్గగిల్లి జోల పాడినట్లుగా ఆఖరున మనకి చెప్పింది. ఒక తండ్రిగా అది నాకెంత అవమానమో ఆలోచించు!” మళ్ళీ చిర్రుబుర్రులాడబోయాడు సురేష్.

“మీది మరీ విడ్డూరం! ప్రేమించే ముందు తల్లిదండ్రుల అనుమతి తీసుకుని ప్రేమిస్తారా ఎవరైనా! మీరు కాస్త నిదానించండి!” అతడిని శాంతపరిచింది భారతి.

“సరేలే... ఇప్పుడు నేనేం చేయాలో కాస్త చెప్పి తగలడు!” అసహనంగా అరిచాడు సురేష్.

“మనిద్దరం ఆ అబ్బాయి వాళ్ళింటికి వెళ్ళి, వాళ్ళ అమ్మ నాన్నలతో మాట్లాడుదాం. వివరం చెప్పి, సాత్విక్ కి మన అమ్మాయిని చేసుకోమని అడుగుదాం!” చెప్పింది భారతి.

“సరేలే! ఈ పాటిదానికి ఇద్దరం వెళ్లడం దేనికి.. ముందు నేను వెళ్ళి మాట్లాడి వస్తా! వాళ్ళు ఒప్పుకుంటే నిన్ను తీసుకెళ్తా... ముందే నువ్వు రావడం అనవసరం కదా!” తన ధోరణిలో తానన్నాడు సురేష్.

‘నీకు అనవసరం’ అన్న దాని నుంచి ‘నువ్వు అనవసరం’ అనే దాకా వచ్చిన అతడి అభిజాత్యం చూసి నిట్టూర్చింది భారతి.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన సురేష్ ముఖం అప్రసన్నంగా ఉండడం చూసి విషయం బెడిసికొట్టిందని అర్ధం చేసుకుంది భారతి.

స్నానం చేసొచ్చి, భార్య ఇచ్చిన టీ తాగి, కొంచం కుదుటపడ్డాడు సురేష్.

"మొత్తానికి నీ కూతురు భలే సంబంధం ఎంచుకుందిలే. ఆ పిల్లాడి తండ్రికి నిలువెల్లా అహంకారమే! మనది బోడి సంబంధమట, వారితో సరితూగే తాహతు మనకి లేదట, ఇంకా ఏవేవో అన్నాడు . మొత్తానికి ఈ రోజు నీ వల్లా, నీ కూతురి వల్లా చాలా అవమానం పొందాను. దాన్ని ఆ కుర్రాడిని మరచిపోయి, నోరు మూసుకుని నేను తెచ్చిన సంబంధానికి ఒప్పుకోమను!" చిటపటలాడుతూ జరిగింది చెప్పాడు సురేష్.

హతాశురాలైంది భారతి. ఇతగాడు వెళ్ళినప్పుడే అనుకుంది వ్యవహారం చెడే ప్రమాదం ఉందని. సురేష్ కి మాట తీరు లేకపోవడంతో పాటు, కార్యదక్షత కూడా శూన్యమే.

సుప్రజతో విషయం చర్చించినప్పుడు "చూడు తల్లీ! మీ నాన్నగారు సంబంధం మాట్లాడడానికి వెళ్ళినప్పుడు సాత్విక్ నాన్నగారు చాలా అమర్యాదకరంగా ప్రవర్తించారట. ఆ అబ్బాయిని మరచిపొమ్మని మీ నాన్న తెగేసి చెప్పారు. ఇప్పుడేం చేయాలనుకుంటున్నావు?" అడిగింది భారతి.

"పెద్దల ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేసుకోవడం నాకే కాదు... సాత్విక్ కీ ఇష్టంలేదు. ఎలాగైనా, ఎప్పటికైనా మిమ్మల్ని ఒప్పించే మేమిద్దరం పెళ్లి చేసుకుంటాం. దానికి కొంచెం టైం పడుతుంది. అప్పటి వరకు నాన్నని కాస్త ఆపితే సరిపోతుంది." చెప్పింది సుప్రజ స్థిరంగా.

ఆమె స్వరంలో తొణికిసలాడుతున్న ఆత్మవిశ్వాసం చూసి ముచ్చటపడింది భారతి.

సుప్రజ ఈ తరం ఆడపిల్ల. తనకేం కావాలో, దాన్ని ఎలా సాధించుకోవాలో ఆమెకు స్పష్టత ఉంది. ఆమెకు కాస్త సహకారం అందించడం తల్లిగా తన ధర్మం.

ఆ రాత్రి అందరూ పడుకున్నాక ఫేస్ బుక్ చూస్తున్న భారతి సాత్విక్ ప్రొఫైల్ ని పరిశీలించడం మొదలెట్టింది. అతడి ఫ్రెండ్స్ లిస్ట్ చూస్తున్న ఆమె దృష్టి ఒకచోట ఆగిపోయింది. ఆమె పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

***

"నేను లోపలికి రావచ్చునా అండీ!" వినయం నిండిన స్వరంతో అడుగుతున్న భారతికేసి తేరిపార చూస్తూ "మీరూ..." అడిగింది నళిని ఆశ్చర్యంగా.

"నేను సుప్రజ తల్లిని. నా పేరు భారతి." చెప్పింది భారతి.

"ఓ... సారీ... లోపలికి రండి." చప్పున గుమ్మానికి అడ్డు తొలిగి ఆమెను లోపలికి ఆహ్వానించింది నళిని.

భారతి లోపలికి అడుగుపెట్టగానే కూర్చోడానికి సోఫా చూపించి, లోపలినుంచి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చి "ఏం తీసుకుంటారు? కాఫీ... టీ..." అడిగింది నళిని.

"అబ్బే. అలాంటివేమీ వద్దు! ఇంట్లో మీ వారుంటే పిలవండి. కొద్దిగా మాట్లాడాలి!" మృదువుగా చెప్పింది భారతి.

నళిని లోపలికి వెళ్లి భర్తని తీసుకొచ్చింది. ఈ లోపు ఇంటిని పరికించి చూసిన భారతి 'కొంచెం ఉన్నవాళ్లలాగానే ఉన్నారు." అనుకుంది మనసులోనే.

"చెప్పండి... ఏదో మాట్లాడాలన్నారట?" గంభీరంగా వినబడిన సారధి గొంతు విని, చప్పున చూపు తిప్పుకుని "నమస్తే అండీ... నేను సుప్రజ తల్లిని. సుప్రజ పెళ్ళి గురించి మీతో మాట్లాడాలని వచ్చాను!" అంది భారతి వినమ్రంగా.

"నా నిర్ణయమేదో నిన్ననే వినిపించానే..." కాస్త అసహనంగా చెప్పాడు సారధి.

"మీతో వియ్యమందడానికి మా తాహతు సరిపోదు అని అన్నారట... మీ దృష్టిలో 'తాహతు' అంటే ఏమిటో కాస్త చెబుతారా?" తాపీగా అడిగింది భారతి.

'ఈ మాత్రం కూడా తెలియదా!' అన్నట్లు చూస్తూ "తాహతు అంటే... సమాజంలో మీకున్న స్థితిగతులని అర్థం! మీ సంబంధం మా స్థాయికి తగదని కాదన్నాం!!" ఒకింత చిరాగ్గా చెప్పాడు సారధి.

"నా దృష్టిలో తాహతు అంటే ఏమిటో చెప్పనా సార్... సుగుణాలలోనూ, అర్హతలలోనూ ఒకరికొకరు సరితూగడం. మనం ఆలోచించుకోవలసినది... మన పిల్లలకి వారసత్వంగా ఏం ఇవ్వగలిగాం, ఏం ఇచ్చాం అని! నేను గర్వంగా చెప్పుకోగలను సార్... మా పిల్లలకి సహనం, సౌహార్ద్రం, సంస్కారం అనే ఉత్తమ లక్షణాలను వారసత్వంగా ఇచ్చానని. మా అమ్మాయి మీ ఇంటికి, వంశానికి వన్నెతెచ్చేదే గాని, మీకు ఏమాత్రం అసౌకర్యం కలిగించేది కాదు. డబ్బుదేముంది సార్... ఇవాళ వస్తుంది, రేపు పోతుంది. కాని, పుట్టుకతోనూ, పెంపకంలోనూ వచ్చిన సంస్కారం మాత్రం ఎన్నటికీ చెదిరిపోని సుగంధం!" ఒక ధారగా మాట్లాడుతున్న భారతి వాగ్ధాటి సారధి దంపతులని కట్టిపడేసిందనడంలో అతిశయోక్తి లేదు.

ముఖ్యంగా ఎవరినీ కించపరచకుండా ఆమె మాట్లాడే విధానం, తన బిడ్డల గురించి చెబుతున్నపుడు ఆమె కళ్లలో వారిపట్ల నమ్మకం, ముఖంలో నిండిన వెలుగు... ఇవన్నీ వాళ్ళని పునరాలోచనలో పడేశాయి. ఆవేశపూరితంగా మాట్లాడిన సురేష్ వైఖరికి, ఆచి తూచి సంభాషిస్తున్న భారతి ప్రవర్తనకి చాలా తేడా కనబడింది.

"ఇష్టపడిన వాళ్లని పెళ్లిచేసుకుంటే పిల్లలు ఆనందంగా ఉంటారు కదా! మనకి ఎన్ని కోట్ల ఆస్తి ఉన్నా సరే.. అది మన పిల్లల సంతోషానికి సాటిరాదు! నేను చెప్పవలసినది చెప్పాను. తరువాత మీ ఇష్టం...!" నిర్ణయం వారికే వదిలేసింది భారతి.

ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. నళిని వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా సారధి చిన్నాన్న కూతురు పద్మిని కనబడింది.

"బాగున్నావా పద్దూ..." కుశలప్రశ్నలు వేస్తున్న ఆమెకు బదులీయకుండా, పరుగున వచ్చి సోఫాలో కూర్చున్న భారతిని కౌగలించుకుంది పద్మిని.

"హాయ్ యాంజిల్... హౌ ఆర్ యు?" అంటూ ఆత్మీయంగా పలకరించింది.

"హాయ్ పద్మా! నేను బాగున్నానే. నువ్వెలా ఉన్నావు? చాలా కాలానికి కలిశాం కదూ!" చిరునవ్వుతో అడిగింది భారతి.

“అవునే! అదికూడా భలేగా..” అంటూ సారధి వైపు తిరిగి “ఒరేయ్ అన్నయ్యా. నీకెప్పుడూ చెబుతూ ఉంటాను కదా.. మా ఫ్రెండ్ భారతి అని.. అది ఇదే! నీకు గుర్తుందా.. మన కిరణ్మయి సమస్యను అతి చాకచక్యంగా పరిష్కరించినది తనే! ” గలగలా చెప్పుకుపోసాగింది పద్మిని.

“అవన్నీ ఇప్పుడెందుకులే…” మొహమాటంగా అంది భారతి.

“చెప్పనీయవే. నీ గొప్పతనం నువ్వెలాగూ చెప్పుకోవు, కనీసం మమ్మల్నైనా చెప్పనీ…” ముద్దుగా విసుక్కుంది పద్మిని.

సారధి కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి. ఆమె… ఆమె ఈ భారతేనా! నమ్మశక్యంగా అనిపించడంలేదు. సున్నితంగా, మెత్తగా మాట్లాడుతున్న ఈ భారతేనా! ఆనాటి జటిల సమస్యను పరిష్కరించినదీ! సామాన్యంగా కనిపిస్తున్న ఈమెలో అటువంటి నాయకత్వ లక్షణాలున్నాయంటే… విశ్వసించడం కష్టం.

కిరణ్మయి సారధి, పద్మినిలకి మేనత్త కూతురు. కాలేజీలో పద్మినికి జూనియర్. అప్పట్లో భారతి కాలేజీ ప్రెసిడెంట్. సమర్ధవంతమైన ఆమె నాయకత్వం అంటే అందరికీ ఎంతో ఇష్టం. నమ్మకం. క్యాంపస్ లో ఎవరికి ఏ సమస్య వచ్చినా చిటికెలో దాన్నుంచి బయటపడేసేది.

ఎలా పడిందో తెలియదు గాని, కిరణ్మయి వేరే కాలేజ్ లో చదువుతున్న రాకేష్ తో ప్రేమలో పడింది. రాకేష్ సకల గుణాభిరాముడు. అమాయకంగా కనబడే అమ్మాయిలని మాయమాటలతో మభ్యపెట్టి, వశపరచుకోవడం అతడికి వెన్నతో పెట్టిన విద్య.

పాపం.. అతడి కపటవేషాలు నిజమని నమ్మిన కిరణ్ అతడితో పీకల్లోతు ప్రేమలో కూరుకుపోయి తన సర్వస్వాన్ని అర్పించింది. కొన్నాళ్ళు ఆమెతో ప్రేమనాటకం నడిపాక, ఆమె మీద మోజు తీరిపోయిన తరువాత కిరణ్, తను సన్నిహితంగా ఉన్న కొన్ని ఫోటోలను చూపించి తాను అడిగినంత డబ్బు ఇవ్వకపోతే ఆ ఫోటోలని బయటపెట్టి, ఆమె బతుకు బజారుపాలు చేస్తానని ఆమెను బ్లాక్ మెయిల్ చేయసాగాడు రాకేష్. తాను రాకేష్ మీద పెట్టుకున్న నమ్మకం వమ్ముకావడంతో పిచ్చిదానిలా తయారైన కిరణ్మయి, ఇదంతా ఇంట్లో తెలిస్తే ఇంట్లోవాళ్ళ పరువు పోతుందని భయపడింది. మానసికంగా బలహీనంగా తయారై ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. ఆమె అదృష్టంకొద్దీ అది భారతి వాళ్ళకి తెలిసి, ఆమెను కాపాడారు. భారతి మృదువైన మాటలతో ఆమెకు కౌన్సిలింగ్ చేసి, ఆమె ఆలోచనలలో మార్పు తేగలిగింది. తన మిత్రులందరి సహకారంతో పక్కాగా ప్రణాళిక రచించి, మాయగాడైన రాకేష్ ఆటకట్టించి, వాడిని కటకటాల ఊచలు లెక్క పెట్టేలా చేసింది. ఈ తతంగం అంతా జరుగుతున్నప్పుడు సారధి ఏదో ట్రైనింగ్ కోసమని ఢిల్లీలో ఉన్నాడు. జరిగినదంతా తెలిశాక ఆ భారతి ధైర్యాన్ని మనసారా మెచ్చుకున్నాడు. ఆమెను కలిసి తన అభినందనలు తెలియజేద్దాం అనుకున్నాడు కాని, అప్పటికే భారతి తండ్రికి ఆ ఊరునుంచి బదిలీ అయి, వారు వేరే ఊరికి వెళ్ళిపోవడం వలన కుదరలేదు.

ఆనాటి డేర్ డెవిల్.. ఈనాడు ఇంత సింపుల్ గా, తన కూతురి పెళ్లి విషయంలో తన ముందు నిలబడడం చూసి సారధి ఆశ్చర్యపోతున్నాడు. భారతి తలుచుకుంటే తనని కాదని సుప్రజ, సాత్విక్ ల పెళ్ళి జరిపించేసి

ఉండేది. అలా కాదని, ఇలా తనని ఒప్పించడం కోసం తన ఇంటికి రావడంలోనే బోధపడుతుంది ఆమె సంస్కారం.
ఏ విత్తు వేస్తే ఆ మొక్కే మొలుస్తుంది. మంచిగంధపు సుగంధం పరిసర ప్రాంతాలను కూడా పరిమళభరితం చేస్తుంది. భారతి కడుపున పుట్టిన సుప్రజకి ఆమె ధైర్యసాహసాలు, సద్బుద్ధి అలవడే ఉంటాయి.
"సారీ భారతి గారూ! మీరెవరో తెలియకా... " సిగ్గుగా చేతులు నులుముకున్నాడు సారధి.
"మొన్న ఫేస్ బుక్ లో మీ అబ్బాయి ప్రొఫైల్ చూస్తున్నప్పుడు, అతడి ఫ్రెండ్స్ లిస్ట్ లో ఉన్న పద్మిని కనబడింది. నేను పద్మినికి ఫోన్ చేసి విషయం చెప్పాను. నాకు, పద్మినికి ఉన్న స్నేహాన్ని పురస్కరించుకునో, లేకపోతే ఆనాడు నేను కిరణ్ జీవితాన్ని కాపాడాననో... మా సంబంధం అంగీకరించమని నేను చెప్పడం లేదండీ, మా అమ్మాయి మీకు అన్ని విధాల తగిన కోడలు అవుతుందన్న నమ్మకంతో అడుగుతున్నాను!" భారతి మాటల్లో అదే సున్నితత్వం.
"తప్పకుండానమ్మా. సుప్రజ మా ఇంటి కోడలు కావడం మా అదృష్టంగా భావిస్తున్నాము. నిన్న మీ వారు కొంచెం ఆవేశంగా మాట్లాడడంతో నేనూ కొద్దిగా హద్దు మీరాను. అందుకు క్షమించండి." సారధి చెప్పాడు బిడియపడుతూ.
"నిజానికి ఆయన వలన నొచ్చుకున్న మీరే మమ్మల్ని క్షమించాలి." ఒద్దికగా చేతులు జోడించింది భారతి.
"అంత మాట వద్దులేమ్మా. త్వరలోనే పిల్లలిద్దరి పెళ్ళి జరిపించేద్దాం!" చల్లగా నవ్వాడు సారధి.
భారతి ఆనందంగా చూసింది. పద్మిని, నళిని సంయుక్తంగా "శుభం" అన్నారు.


***

"నాకు ఒక్క విషయం అర్థం కావడంలేదు భారతీ! నేను వెళ్ళినప్పుడు అంత దూకుడుగా, గర్వంగా మాట్లాడిన ఆ సారధి, తనంత తానుగా ఫోన్ చేసి మన పిల్లని కోడలిగా చేసుకుంటామని ఎందుకు చెప్పాడంటావ్?" విపరీతంగా ఆశ్చర్యపోయాడు సురేష్.
"ఏమో నాకేం తెలుస్తుంది! సాత్విక్ ఏమన్నా కన్విన్స్ చేసి ఒప్పించాడేమో! అందుకే ఆయన మనసు మార్చుకున్నట్లున్నాడు!" తనకేమీ తెలియనట్లు అమాయకంగా అంది భారతి.
"ఏమో... కావచ్చు!" అయోమయంగా బుర్ర గోక్కున్నాడు సారధి.
"త్వరగా తాంబూలాలు పుచ్చుకుని ముహూర్తాలు పెట్టుకోవాలి. ఇంతకీ పెళ్ళికి ఏ కళ్యాణమండపం బుక్ చేద్దామనుకుంటున్నారు? " యధాలాపంగా అడిగింది భారతి.
యధాప్రకారం "నీకు అనవసరం. అవన్నీ నేను చూసుకుంటాను!" అనేశాడు సురేష్.
నవ్వుకుంది భారతి.

***0***

## దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ






# బొమ్మరిల్లు

కొత్తపల్లి ఉదయబాబు

“నానమ్మా... ఎలా ఉన్నావ్?" కవ్వంతో వెన్న చిలుకుతున్న పరమేశ్వరి హఠాత్తుగా మనవడి రాకతో ఉలిక్కిపడింది.

"ప్రభూ...నువ్వేనా నాన్న? ఈ నాన్నమ్మ ఇపుడు గుర్తువచ్చిందా? ఎపుడు నాలుగు రోజులు ఉండేలా పంపమన్నా 'వాడి చదువు పోతుంది. ఆదివారాలు కూడా వాడికి క్లాసులుంటాయి ' అని మీ నాన్న ఒకటే గోల పెట్టేవాడు.  అలాంటిది నా మనసెరిగి ఇన్నాళ్ళకు నిన్ను పంపించాడన్నమాట." చేస్తున్న పని ఆపి లేచి ఆమె ప్రభాత్ బుగ్గలు చిదిమి 'నా బంగారు కొండ' అని ముద్దాడింది.  ఊహించని విధంగా ప్రభాత్ నానమ్మని కరుచుకుపోయాడు.

"నాన్న పంపించలేదు నానమ్మా... నేను... నేనే చెప్పకుండా వచ్చేసాను." పరమేశ్వరి విస్తుబోయింది.

"ఏమిటీ? చెప్పకుండా వచ్చేసావా? నాన్న, అమ్మ ఎంత కంగారు పడతారో తెలుసా?" ఆదుర్దాగా అడిగింది ఆమె ప్రభాత్ ని.

"పడనీ. పడాలి నానమ్మా! పదో తరగతి వరకు వారి ఇష్టం. కాని ఇంటర్ కు వచ్చాకా మా పిల్లల ఇష్టాలతో  పని లేకుండా వారి ఇష్టాలను మా మీద రుద్దుతానంటే ఊరుకునే తరం కాదు మాది. నిజానికి ఇక్కడకు కూడా రాకుండా చచ్చి పోదామనుకున్నాను. కానీ అపుడపుడు నువ్వు చెప్పే మాటలు,  నాలో  కొత్త ఉత్తేజాన్ని, నువ్వు రాసే ఉత్తరాలు నాలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. 'కోపం వచ్చి ఏదైనా ఒక పని చేసే ముందు ఒక్క క్షణం ఆలోచించు ' అని నువ్వు ఒకసారి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి ఈ విధంగా అయినా నిన్ను చూడవచ్చు అనే ఉద్దేశంతో వచ్చేసాను నానమ్మా.. తప్పు చేసానా?" అడిగాడు ప్రభాత్ గారంగా.

ఆమె మనవడి బుగ్గలు చిదిమి తన చేతిని తానే ముద్దు పెట్టుకుంది.

"నా దగ్గరకు వచ్చి మంచి పని చేసావ్ నాన్న. దేవుడు అందమైన మానవ  జీవితాన్ని ఇచ్చింది.. ఒక పరమార్థం సాధించడానికి. సృష్టిలో మనం పనికిరావనుకున్న ఎన్నో మొక్కలు వైద్యంలో పనికి వస్తాయి.

అలాగే మిగతా జీవులు కూడా! జీవితం మీద విసిగి విరక్తి చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఎందరో, కనీస జీవిత సత్యాలు తెలీక, పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడు అని తెలుసుకోలేక, అర్ధాంతరంగా జీవితాల్ని ముగించుకుంటున్నారు. ప్రతీ పుస్తకంలోను మంచో చెడో ఉంటుంది. మంచి పుస్తకం చదివితే ఎలా మన జీవితాన్ని మలచుకోవాలో తెలుస్తుంది. అదే చెడ్డ పుస్తకం చదివితే మనం ఎలా బ్రతకకూడదో చెబుతుంది. ఈ సున్నిత విషయం గ్రహించే తీరిక, ఓపిక ఈవేళ సమాజంలో దాదాపు లేదనే చెప్పాలి. ముందు స్నానం చేసిరా. టిఫిన్ పెడతాను." అందామే కామన్ బాత్రూం బయట తలుపు పక్కన గీసర్ ఆన్ చేస్తూ. "సరే." భుజాన ఉన్న బాగ్ తీసి గెస్ట్ రూమ్ లోకి వెళ్ళాడు ప్రభాత్. టవల్ కట్టుకుని మరో టవల్ భుజం మీద వేసుకుని బాత్ రూమ్ లోకి వెళ్ళబోతూ "నువ్వు నాకో మాటివ్వు నానమ్మా. నేనిక్కడ ఉన్నట్టు మా నాన్నకి ఎట్టి పరిస్తితులలోను చెప్పను అని నాకు మాటివ్వు. ఊహు.. నామీద ఒట్టు వేయి." అని ఆమె మాట కోసం ఎదురు చూడకుండానే ఆమె కుడి చేతిని తన తల మీద పెట్టుకున్నాడు ప్రభాత్.

పకపకా నవ్వేసింది పరమేశ్వరి. "హారి భడవా! ఎందుకంత కోపం అమ్మ నాన్న మీద?"

"ఇది కోపం కాదు నానమ్మా. ఒక అమాయకత్వం మీద ప్రయోగిస్తున్న నియంతృత్వం మీద నిరసన. నీ సెల్ ఫోన్ ఏదీ? నాకివ్వు." అన్నాడు తన సెల్ ఫోన్ కుడిచేతిలో ఉంచుకుని.

మళ్ళీ నవ్వేసింది పరమేశ్వరి. తన ఫోన్ ప్రభాత్ కి ఇస్తూ... "నామీద కూడా అంత అపనమ్మకం అన్నమాట." అంది.

"అబ్బా.. ఇది అపనమ్మకం కాదు. ముందు జాగ్రత్త." అంటూ ఆ ఫోన్ కూడా అందుకుని బాత్రూంలో దూరాడు ప్రభాత్.

***

మనవడున్న నాలుగు రోజులు నాలుగు క్షణాలుగా గడిచిపోయాయి పరమేశ్వరిగారికి. మనవడితో ఎన్నెన్నో కబుర్లు. ఊడ్పులూడ్చాకా వరి పైరులన్నీ వెన్నులేసి పాలుపోసుకుంటున్న తరుణమది. కనుచూపు మేరంతా ధరణీమాత, ఆకుపచ్చ చీర కట్టుకుని వీస్తున్న పైరగాలికి అలల కెరటాలల్లే పైర్లు తలూపుతుంటే, సాయం సంధ్యలో అస్తమిస్తున్న భానుడి ప్రతిబింబాన్ని నుదుటి తిలకంగా దిద్దుకున్న విశాలమైన నుదురుగల ఆకాశం, అతన్ని తమ చాటున దాచేసుకోవాలనుకుంటున్నట్లుగా మేఘమాల ప్రయత్నిస్తుంటే.. తన కిరణ ప్రభావంతో మేఘాల అంచుల్ని వెండి మెరుపులతో మెరిపిస్తూ పశ్చిమానికి వాలిపోతున్న సూర్యబింబపు అందాన్ని మనసు పొరల్లో ముద్రించుకుంటూ ఆమెను అనుసరించాడు ప్రభాత్. ఈ నాలుగు రోజుల్లో మనవడి అభీష్టాలు చాలా తెలుసుకుంది ఆవిడ. వంట చేస్తున్న సమయంలో భోజనం పట్ల అతని ఇష్టాలు, సినిమాలపై అభిప్రాయం, కళల పట్ల సాహిత్యం పట్ల అతని అభిరుచి, పట్నవాసపు జీవితంతో పోలిస్తే, పల్లె జీవితపు జీవన విధానం, మాతృదేశంలో చదువుకుని విదేశాలలో డాలర్ల సంపాదనకోసం ఎగబడుతున్న పిల్లల గురించి, వారిని ఆ విధంగా ప్రోత్సహించే తల్లితండ్రుల

గురించి... ఎన్నో ఎన్నో విషయాలను చర్చకు తెచ్చి, అతనితో వాదించి అతని స్పష్టమైన అభిప్రాయాలను తెలుసుకుంది పరమేశ్వరి.

ఆ రాత్రి పరమేశ్వరిని అడిగాడు ప్రభాత్. "నానమ్మా. ఇంత వయసు వచ్చినా నువ్వు ఎందుకు విశ్రాంతి తీసుకోవు? నాన్నగారి దగ్గరకు వచ్చి ఎందుకు వచ్చి ఉండవు?"

"నేను అక్కడకు వచ్చేస్తే ఇక్కడ పొలం, పుట్రా సంగతి ఎవరు చూసుకుంటారు రా?" ఆవిడ తేలికగా నవ్వేస్తూ అంది.

"అది అసలు కారణం కాదు."

"మరి?" అమాయకంగా ముఖం పెట్టి అడిగింది పరమేశ్వరి.

"నువ్వే చెప్పాలి. ప్లీజ్. చెప్పవూ.." అడిగాడు నాన్నమ్మ ఒళ్ళో తలపెట్టుకుని.

"చెబుతానురా. మేము చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు వూరిలో అంతా ఒకే కుటుంబంలా ఉండేవాళ్ళం. ఐకమత్యంగా ఉండేవాళ్ళం. ఏదైనా సమస్య వస్తే మగవాళ్ళు అంతా కూర్చుని చర్చించేవారు. కుటుంబ పెద్దగా ఎవరైతే ఉంటారో వాళ్ళు విశాల దృక్పధంతో ఆలోచించేవారు. పదిమందికి పనికి వచ్చేలా నిర్ణయం తీసుకునేవారు. ఆడవాళ్ళం.. పెద్దలకి మా పరిధిలో సమాధానం ఇచ్చేంత పరిజ్ఞానం మాకు ఉండేది కాదు. వారి మాటే శిరోధార్యంగా ఉండేది. ఆ నిర్ణయం వల్ల లాభం వచ్చినా, నష్టం వచ్చినా అందరమూ సమానంగా భరించే వాళ్ళం. కానీ స్త్రీ చదువుకోవడానికి ఎప్పుడైతే సమాజంలో అడుగు పెట్టిందో, ఆనాటి నుంచి సమాజంలో చాల మార్పు వచ్చింది. తన కోసం, తన కుటుంబం కోసం తన చదువు అని నిర్ణయించుకుని కుటుంబ వ్యవస్థలో కీలక పాత్ర వహించింది. సంసారం గడవడానికి కుటుంబానికి ఆధారం అయింది. కానీ ఆధునిక విజ్ఞానం పేరుతో పరాయి సంస్కృతిని ఎప్పుడైతే మనం అనుకరించడం మొదలు పెట్టామో ఆరోజు నుంచి ఆడదాని ఆలోచనలో వింత మార్పు వచ్చింది. ఎంతసేపు తాను భర్త తన పిల్లలు.. వాళ్ళ పిల్లల ప్రేమ వాళ్ళకే దక్కాలి. ఉదాహరణకి నేను పిలిచాననుకో, 'బామ్మదగ్గర ఏంచేస్తున్నావురా? వచ్చి చదువుకో.. 'అని పిలిచేస్తే ఏమిటి అర్ధం? నీతో మాటలాడనివ్వరు. మీరు స్కూలుకు వెళ్ళిపోయాక ఒకసారి మీ అమ్మ నన్ను కడిగేసింది. 'మీకెందుకత్తయ్యా ఆ విషయాలు ఏదో కృష్ణా రామా అనుకోక. మీ దగ్గర పది నిముషాలు కూర్చుంటే వాడు పది రాంకులు వెనుకబడిపోతాడు. వాడు చదువుకుని పైకి వస్తే మీరేగా ఆనందించేది? వాడి భవిష్యత్తు పాడుచేయడం వల్ల మీకేం వస్తుంది చెప్పండి? మీ మనసు బాధపెడితే క్షమించండి.' అని పెదవి విరుపుగా అనేసి వెళ్ళిపోయింది!"

"అమ్మ నిన్ను అంతమాట అందా..?" అడిగాడు ప్రభాస్ బామ్మ కళ్ళల్లో ఏదో వెతుకుతూ.

అప్పటికే ఆమె చెంగుతో మనవడికి కనిపించకుండా కళ్ళు తుడుచుకుందామన్న ప్రయత్నం వ్యర్ధం అయింది.

ప్రభాస్ "సారీ బామ్మా. అనవసరంగా నిన్ను బాధపెట్టాను." అన్నాడు.

“లేదు నాన్నా. నేను అనవసరంగా అసలు బాధపడను. భగవంతుడు అవకాశం ఇస్తే ఒకరికి పెట్టే పై చెయ్యిగానే ఉండాలన్నది నా కోరిక నాన్నా!' అన్నారావిడ నవ్వుతూ.

“నానమ్మా... నీకు ఇన్ని తెలివితేటలూ ఎలా వచ్చాయి?” అడిగాడు ఆశ్చర్యంగా ప్రభాస్.

“వీటిని తెలివితేటలూ అనరు నాన్నా. బ్రతుకు తెరువు అంటారు. ఒక దారిలో నడుస్తున్నప్పుడు ఎదురుగా ఏవేవో అడ్డుగా వస్తుంటాయి. వాటి నుంచి సమయస్ఫూర్తితో తప్పించుకుని క్షేమంగా బయటకి వచ్చి మన గమ్యం వైపు ప్రయాణం చేయడమే జీవితం అంటే."

"అర్థమైంది నానమ్మా! అమ్మ ఏ విషయమూ ఇలా సౌమ్యంగా చెప్పదు. నాన్నని ఏ విషయంలో అయినా సపోర్ట్ చేస్తే, నేనేదో తనకి అన్యాయం చేసేసినట్టు మాట్లాడుతోంది. ‘రేపు నువ్వు నన్నేం చూస్తావ్?’ అని ఏదో కోల్పోయినట్టు ఏడ్చేస్తుంది. రేపు నేను తనని చూడాలని ఆలోచన ఉన్న అమ్మ, నాన్నని నిన్ను చూసేలా ఎందుకు ప్రోత్సహించదో అర్థం కాదు."

పరమేశ్వరిగారి కళ్ళల్లో చివ్వున నీళ్లు చిమ్మాయి.

"నాన్నా ప్రభా. మీ అమ్మకి అభద్రతా భావం ఉంది. నాకు అది లేదు. అందుకే హాయిగా బతుకుతున్నాను. సరే. బాగా పొద్దుపోయింది. ఇక పడుకో!" ప్రేమతో ప్రభాస్ తల నిమిరి దీపం తీసేసి తన గదిలోకి వెళ్లిపోయారామె. ప్రభాస్ చాలా సేపటి తరువాత నిద్రలోకి జారుకున్నాడు.

***

మరునాడు ఉదయం లేచి తన గదిలోంచి బయటకు వచ్చిన ప్రభాస్ కి హాల్లో తల్లిదండ్రులు ఇద్దరూ బామ్మతో మాట్లాడుతూ కనిపించారు. గంటు పెట్టుకున్న ముఖంతో వచ్చి వారి పక్కన కూర్చుని ముఖం పక్కకి తిప్పుకున్నాడు.

"ఒరేయ్ ప్రభూ... ఏం పనిరా ఇది. ఎంత కంగారు పడిపోయామో తెలుసా! మనసు మనసులో లేదు. నీకేదైనా కష్టం మావల్ల కలిగితే మాతో చెప్తే మనమే అక్కడ పరిష్కరించుకునే వాళ్ళం కదా. ఇక్కడ బామ్మని ఇబ్బంది పెట్టడం ఎందుకు?" అడిగాడు విజయచంద్ర. ప్రభాస్ మాట్లాడలేదు.

“ఏంటమ్మా... వాడంటే చిన్నపిల్లవాడు. నువ్వైనా నచ్చ చెప్పి ఇంటికి పంపాలి గానీ... ఇలా నీ దగ్గర ఉంచేసుకుంటే ఎలా?”

“బాగుందిరోయ్.... ‘నానమ్మా నేను ఇక్కడకు వచ్చినట్టు ఎవరికైనా చెబితే నామీద ఒట్టే’ అనీ నీ కొడుకు ఒట్టు వేయించుకున్నాడు. నన్ను ఏమన్నా అంటే బాగుండదు!” అందామె చిరుకోపం ప్రదర్శిస్తూ.

“నాన్నగారు. రెండు నిముషాలు నేను మనసు విప్పి మాట్లాడే అవకాశం ఇస్తారా? వింటాను అంటే చెప్పండి .. మాటాడతాను. లేదా... నిశ్శబ్దంగా ఇంటికి వెళ్ళిపోదాం. నాన్నమ్మను మాత్రం ఏమీ అనద్దు.”

ఆయన బిత్తరపోయాడు. తనతో కొడుకు ఏనాడు అలా మాట్లాడి ఎరుగడు. భార్య వైపు చూసాడు. తనకేమీ పట్టనట్టు తల తిప్పుకుంది అనిత. అత్తగారి ముందు మాట్లాడటం ఆమెకు ఇష్టం లేదు. ఆమె తర్కం ముందు తాను ఓడిపోతానని తెలుసు. అందుకే మౌనం వహించింది.

"సరే చెప్పు." అన్నాడాయన విసుగ్గా.
"నేను ఇంజనీరింగ్ చదవను నాన్నగారు. ఇంటెర్మీడియెట్ అయ్యాకా నేను డిగ్రీ చదువుతాను. ఏ శిక్షణో తీసుకుని బాంక్ లోనో, ఎల్.ఐ.సి.లోనో, లేదా రైల్వేలోనే ఉద్యోగం వచ్చేలా చదువుతాను. నేను జన్మించిన ఈ నేల మీదే బ్రతికి, ఈ గాలి పీలుస్తూ మన ఇండియాలోనే ఉంటాను గాని... నేను పెద్ద చదువులు చదివేసి, విదేశాలకు వెళ్లాలనే మీ కోర్కెలు మాత్రం తీర్చలేను, తీర్చను. మీకు అందుకు ఇష్టమైతే ఇంటికి వస్తాను. లేకపోతే రాను."
"ఎందుకని? "అడిగాడు విజయచంద్ర.
"చూడండి నాన్నగారు. మీరు నామీద ఖర్చుపెట్టే ప్రతీ పైసాకి నేను న్యాయం చేసే దిశగా కష్టపడతాను . మొదటి ముగ్గురిలో తప్పనిసరిగా ఒకడిగా ఉండే ప్రయత్నం చేస్తాను. దాంతో నా జీవితం స్థిరపడేలా చూసుకుంటాను. ఇక మీరు చెప్పిన మాటల్లో నా ఉన్నతి కన్నా, దాని ద్వారా మీరు సుఖంగా జీవించాలి అనే స్వార్ధం కనపడుతోంది!"
"అయితే ఏమంటావ్?" అన్నాడు ఉద్రేకంతో ఊగిపోయిన విజయచంద్ర.
"నాన్న...ప్రభా! నువ్వు గదిలోకి వెళ్ళు." ఆమె చూసిన చూపుకి ప్రభాస్ బామ్మగారి గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు.
"చూడబ్బాయి. ఊహ, జ్ఞానం తెలుస్తున్న పిల్లల జీవితాలు ముళ్ళమీద ఆరేసిన బట్టలాంటివి. చాలా జాగ్రత్తగా వాటిని ఏమాత్రం చిరుగు పడకుండా తీసుకునే నేర్పు తీసుకునేవాడికి ఉండాలి. లేకపోతే ఆ నష్టం ఇద్దరిదీను. వాడు రేపు సాయంత్రానికి నీ ఇంట్లో ఉంటాడు. సరేనా? భోజనాలకి లేవండి." అని తన దగ్గర ప్రభాస్ ఉన్న ఈ నాలుగు రోజుల్లో అతని అభిరుచులు, ఆలోచనలు... అన్నీ కొడుకు కోడలికి వివరించారావిడ. చాలా విషయాలు వారిద్దరితో చర్చించాకా చివరగా ఆమె అన్నారు.
"అబ్బాయి. ఈవేళ జ్ఞానం వచ్చిన ప్రతీవాడు తాను సొంతంగా ఆలోచించే తత్వాన్ని నేర్చుకుంటున్నాడు. అంతెందుకు? ఈవేళ నేను చెప్పే మాటలు మీకే నచ్చవు. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే. ఆధిక్యత, నియంతృత్వము కేవలం ధనవంతులకు, రాజకీయంలోనూ మాత్రమే పనికొస్తాయి. మధ్యతరగతి జీవితాల్లో వాటికి స్థానమిస్తే, జీవితంలో అతివిలువైనవి కోల్పోవచ్చు. లేదా వ్యక్తులనే కోల్పోవచ్చు. మీరు వాడితో చక్కగా మనసు విప్పి మాట్లాడండి. వాడు చెప్పేది వినండి. ఏది వాడి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుందో దానిని అనుసరించేలా మీ ప్రోత్సాహం, సహకారం అందించండి. మీ కోరిక, వాడి లక్ష్యం రెండూ నెరవేరేలా చక్కని ఆలోచన చేయండి. తద్వారా అందరమూ ఆనందంగా ఉంటాము. సరేనా?" అనిత చటుక్కున లేచి పరమేశ్వరిగారి కాళ్ళకి నమస్కరించింది.
"అనితా.. ఏమిటిది ..లే...లే.?" అని పరమేశ్వరిగారు కన్నీళ్లు జారిపోతున్న ఆమె బుగ్గలు తుడిచారు.
"చూడమ్మా! సముద్రతీరాన నిలబడినప్పుడు దూరంగా వస్తున్న పెద్ద కెరటాలను చూసి చాలా ఆనందం వేస్తుంది. మనమూ వాటిని చేరుకోవాలని ఆరాట పడతాము. కానీ అవి దగ్గరకు వచ్చేకొద్దీ మనల్ని

లోపలికెక్కడ లాగేస్తుందో అని భయమూ పడతాము. సమయస్ఫూర్తిగా నిర్ణయం తీసుకోవాల్సింది మనమేనమ్మా. ఈ సమాజంలో ప్రతీ కుటుంబం చక్కని బొమ్మరిల్లు లాంటిది. దానిని పదిమంది స్ఫూర్తిగా స్వీకరించేలా మన బొమ్మరిల్లును మరింత అందంగా మెరుగులు దిద్దుకునే అవకాశం మన చేతుల్లోనే ఉంది."

"అత్తయ్యా. నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి. కుటుంబ వ్యవస్థ పట్ల ఇంటి చక్కని అవగాహన ఉన్న మిమ్మల్ని ఇంతకాలం దూరం చేసుకున్నందుకు సిగ్గు పడుతున్నాను. నన్ను మన్నించండి. మిమ్మల్ని ఒక్క కోరిక కోరవచ్చా?" అడిగింది అనిత

"అడుగు!" "

"మాకు మీ సాహచర్యం కావాలి. ప్రభాస్ తన కాళ్ళ మీద తాను నిలబడేవరకు మీరు మాతోనే ఉండాలి. కాదనకండి."

"అమ్మా.. అవునమ్మ! ప్లీజ్. మమ్మల్ని క్షమించి మా ఇంటికి రామ్మా!" అన్నాడు విజయచంద్ర బాధాతప్త హృదయంతో.

"మీ ఇంటికి రాకపోవడానికి మీరు తప్పేమీ చేయలేదు నాన్న. జస్ట్ అభిప్రాయ భేదాలు అంతే. అయ్యో.. మీ మంచికే కదా మేము చెబుతున్నదీ... అని మేము అనుకుంటాం. మన సంసారం విషయంలో వీళ్ళ అభిప్రాయాలతో మనకి పనేమిటి? అని ఒకరికొకరు అనుకోవడం వల్లనే ఈ పరిస్థితి. ఈవేళ ఎవరి జీవితాలు వారివి. అనుబంధాలు పెంచుకుంటే పెరుగుతాయి. తెంచుకుంటే తెగిపోతాయి." అన్నారామె నిర్లిప్తంగా.

"నాన్నా.. ప్రభా..." పరమేశ్వరిగారు ప్రభాస్ ని పిలిచారు.

ప్రభాస్ ముభావంగా వచ్చాడు. "అమ్మ, నాన్న నన్ను ఇంటికి రమ్మంటున్నారు. రానా వద్దా ?" అడిగారు అతన్ని.

"రా నానమ్మా. అయితే నీ మీద నాకు కోపం వచ్చింది." చిరుకోపంగా అన్నాడు.

"మళ్ళీ ఏమైందిరా?" అడిగింది అనిత దగ్గరగా వచ్చి.

"నేను ఇక్కడికొచ్చినట్టు నాన్నకి వాళ్ళకి ఎలా తెలిసింది? నామీద ఒట్టు వేయించుకున్నాను. ఫోన్ కూడా తీసేసుకున్నాను." బుంగమూతి పెడుతూ అన్నాడు ప్రభాస్.

"పిచ్చివాడా. మనకు తెలిసిందే ప్రపంచం అనుకుంటే ఎలా? నీ అనుమానం నాకూ వచ్చింది. కరణంగారి అబ్బాయి మీ నాన్న బాల్య స్నేహితులు. నిన్ను వాళ్ళ ఇంటికి తీసుకెళ్లినప్పుడు పలకరించాడుగా. వాడు ఫోన్ చేసి చెప్పాడట. తీరిందా నీ అనుమానం? నీ మీద ఒట్టు వేయించుకున్నాకా కూడా అలా ఎలా చెబుతాను అనుకున్నావు నాన్న?" అన్నారామే ప్రభాస్ బుగ్గ చిదుముతూ.

"నన్ను మన్నించు నానమ్మా!" ఆమె బుగ్గను ముద్దాడి చెమరించిన కళ్ళతో ఆమెను చుట్టుకుపోయాడు ప్రభాస్.

***0***

## దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



# ఒకటే కోరిక

సరస్వతి కరవది

"అన్ని నిర్ణయాలు మీరే తీసుకుంటారా? నా ఆలోచనలతో సంబంధం లేదా?" కౌసల్య నిదానంగా అడిగింది. ఆమె వంక విస్మయంగా చూసాడు రమణ.

"నీ ఆలోచనలతోనా? అసలు నీ గురించేగా ఇప్పుడీ ఆలోచనలూ, ఏర్పాట్లన్నీ ..." అతని మొహంలో ఆశ్చర్యం తొంగి చూసింది. ఆమె కొడుకులు రాజా, రవి కూడా తమ ఆశ్చర్యాన్ని దాచుకోలేక పోయారు. అవును మరి! తల్లి గురించేగా తాము ముగ్గురూ తలలు బద్దలు కొట్టుకుని మరీ ఆలోచించింది...ఒక నిర్ణయానికొచ్చింది!

***

కౌసల్యకి ఇద్దరు కొడుకులూ, ఒక కూతురూ. కొడుకులిద్దరూ అమెరికాలో చదువులు పూర్తి చేసుకుని ఆ దేశానికే తలలను అమ్ముకున్నారు. ఇద్దరూ పెళ్లిళ్లు అయ్యాక అక్కడే పిల్లల్ని కూడా కన్నారు. ఇక కూతురు వసంత మటుకు అమెరికాలోనే చదువుకున్నా వెనక్కి వచ్చేసి ఇక్కడే ఉంటోంది హైదరాబాద్ లో. వసంత ప్రేమించిన మాధవ్ ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి దానికి ప్రథమ కారణం. వాళ్లిద్దరూ అమెరికాలోనే ప్రేమించుకున్నా మాధవ్ నాయనమ్మ, తాతయ్యల బాధ్యత తమ మీద ఉండటంతో అతని తల్లిదండ్రులు ఇక్కడే ఉండవలసి వచ్చింది. వాళ్ళని వదిలి ఉండలేని మాధవ్ కూడా హైదరాబాద్ లోనే తాను చదివిన చదువుకు తగ్గ చిన్న పరిశ్రమ పెట్టుకుని స్థిరపడటానికి నిశ్చయించుకున్నాడు. దాంతో హైదరాబాద్ లోనే సుఖంగా భర్తతో కాపురం చేసుకుంటోంది ఆ అమ్మాయి. వీలైనప్పుడల్లా వసంత వెళ్లి తల్లిదండ్రులని చూసుకుని వస్తు ఉండటంతో అన్నదమ్ములిద్దరికీ తల్లిదండ్రులు ఒక్కరే ఉన్నారనే బాధ లేదు.

రమణ పదవీ విరమణ చేసి మూడేళ్ళు దాటిపోయింది. కేంద్ర ప్రభుత్వంలో మంచి ఉద్యోగం చేసి ఉండటంతో ఆర్థికంగా ఏ లోటూ లేదు. ఆయన ఏదో ఒక వ్యాపకం పెట్టుకునే మనిషి. సంఘంలో పెద్దమనిషిగా పేరుంది. ఆయనకా పేరు రావటంలో కౌసల్య సహకారం ఎంతైనా ఉంది.

అందులో అన్న మాటేంటి? మొదట్లో జీతాలు పెద్దగా లేని రోజుల్లో పల్లెటూరిలో సాంప్రదాయ కుటుంబంలో పెరిగిన పిల్లైనా, ఉద్యోగ ప్రయత్నాలు చేసి, మంచి ఉద్యోగం సంపాదించుకున్నది మొదలు సంసార బాధ్యతలను భర్తతో సమానంగా పంచుకుని, జీవితం రెండో సగానికి సాఫీగా అడుగుపెట్టే వరకు కౌసల్య

సహాయ సహకారాలు లేకుండా ఆయన అడుగు ముందుకి పడలేదు. ఉమ్మడి కాపురంలో పెద్ద కోడలిగా మంచిపేరు సంపాదించుకుంది. ఈనాటికీ మరుదులు, ఆడపడుచులు ఆమెను తల్లితో సమంగా గౌరవిస్తారు. ఇక తన పిల్లల సంగతికి వచ్చేసరికి అత్తింటి బాధ్యతలు అన్నీ వదిలిపోయినా, భర్త పెద్ద హోదాలోకి వెళ్లటంతో తరచూ వివిధ ప్రదేశాలకు ఆఫీసు పనిమీద వెళ్ళవలసి వచ్చేది. పిల్లల చదువులు దెబ్బ తింటాయని, సొంత ఇంట్లోనే ఉంటూ ఒంటి చేతి మీద వాళ్ళు క్రమశిక్షణ తప్పకుండా పెంచుకు వచ్చింది. అటు ఆఫీసులోను సమర్థురాలైన ఉద్యోగినిగా పేరు తెచ్చుకుంది.

అంతే కాదు, ఉద్యోగ జీవితాన్ని ఎటువంటి సమస్యలు లేకుండా ముగించటం అంటే ఈ రోజులలో కత్తిమీద సామే! అటువంటిది తన పదవీ కాలాన్ని కూడా విజయవంతంగా ముగించింది కౌసల్య. ఆ రోజే ఆమె పదవీ విరమణ చేసి గుండెలనిండా సంతృప్తితో ఇంటికి చేరుకుంది. మనసులో భారమంతా దిగిపోయినట్లు తేలిక అయ్యింది. రిటైర్ మెంట్ కు ముందు మిగిలిన జీవితాన్ని ఎలా గడపాలో ఊహించుకుంటూ ఎన్నో ప్రణాళికలు వేసుకుంది. వాటన్నిటినీ ఆచరణలో పెట్టటమే ఆలస్యం.

ఆమెకు ఒక అనుకోని ఆనందాన్ని అందివ్వటానికి రమణ, వసంతలు అలోచించి, కౌసల్య రిటైర్ మెంట్ రోజుకి రవిని, రాజాని అమెరికా నుంచి రప్పించారు. ఇద్దరు కొడుకులను చూసుకున్న కౌసల్య ఆశ్చర్యానందాలకు హద్దే లేదు. భర్త ముగ్గురు పిల్లలు, అల్లుడులతో ఆమె ఆ సందర్భాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదించింది. ఆఫీస్ వాళ్ళ అపురూప సత్కారాన్ని అందుకుని, సంతోషం బాధ కూడా కలగలిపి అనుభవిస్తూ ఇల్లు చేరింది.

ఆ రోజు రాత్రి వెన్నెల్లో డాబా మీద ముఖ్యమైన స్నేహితులకు, దగ్గర చుట్టాలకు విందు భోజనం ఏర్పాటు చేశారు పిల్లలు. కుటుంబ బాధ్యతలను, ఉద్యోగ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించినందుకు అందరూ కౌసల్యను అభినందనలతో ముంచెత్తారు. ఆనందమయంగా మిగిలిన జీవితాన్ని కూడా గడపమని ఆకాంక్షిస్తూ అందరూ వెళ్ళిపోయాక, కేవలం కుటుంబ సభ్యులే ఉన్నప్పుడు వచ్చింది ఆ ప్రస్తావన.

"కోడళ్ళు, పిల్లలు కూడా వస్తే నాకెంతో తృప్తిగా ఉండేదిరా!" అంది కౌసల్య వడిలో తలపెట్టుకు పడుకున్న రాజా జుట్టు సవరిస్తూ. ఇంకా అతను ఆమెకు పసివాడే మరి! వసంత తండ్రికి తాంబూలమిస్తోంది. రవి ఎఫ్ ఎం లో ఇష్టమైన పాటలు వింటూ సంభాషణలో పాలు పంచుకుంటున్నాడు. వాతావరణం ఆహ్లాదంగా ఉంది.

"వాళ్ళందరిని మళ్ళీ ఇక్కడికెందుకమ్మా? ఎటు తిరిగి నువ్వు, నాన్న అక్కడికే కదా వచ్చేది? అన్ని ఏర్పాట్లూ చేసేస్తున్నాం. రేపట్నుంచి అమెరికాలో ఉండటానికి అవసరమైనవి నువ్వు సర్దుకోవటం మాత్రమే మిగిలి ఉంది. దీపావళి అవ్వగానే ప్రయాణమే! ఇదే నీకు మా రిటైర్ మెంట్ కానుక అనుకో!" అన్నాడు రవి చిరునవ్వుతో.

ఉలిక్కిపడి తలెత్తింది కౌసల్య.

“అలా అని నువ్వనేస్తే అయిపోతుందేమిటిరా?"

"అదేమిటమ్మా... ఈ విషయం గురించి నాన్నగారితో ఇంచుమించు రోజూ మాట్లాడుతూనే ఉన్నాం కదా. నువ్వు బిజీగా ఉన్నావని నీతో చెప్పలేదేమో. కష్టపడ్డన్నన్ని రోజులు కష్ట పడ్డావు. చెల్లాయి పెళ్లి అయిపోయింది. ఇంక మా దగ్గరకొచ్చి విశ్రాంతి తీసుకోవచ్చుగా!" రవి అనునయంగా అన్నాడు.

అతనికి వంత పాట పాడాడు రాజా. "అవునమ్మా అమెరికాలో జీవితాన్ని అనుభవించండి కొన్నాళ్ళు." వసంత మొహంలో కూడా అదే అభిప్రాయం.

"అమ్మా, మీరు వచ్చేసి అక్కడే ఉంటె, మాకు ప్రశాంతంగా ఉంటుంది. పిల్లల చదువుల వలన ప్రమీల, సుచరిత ఇక్కడకు రాలేదు కానీ, వాళ్ళూ మిమ్మల్ని తెచ్చెయ్యమని గట్టిగా చెప్పారు!"

"అమ్మ మటుకు కాదంటుందేంట్రా నేను ఔనన్నాక!" రమణ అన్నాడు. అతని వైపు చూసింది కౌసల్య.

"అన్ని నిర్ణయాలు మీరే తీసుకుంటారా? నా ఆలోచనలతో సంబంధం లేదా?" నిదానంగా అడిగింది. ఆమె వంక విస్మయంగా చూసాడు రమణ.

"నీ ఆలోచనలతోనా? అసలు నీ గురించేగా ఇప్పుడీ ఆలోచనలూ, ఏర్పాట్లన్నీ... నీకు ఏది మంచో, ఏది చెడో నాకు తెలియదా?" అతని మొహంలో ఆశ్చర్యం తొంగి చూసింది. ఆమె కొడుకులు రాజా, రవి కూడా తమ ఆశ్చర్యాన్ని దాచుకోలేక పోయారు. అవును మరి! తల్లి గురించేగా తాము ముగ్గురూ తలలు బద్దలు కొట్టుకుని మరీ ఆలోచించింది... ఒక నిర్ణయానికొచ్చిందీ!

"నేనలా అనటం లేదండీ. కానీ, ఇంత పెద్ద నిర్ణయం తీసుకునేప్పుడు నాతో ఒక్క మాటైనా చెప్పవద్దా? అసలు రిటైర్ అయ్యాక నేను ఎలా బతకాలనుకుంటున్నానో అడగనన్నా అడగొద్దా? మీరు రిటైర్ అయ్యాక ఏం చేయాలనుకుంటున్నారో మనం రెండు రోజులు మాట్లాడుకున్నాం. మీకేం చెయ్యాలనుందో, ఎలా బ్రతకాలని ఉందో మీ మనసు విప్పి చెప్పారు. అవన్నీ నిజాలయ్యేందుకు నేనూ దోహద పడ్డాను. మరి నా మనసులో ఏముందో మీరు అడగనన్నా అడగలేదు!"

"అడగాల్సిన అవసరం ఉందనుకోలేదు. నిన్ను సుఖంగా ఉంచేందుకే కదా నేను ఆలోచించింది!" కోపంగా అన్నాడు రమణ. "నువ్వు కష్టపడకూడదని, నిన్ను అమెరికాకి తీసుకెళ్ళి సుఖపెట్టాలనే కదా నేను పిల్లలతో కలిసి ఆలోచించింది."

"నేనెప్పుడైనా నాకు అమెరికాలో ఉందామని ఉన్నదని మీతో అన్నానా?" సూటిగా ప్రశ్నించింది కౌసల్య. "కనీసం ఇప్పుడైనా నాకు కావలసినట్టు బ్రతికే అధికారం నాకు లేదా?" రమణ నివ్వెరపోయాడు. పిల్లల వైపు తిరిగింది కౌసల్య.

"నాన్నా రవీ, రాజా, తల్లీ వసంతా! నన్ను అర్థం చేసుకోండి. ఇన్నాళ్లు నేను మీ అందరి కోసం, మీ అందరి కోరికలు, ఆశలు నెరవేర్చటానికి ప్రాధాన్యతనిస్తూ బతికాను. ఇక మిగిలిన జీవితాన్నైనా నాకు కావలసిన విధంగా బతకనివ్వండిరా. మీరు నన్ను నెత్తిమీద పెట్టుకుని చూసుకుంటారని నాకు తెలుసు. మీ నాన్నకు నేనంటే ఎంత ప్రేమో కూడా తెలుసు. కానీ ఈ కుటుంబ బాధ్యతలలో పడి ఇన్నేళ్ళు నేను నా వ్యక్తిగత ఇష్టాలను వెనక్కి తోసాను. మీ ఇష్టాలే నావిగా బ్రతికాను." రమణ మొహంలో ఆలోచన తొంగి చూసింది.

"నాకు నేను చిన్నప్పుడు వదిలేసిన వీణ సాధన చేద్దామని ఉంది. ఇంటి వెనక స్థలంలో గులాబుల తోట పెంచుకోవాలని ఉంది. నచ్చిన పుస్తకాలను చదువుకుంటూ, నాదైన ప్రపంచంలో బ్రతకాలని ఉంది. ఈ కోరికలన్నీ తీర్చుకోవటానికి సమయం ఇదే కదరా. అలాగే నన్ను కలిసి ఎంతో కాలమైన చిరకాల మిత్రుల్ని కలవాలని ఉంది. ఎక్కడైనా చక్కని నాటక ప్రదర్శన కానీ నృత్య ప్రదర్శన కానీ జరుగుతుంటే వెళ్లి చూడాలని ఉంది. అప్పుడప్పుడు ఎవరైనా పెద్దలు చెప్తుంటే ప్రవచనాలు వినాలని ఉంది. ఇవన్నీ నా మనసులో ఉన్నాయని ఇటీవలే తెలుసుకున్నాను. రిటైర్ అయ్యాక ఏం చెయ్యాలి అని ఆలోచించినప్పుడు.." ఆశ్చర్యంగా వింటున్నారు ముగ్గురు పిల్లలు.

“అంతదాకా ఎందుకురా, నాకు కొన్ని రోజులు పొద్దున్నే లేవకుండా బద్ధకంగా పడుకోవాలని ఉంది. ఏ పనీ చేయకుండా ఓ పుస్తకం పట్టుకుని రిలాక్స్ అవ్వాలని ఉంది. నవ్వుతారేమో, నిన్ననే అనిపించింది నాకు మీ నాన్నకు నేను ఐ లవ్ యు చెప్పి ఎన్నేళ్ళయిందో అని. రొమాంటిక్ గా అదొకటి ప్లాన్ చేసుకున్నాను.” నవ్వేశాడు రమణ కౌసల్య మనసు అర్థం చేసుకుంటూ. పిల్లలు ఆలోచించ సాగారు.

"నీకిష్టం లేదని వంకాయ పచ్చిమిర్చి, అల్లం కూర చెయ్యటమే మానేసా, వాడు తినడని పెసరట్లు తినటం మానేసా. ఇక వసంతకి వాసన పడదని నాకెంతో ఇష్టమైన సంపెంగలు పెట్టుకోవటమే మానేసా. ఈ కోరికలన్నీ ఇప్పుడైనా తీర్చుకోవద్దేమిట్రా?" కౌసల్య అంది.

పిల్లలు ముగ్గురు కళ్ళు విప్పార్చి వింటున్నారు. కౌసల్య సరదాగానే మాట్లాడుతున్నా వాళ్ళ కళ్ళ ముందు వాళ్ళ అమ్మ వాళ్ళ కోసం చేసిన ఎన్నో త్యాగాలు చిన్నవి, పెద్దవి కనిపిస్తున్నాయి. వెల్లుల్లి వాసనా కూడా గిట్టని అమ్మ, తమకోసం బిర్యానీలు చెయ్యటం నుంచి, తమ మేనత్తలు పెళ్లిళ్ల కోసం, నాన్నమ్మ తాతల వైద్యం కోసం నగలు తీసి ఇవ్వటం నుంచి, తమకిష్టమైన వాళ్ళతో పెళ్లిళ్లు జరిపించటం కోసం తండ్రితో యుద్ధం చేసి, నిరాహారదీక్షలు చేసి వప్పించటం వరకు..

రమణ కూడా ఆలోచిస్తున్నాడు. పల్లెటూరు నుంచి వచ్చి తనకెంతో ఇష్టమైన, అలవాటైన చీరలు కట్టుకోవటం తనకి ఇష్టం లేదని మానేసి, చుడీదార్లు వేసుకోవటం నుంచి, తన బాధ్యతలు పంచుకోవటం కోసం ఉద్యోగంలో చేరి ఇన్నేళ్లు కష్టపడటం నుంచి, అస్సలు ఇష్టం లేకపోయినా తన కోసమని ఇంట్లో నెలకోసారి స్నేహితులతో మందు పార్టీలకు ఏర్పాటు చేయటం వరకు. ఇవన్నీ అందరు ఇల్లాళ్లు చేయవచ్చు. కానీ ఏదో ఒక సందర్భంలో వాళ్ళల్లోని అయిష్టత లేదా అసహనం ఏదో రూపంలో బయట పడుతుంది. కౌసల్య గొప్పతనం ఏమిటంటే, ఆమె వీటినన్నిటిని చిరునవ్వుతో చేసింది. ఈనాడు గుర్తు చేసుకుంటే కానీ ఆమె కుటుంబం కోసం ఏమి చేసిందీ ఎవరికీ గుర్తు కూడా లేదు. ఆ కుటుంబం విలువలతో నడుస్తోందంటే దానికి మూల స్తంభం ఆమే. తన మనసున మనసుగా మెలిగిన ఇల్లాలి మనసు తెలుసుకోకుండా ఎంత పెద్ద నిర్ణయం తీసుకుపోయాడు తను?

తనకంటూ ఒక అభిప్రాయం, ఒక కోరిక, ఒక వ్యక్తిత్వం లేకుండా కుటుంబం కోసమే బ్రతకటం ఎంత కష్టం! ఈ అద్భుతాన్ని కౌసల్య సాధించి చూపించింది, అదీ చిరునవ్వును పెదవుల మీద నుంచి చెదరనివ్వకుండా

భర్త మొహంలో కనిపించే భావాలను చదివిన కౌసల్య అతని మీద ఆత్మీయంగా చెయ్యి వేసి నవ్వింది.

పిల్లలకేసి తిరిగి ఓదార్పుగా అంది "నాన్నా, మీరు ముగ్గురు మంచి ముత్యాలు. ఈ నాటి కొందరు పిల్లల్లా మమ్మల్ని డబ్బులకు బాధించలేదు, మమ్మల్ని వద్దు అనుకోవట్లేదు, ఆడపిల్లకు ఏమీ ఇవ్వొద్దని రచ్చ చెయ్యట్లేదు. మీ వంటి పిల్లలే మా సంపద."

అప్పటికి భార్య మనసు పూర్తిగా అర్థం చేసుకున్న రమణ ఆమె చేతిని పట్టుకుని మిగిలింది తాను చెప్పసాగాడు, "మీ అమ్మకిష్టమైన విధంగా మేము కొన్నాళ్ళు మా జీవితాన్ని అనుభవిస్తాము. పెళ్లయిన దగ్గర నుంచి ఈ నాటి వరకు జీవితమంతా నాతో పాటే అన్ని బాధ్యతలూ భరిస్తూ నడిచింది మీ అమ్మ. ఇప్పుడు సగంపైన జీవితం అయిపోయాక, ఆమెకు ఆమె కోరుకున్న జీవితాన్ని కొంతకాలంగా అందించటం మనందరి బాధ్యత కదా. ఆమె తనకు కావలసిన జీవితాన్ని ఆస్వాదించటం చూసి నేను ఆనందిస్తా. అదే ఆవిడకి నేనిచ్చే కానుక! మీకు మేమంటే ఎంత ప్రేమో నాకు తెలుసు. ఇక్కడ ఉండి మేమేమన్నా ఇక్కట్లు పడతామేమో అని మీ భయం. చెల్లాయి ఈ ఊళ్ళోనే ఉంది. పిలిస్తే పలికే దూరంలోనే. కొన్నాళ్ళు మా రెండో హనీమూన్ ని ఆనందించనియ్యండిరా. తరువాత మీ దగ్గరకే వస్తాము. మానసికోల్లాసంతో మరో జీవితం ప్రారంభిస్తాం. ఏమంటారు?"

ముగ్గురు పిల్లల కళ్ళు ఆశ్చర్యంతో ఆనందంతో విప్పారాయి. రవి అన్నాడు,

"నాన్నా, నిజమే మీరు చెప్పేవరకు మేము ఈ కోణంలో ఆలోచించలేదు. ఇన్నాళ్లు బాధ్యతలనే సంకెళ్లతో అమ్మను కట్టేశాము. ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా కుటుంబానికి తాను చెయ్యాల్సింది చేసింది. మన అందరి బాధలనూ తానూ అనుభవించింది. అటువంటి అమ్మకు మనం ఇచ్చే కానుక ఏముంటుంది? ఆమెకు నచ్చిన విధంగా ఆమె జీవించేందుకు వదిలెయ్యటం తప్ప!"

వింటున్న రాజా కళ్ళల్లో నీళ్లు నిండాయి.

"నాన్నా... అమ్మకి విడిగా అభిరుచులు, ఆనందాలు ఉంటాయని, మర్చిపోయిన స్వార్థపరులం. ఆమె జీవితంలో ముఖ్యమైన భాగాన్నంతా మనకోసమే గడిపేసింది. ఆమె భవిష్యత్తుని కూడా నిర్ణయించటానికి పూనుకున్నాం! ఏ ఒక్కనాడు మనం ఆమెకేమి కావాలీ అని ఆలోచించ లేదు...." రాజా గొంతు పూడి పోయింది. ఓదార్పుగా చిన్నన్న భుజం మీద చెయ్యి వేసింది వసంత.


"అన్నయ్యా, మీరే కాదు. నేనూ అంతే. అమ్మ అలసి పోతుంది, ఆవిడా మనిషే అన్న ఆలోచనే నాకు రాలేదు. శని, ఆది వారాలొస్తే పరిగెత్తుకుంటూ అమ్మ చేతి వంట తినాలి అని మా ఆయనతో సహా వచ్చి పడతానే కానీ, అమ్మకి చేసిపెట్టాలి అన్న ఆలోచనే నాకు రాలేదురా. ఆవిడకి విశ్రాంతి కావాలి అనే విషయం నాకెన్నడూ తట్టనే లేదు." అపరాధిలాగా తలదించుకుంది వసంత.

"అమ్మా చెప్పు. నీకేం కావాలి? నువ్వెలా బతకాలనుకుంటున్నావో చెప్పు. నేనే నీకు అన్ని ఏర్పాట్లు చేస్తాము" రవి అన్నాడు.

“మీరు నన్ను అర్థం చేసుకున్నారురా. నాకదే చాలు! కొద్ది రోజులు ఏ బాధ్యతల సంకెళ్ళు లేకుండా స్వేచ్ఛగా బ్రతకటమెలానో నన్ను చవి చూడనీయండిరా పిల్లలూ! మీ నాన్న నన్నొదిలి ఉండలేరు. నేనూ ఆయన గువ్వ పిట్టలం. మమ్మల్నిఓపికున్నన్నినాళ్ళు జీవితపు తొలి రోజులను గుర్తు చేసుకుంటూ, జంటగా ఎగరనివ్వండి. రెక్కలు అలసిపోయాక ఎటుతిరిగీ మీరే మా గూడు. మిమ్మల్నే చేరుకుంటాం. అది ఒకటే కోరిక నాకు.”

ముగ్గురు పిల్లలూ అంగీకార సూచకంగా తలలూపుతూ తల్లితండ్రుల అక్కున చేరారు చిన్నపిల్లల్లా.

***0***



# ఐదో సంతానం

## భాగవతుల భారతి

వీళ్ళు ఏమై పోయారో! హఠాత్తుగా గుర్తుకువచ్చి, ప్రొద్దున్నే ఫోన్ చేసా.

"ఓం నమ:శ్శివాయ తమరు ఎవరమ్మా "

"ఓం నమ:శ్శివాయగారూ! నేనండీ మీ ఐదో సంతానమండీ " గలగల నవ్వాను.

"ఏమిటీ చాలా రోజుల తర్వాత ఫోన్ చేసారు. అయ్యో! వీడు ఐదుగురు ఆడపిల్లల తండ్రీ, ఎలా ఉన్నాడో! అనే ధ్యాస లేదుగా మీకు, ఏంచేస్తాం?!" తనూ నవ్వాడు.

"ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు?"

యోగక్షేమాల తర్వాత "పెద్దమ్మాయి పెళ్ళి సింపుల్ గా చేసేద్దామనుకుంటున్నాను... దగ్గర వాళ్ళనే పిలిచీ! మీరు కూడా రండి, శుభలేఖ పంపుతాను." అన్నారు.

"అలాగే నాన్నా! తప్పకుండా వస్తా!" నేను పలికిన నాన్న శబ్దం వాత్సల్యానికి ప్రతీకై, నన్ను గతంలోకి తీసుకెళ్ళింది.

***

బస్టాండులో బస్సు రావటం లేటై దిక్కులు చూస్తుండగా, గోడమీది ఓ ప్రకటన నన్ను ఆకర్షించింది.

'ఆదర్శహృదయ' ఫౌండేషన్ అనాధాశ్రమం విరాళాలు కోరబడుచున్నవి. ఫోన్ నెంబర్ వేసి ఉంది. నెంబర్ నోట్ చేసుకుని, టైం ఉంది కదా అని, మా వారికి ఈ విషయం చెప్పాలని ఫోన్ స్పీడ్ డయల్ చేయకుండా, హడావిడిగా నెంబర్లు నొక్కి 'హలో' అన్నా. అవతల్నించి....

"ఓం నమ:శ్శివాయ.. తమరు ఎవరమ్మా?" అన్నది ఓ మగకంఠం .

నాకెందుకో అవతల మా ఆయనగారు నన్ను ఎగతాళి చేస్తున్నారనిపించింది. కొంచెం సరదాగా .... "ఆ.... మీ గర్ల్ ఫ్రెండ్ ని, ఓ గర్ల్ ఫ్రెండ్ తో ఇలాగేనా మాట్లాడేదీ?" అన్నాను.

అంతే.. అవతలి వ్యక్తి "ఇదిగో! ఏవమ్మోయ్ గర్ల్ ఫ్రెండ్, బోయ్ ఫ్రెండ్, అదీ ఇదీ అని పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నావ్... పెళ్ళాం పిల్లలూ పక్కనే ఉండగా!" అన్నారు.

ఇదేమిటీ పెళ్లాన్నేగా అనుకుని "పక్కన వాళ్ళు లేకపోతే ఫరవాలేదా?" అంటూ కవ్వించాను .

"అమ్మాయ్! నువ్వెవరో గానీ మన సంస్కృతి సాంప్రదాయం ఏమిటీ? నువ్వు మాట్లాడేది ఏమిటీ? విదేశీ సంస్కృతా? ముక్కూ ముఖమూ తెలియని మగాడితో ఇదేం సంభాషణా!" అతని వాక్ప్రవాహం తిట్లతో ఇలా సాగుతూనే ఉండగానే, ఫోన్ పెట్టేసి నెంబర్ చెక్ చేసాను. నెంబర్ ఓ నెంబర్ తప్పు పడి రాంగ్ నెంబర్ కి వెళ్లింది. మళ్లీ నెంబర్ సరిచూసుకుని, ఆయనకి ఫోన్ చేసి, మళ్ళీ అనాధాశ్రమానికి ఫోన్ చేసి, వివరాలు సేకరించి, మనీ గూగుల్ పే లో నొక్కా.

కానీ ఆ ఫోన్, ఆ వ్యక్తి గొంతు, నన్ను వెంటాడుతూనే ఉంది మర్నాడు మళ్ళీ ఫోన్ చేసాను.

మళ్లీ "ఓం నమ:శ్శివాయ తమరు ఎవరమ్మా? " ఆయన ప్రశ్న.

'నిన్నటి మీ గర్ల్ ఫ్రెండ్ ని' అందామనుకుని. తమాయించుకుని, "అదేనండీ.. నిన్నటి రాంగ్ నెంబర్ ఫోన్ కాల్... గర్ల్ ఫ్రెండ్" అని నసిగాను.

"మీరా అమ్మా! చెప్పండీ బాగున్నారా ఏమిటీ విశేషాలూ?" చాలా సౌమ్యంగా అడిగాడు. గొంతుని బట్టి ముసలాయన అని ఊహించుకున్నా .

"అయ్యో! అంకుల్! సారీ! నిన్న ఆయన అనుకునీ, మీకు కోపం తెప్పించా" మళ్ళీ నసిగా.

"అదేంకాదండి! నా పేరు విశ్వేశ్వరశర్మ. అమాయక బీద బ్రాహ్మణుణ్ణి, నాకు నలుగురు, సంతానం.. నలుగురూ ఆడపిల్లలే, దైవ ప్రసాదం అనుకుంటున్నాను. నా భార్య, నేను, నా పిల్లలూ, నా ప్రపంచం నాది. ఆడపిల్లల తండ్రిని కాబట్టి చాదస్తంతో కూడిన జాగ్రత్త ఎక్కువ!" అన్నారు.

"అబ్బ ఐతే మీరో మంచి నాన్న" అని ఎందుకన్నానో "నన్నూ మీ ఐదో సంతానం అనుకోండి!" అన్నాను అప్రయత్నంగా.

"అమ్మా మీరెవరో నాకు తెలీదు. వయసు తెలీదు. నా వయసు నలభై సంవత్సరాలు" అన్నాడు ఆయన.

మళ్లీ ట్విస్ట్ అబ్బా.. నా వయసు నలభై ఐదు అయినా వయసుదేముందీ. నాన్న అనే పదంలో ఆప్యాయత ఉంది. మనకంటే చిన్నవాళ్ళ మీద చూపే వాత్సల్యమూ ఉంది.

"ఎలాగో అనేసాగా. నేను మీకు ఐదో సంతానమే!" అన్నాను.

"శుభం! అలాగే కానీ, ఈశ్వరేచ్ఛ.. " అన్నాడు.

"ఏమైనా డబ్బు సహాయం కావాలా? నేను చేయగలనండీ! గూగుల్ పే నెంబర్ ఉందా అండీ?" అడిగాను.

"ఓం నమ:శ్శివాయ! ఎందుకు డబ్బు పంపాలనుకుంటున్నారు? " అడిగాడు.

"మీరు బీద బ్రాహ్మణుడు, నలుగురు ఆడపిల్లల తండ్రి అనీ.... ఈ రోజుల్లో ఆడపిల్లలంటేనే, మూతి ముడుపుల సమాజాన్ని బుజ్జగించి, మీరు నలుగురు ఆడపిల్లలనూ, దైవ ప్రసాదం అనుకున్నారే.. ఆర్థికంగా మీకు ఎంత కష్టమో, నాకు తెలుసు ....అందుకని! " అన్నాను.

"ఓం నమ:శ్శివాయ! అవసరం లేదమ్మా. ఇంతవరకూ నేనెవ్వరి దగ్గరా చేయి చాచలేదు. అంత శ్రమ మీకు వద్దు. కావలసినప్పుడు నేనే అడుగుతాను!" అన్నారు విశ్వేశ్వరశర్మ. తన సంభాషణ నచ్చి తరచుగా ఫోన్ చేస్తున్నాను.

ఇలా ప్రతీసారీ నేను ఫోన్ చేసి యోగక్షేమాలడుగుతూ, డబ్బు పంపుతాననటం, అతను తిరస్కరించటం, జరుగుతూనే ఉంది. తరచూ ఫోన్ వల్ల చక్కటి స్నేహం పెరిగింది.

ఐతే ఫోన్ చేసిన ప్రతిసారీ నేను నవ్వుతూ "హలో! మీ ఐదో సంతానమండీ!" అనటం, అతను "ఓం నమ:శ్శివాయ" అని నవ్వుకోటం అలవాటుగా మారింది.

"ఓ సారి రారాదూ!" అనేవారు ఆయన.

"మీ లాంటి సత్పురుషుల స్నేహం దొరికింది. అంతకన్నా అదృష్టం ఏం కావాలీ. ఎంత మందికి దొరుకుతుందీ ఈ అదృష్టం, ఈ జన్మకిది చాలు!" అని నేనూ.

మంచి స్నేహ బాంధవ్యంతోనే ఏళ్ళు గడిచిపోయాయి. ఇదిగో ఇప్పుడు .. 'అప్పుడే పిల్లల పెళ్ళి వరకూ వచ్చేసిందా స్నేహం ..' అనిపిస్తోంది.

ఇంట్లో చెప్పి, పెళ్ళికి బయలుదేరాను. వెళ్ళేటప్పుడు ఇంతకాలం ఏ సొమ్ము మొత్తం ఇవ్వాలనుకున్నానో, ఓ లక్ష రూపాయలు, తీసుకుని వెళ్ళాను.

నేను వాళ్ళ పేదతనాన్ని సినిమాల్లోలాగా నలుగురు బీదరికంలో మగ్గిపోయే ఆడపిల్లలు, చిరిగిన, అతుకులేసిన బట్టలూ అని ఏమిటేమిటో ఊహించా. కానీ అక్కడ కనిపించిన దృశ్యం వేరు.

నలుగురు ఆడపిల్లలూ, సుశిక్షితులైన సైనికులల్లే, బాధ్యతలన్నీ పంచుకుని, నాన్నకి, అమ్మకి పెట్టని కోటలా నిలబడ్డారు. విశ్వేశ్వరశర్మగారి భార్య కూడా పొందికగా ఉన్నారు, ఆయన పక్కన!

ఆ పిల్లలు నన్ను "'అక్కా! బాగున్నారా! నాన్నగారు చెప్పారు మీ గురించి అని పలకరించి, చుట్టాలందరితో కలివిడిగా ఉంటూ, ఏ పని ఎవరు అందుకోవాలని చూసినా, 'మేం చేసేస్తాం అండీ' అనో, 'పిన్నీ నేను చేస్తా' అనీ, 'పెద్దమ్మా! నేనున్నాగా!' అనీ, ఎవరికీ పని అంటనీయక, మొత్తం వాళ్ళే తిరుగుతూ, పెళ్ళి పనులు అన్నీ చేసేస్తుంటే, 'నలుగురు ఆడపిల్లల తండ్రి' అని జాలిగా చూసిన చూపులు, ఇప్పుడు నేలవాలినాయి. ఎగతాళి చేసిన నోళ్ళే, పొగిడే పరిస్థితి కల్పించిన ఆ పిల్లలను చూస్తే, ఆత్మవిశ్వాసం ఎగసిపడే తరంగాలల్లే ఉన్నారు.

“ఏం చదువుతున్నారమ్మా?" అడిగాను.

"అక్క ఐ. ఎ. యస్. కి ప్రిపేర్ ఔతోంది. మేము పి.జి.. యం.సి.ఎ. లు. ఈలోగా అక్క పెళ్ళి కుదిరింది. అక్కని చూసిన వాళ్ళు కట్నం వద్దనీ, సింపుల్ గా పెళ్ళి చేయమన్నారు. పెళ్ళి తర్వాత కూడా అక్క చదువు కొనసాగించాలనుకుంటోంది. వాళ్ళూ అంగీకరించారు!"

కొంచెం ఖాళీ దొరికినప్పుడు, "నాన్నా" అన్నాను ఆప్యాయంగా. మళ్ళీ నేనే "పిల్లలను ఎంత చక్కగా తీర్చిదిద్దారండీ " అన్నాను గాద్గదికంగా.

"యుగాలు మారినా, తరాలుమారినా ఆడపిల్లల జీవితాల్లో కల్లోలాలు ఏదో రూపంలో వెక్కిరిస్తూనే ఉన్నాయి. కాకపోతే దుఃఖం రూపాంతరం చెందింది అంతే! ఇద్దరు ఆడపిల్లల తర్వాత, ఆపరేషన్ చేయించుకున్న నాకు, ఆపరేషన్ వికటించి మళ్ళీ ఆడపిల్లలు, అదీ కవల పిల్లలు కావటం, భాగావత్ప్రసాదంగా స్వీకరించినా, సమాజం ఎత్తిపొడుపు మాటలు, ఎగతాళి నవ్వులూ, పిచ్చి బాపనయ్య, వీడు ఇదంతా ఎలా ఈదుతాడూ... అనే వెటకారం! వీటి మధ్యలో, సాంప్రదాయం కట్టుబాట్లలో ఉంచుతూనే, ఆడపిల్లలను, ప్రతీ విషయంలో వాళ్ళ పనులూ, సమస్యలూ వారే పరిష్కరించుకునే విధంగా తర్ఫీదు ఇచ్చాను!" అన్నారు.

"అవును నిజమే. రోజులు బాగుండలేదు. జీవనపోరాటంలో ఏ సమస్య వచ్చినా వాళ్ళే పరిష్కరించుకోగలిగేంత చక్కగా పెంచారు బాగుంది!" అన్నాను.

"నిజమే, నా పిల్లలు ఎలాగైనా బ్రతికేస్తారు! పెద్దమ్మాయి ఐ. ఎ. యస్ కి ప్రిపేర్ అవుతూనే తన చెల్లెళ్ళకి చదువులో మార్గదర్శి అయింది!" అన్నారాయన.


నేను తెచ్చిన డబ్బులు ఇవ్వాలని చూసాను. కానీ, ఆ తండ్రి, పిల్లల ఆత్మవిశ్వాసం ముందు, నాచేతిలోని కాగితాలు వెలవెల పోయాయి. ఏ 'ఆదర్శహృదయ' అనాధశరణాలయం నెంబర్ డయల్ చేస్తూ, ఈ కుటుంబానికి కలిసానో, అదే శరణాలయానికి, నలుగురు పిల్లల పేరు మీద, విరాళంగా ఇచ్చేసాను.

పెళ్ళి తతంగం ముగిసింది.

"వెళ్ళి వస్తాను నాన్నా!" అన్నాను ఆనందంగా.

ఈ 'నాన్నా' అని నేను పిలిచిన పిలుపు 'కన్నతండ్రీ' అనే అర్థమే కాక, పసివాడైన కొడుకుని పిలిచే వాత్సల్యమూ, తన కంటే చిన్నవాడైన, ఏ వ్యక్తినైనా పిలిచే ఆత్మీయత, ధ్వనించి మనసుకు హాయినిచ్చింది.

***0***



# కార్తీక ఘోరం

పి. రాజేంద్రప్రసాద్

అది కార్తీక మాసం. అమావాస్య దగ్గర పడుతూ ఉండటంతో అంతా చీకటిగా చలి చలిగా ఉంది.  సమయం దాదాపు రాత్రి ఒకటీ రెండూ మధ్యలో. ఆ ఎగువ మధ్యతరగతి కాలనీ అంతా గాఢనిద్ర లో ఉంది. ఎప్పుడో నలభయ్యేళ్ళ క్రితమే కట్టిన కాలనీ కాబట్టి ప్రతీ వీధిలోనూ బాగానే చెట్లున్నాయి. 'దొంగలకిది బహు మంచి సమయం' అని మనసులో అనుకుంటూ రాజు వేగంగానే నడుస్తున్నాడు. కానీ అటూ ఇటూ చూసుకుంటూ, చెట్ల నీడల మధ్యనుండీ, తన నీడ ఎక్కడా పడకుండా జాగ్రత్త తీసుకుంటూ, ఆ జాగ్రత్త ఇతరులకు అనుమానం రానివ్వకుండా ఇంకా జాగ్రత్త తీసుకుంటూ నడుస్తున్నాడు. నిద్రపట్టని ఎవడైనా కుర్రాడు ఏ మేడ మీంచో కాజువల్ గా కిందకు చూసినా రాజు కనబడడు. కనబడ్డా అనుమానం రాకుండా..... భయం లేనట్టూ, ఆదుర్దా అసలే లేనట్టూ నడుస్తున్న అతని కాళ్లకు శబ్దం చెయ్యని రబ్బరు సోల్స్ ఉన్న షూస్ ఉన్నాయి. జేబులో విజయవాడ నుంచి దొంగల బండికి వస్తున్నట్టు ప్రూఫ్ గా పాసింజరు టిక్కట్టుంది. దాని మీది తేదీ కొంచెం నలిగి చిరిగినట్టుంది. నెల మాత్రం ఈ నెలే. చేతికి ట్రావెల్ బాగు వేళ్ళాడుతోంది. దాంట్లో రెండు జతల బట్టలూ, లుంగీ, టూత్ పేస్టు ఉన్నాయి. అతని వృత్తికి ఈ మాత్రం జాగ్రత్తలుండాలి. ఇంత జాగ్రత్తగా దొంగతనాలు చేసే రాజు, జేబు దొంగతనాలు చెయ్యడు. అందులో దొరికిపోయే రిస్కెక్కువ. కేవలం మధ్య తరగతి కాలనీల్లో, అదీ డబ్బులు, హార్డ్ క్యాష్ మాత్రమే దొంగతనం చేస్తాడు. నగలూ వస్తువులూ దొంగతనం చేసి అమ్మితే ఎక్కువ డబ్బులు గిట్టవు. పెద్దింటి కాలనీలకెళ్తే కార్డులు తప్ప డబ్బులు దొరకవు. అందుకనే ఈ కాలనీ ఎంచుకున్నాడు.

పగటి పూట అటూ ఇటూ తిరుగుతూ ఏదో ఒక ఇల్లు ప్లాన్ చేసుకుంటాడు. రెండు మూడు రోజులకోసారి డ్యూటీ వేసుకొని, ఏదో ఒక ఇంట్లోకి రాత్రిపూట దూరి ఆడవాళ్లు ఇళ్లల్లో డబ్బులు దాచుకునే ప్లేసుల్లోంచి జాగ్రత్తగా వెదికితే రెండో మూడో వేలు మినిమం దొరుకుతాయి. ఇందులో ఆదాయం తక్కువే కానీ, ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చిన్న చిన్న దొంగతనాలు మాత్రమే చేసుకుంటూ పోవడం వల్ల రాజు మీద పెద్ద పోలీసు నిఘా లేదు. భర్తలకు తెలియకుండా దాచుకున్న డబ్బులు మాత్రమే పోయినందువలన, ఇల్లాళ్ళు గుట్టుగా పడి ఉంటారు. అదే మగాళ్ల డబ్బైతే కొన్నాళ్ళు ఇంట్లో కొద్దిగా గొడవలవుతాయి గానీ, కోరి కోరి

చిన్న చిన్న విషయాలకి ఏ మధ్య తరగతి వాడూ పోలీసు స్టేషనుకి వెళ్ళడు. ఇదే రాజు విజయ రహస్యం. రెండు మూడు రోజులకోసారి మాత్రమే వెళ్లినా ఆ రోజులకి సరిపోయేంత డబ్బు రాజుకి దొరుకుతోంది.

ఈ రోజు రాజు ఎంచుకున్న ఇంట్లో ఎప్పుడూ ఒకావిడే ఒంటరిగా కనిపిస్తోంది. ముఖాన బొట్టులేదు కానీ ఏడేళ్ల కూతురు మాత్రం ఉంది. భర్త పోయి ఉండాలి. ఎక్కడో టీచరుగా చేస్తోంది. ఈ రోజు మూడో తారీఖు కాబట్టి డబ్బులు ఎక్కువగానే దొరికే ఛాన్సుంది. ఒక వారం హాపీగా గడిచిపోతుంది. ఇదీ రాజు వేసుకున్న ప్లాను.

వడివడిగా నడుస్తున్న రాజు అటూ ఇటూ చూసుకుంటూనే ఒక ఇంటి ముందు ఆగాడు. నెమ్మదిగా చెట్టు చాటు నుండి వెనక్కు వెళ్ళాడు. ఎవరూ చూడటం లేదని నిశ్చయించుకుని, నిశ్శబ్దంగా చెట్టెక్కి అంతే నిశ్శబ్దంగా కాంపౌండ్ వాల్ లోపలికి దూకాడు. కింద మట్టి నేల కాబట్టి దబ్ మనే శబ్దం కూడా రాలేదు. పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ వంటింటి తలుపు చేరుకున్నాడు. జేబులోంచి తీసిన తాళాలతో దాదాపు ఐదు నిమిషాలు కృషి చేస్తే అప్పటికి తెరుచుకుంది తలుపు. కుడి చేతిలో కత్తీ, ఎడమచేతిలో మత్తుమందులో ముంచిన రుమాలుతో, నిశ్శబ్దంగా కదిలాడు రాజు. వంటిల్లు చీకటిగానే ఉన్నా ఒక పక్క నుండి బెడ్ రూమ్ వెలుతురు సన్నగా పడుతోంది. రాజుకి ఆశ్చర్యం వేసింది. 'ఈ వేళప్పుడు బెడ్ రూమ్ లో లైటుండడమేమిటి?' అనుకుంటుంటే, ఒక్క సెకనులోనే రాజుకి జవాబు దొరికింది. మాటలు కూడా వినిపిస్తున్నాయి. ఒక ఆడదాని గొంతు నెమ్మదిగానే వినిపిస్తోంది గాని.. 'ఏదో డిమాండింగ్' గా వినిపిస్తోంది. మగవాడు ఆమెను బ్రతిమలాడుతున్నట్టుగా, ప్రాధేయపడుతూ వినిపిస్తోంది. రాజు గుండె గుభేలుమంది. 'అమ్మో! నా లెక్కలన్నీ తప్పిపోయాయి. దీనికి మొగుడో, రంకు మొగుడో ఎవడో ఉన్నాడు. వచ్చిన దారినే పారిపోవడం చాలా మంచిది.' అనుకుంటూ వెనక్కి తిరగబోయాడు. ఆమె గొంతు కొంచెం పెరిగింది. దానితో బాటు అతను నెమ్మదిగానే అయినా, భయం భయంగా "వద్దు....వద్దు.." అన్నట్టుగా వినిపించింది. రాజుకు అనుమానం వేసింది. 'వచ్చిన వాడు మొగుడో, రంకు మొగుడో కాదేమో! అసలు భర్తేనేమో.. పెళ్ళానికి భయపడి చస్తున్నాడు..' ఇలా అనుకునేటప్పటికి రాజుకు బాగా హుషారు వచ్చింది. 'ఇప్పుడు లోపలికెళితే మజా మజాగా ఉంటుంది. ఇలాంటి బెదురుగొడ్డుగాణ్ణి చేతిలోని కత్తితో బెదిరించడం చాలా సులువు. ఇక వాడి భార్యంటావా.. ఎంతైనా ఆడదే కదా! నో ప్రాబ్లమ్.' అనుకుంటూ, రాజు ఏ మాత్రం శబ్దం కానివ్వకుండా బెడ్ రూమ్ తలుపు నెమ్మదిగా తీసి. తొంగి చూశాడు. లోపలి దృశ్యం రాజుని అప్రతిభుణ్ణి చేసింది. ఒక్క సారిగా అతని నరాలు నిక్కబొడుచుకుని మనిషంతా వణికిపోయి గతుక్కుమన్నాడు.

***

చేతిలోని గన్ను వారణాసిగాడి తల మీద పెట్టి బెదిరిస్తున్న మోనితా, ఆ దృశ్యాన్ని సెల్ ఫోనులో రికార్డు చేస్తున్న వంటలక్కా... ఏభై అయిదు అంగుళాల వాల్ మౌంట్ టీ. వీ. లోంచి లైవ్ లో కనిపించారు రాజుకి. ఆ ఎదురుగా సోఫాలో అర్ధనిమీలిత నేత్రాలతో నైటీలో పడుకొని ప్లేటులో జీడిపప్పు పకోడీ తింటూ హాట్ స్టార్ టీ. వీ. లో ఈ రోజు రావాల్సిన 'కార్తీక దీపం' సీరియల్ ని ముందుగానే చూస్తోంది ఆవిడ. అప్రతిభుడైన

రాజు  చల్లగా జారుకుందామని ప్రయత్నించాడు. ఇంతలో సదరు నైటీగలావిడ రాజును చూడనే చూసింది . "ఒరేయ్! ఎవడ్రా నువ్వు. అర్ధరాత్రి  ఇంట్లో దూరావు.."  అంటూ చేతిలో ప్లేటు గురి చూసి రాజు మీదికి విసిరింది. ఆవిడ షూటింగులో ఎంత ఎక్స్ పర్టో రాజుకి వెంటనే తెలిసింది. పకోడీలు  రాజు మొహం మీద పడ్డాయ్. ప్లేటొచ్చి మెడ మీద తగిలి రాజు 'అబ్బా' అంటూ కుప్పకూలిపోయాడు. ఈవిడ వేసిన కేకలకి ఐదారు నైటీలు వెంటనే వచ్చేశాయి.

పగలు రెండు ఛానల్సు తాలూకు సీరియల్సు చూసెయ్యడమే కాక, అర్ధరాత్రి మరో రెండు ఛానల్సులోనూ టీ వీ సీరియల్స్ చూసే ఛాన్సు 'హాట్ స్టార్' లో ఉందని తెలియని రాజు,  'ఇది నా ఖర్మ' అనుకొని గరిటె దెబ్బలనూ, చీపురు దెబ్బలనూ లాఘువంగా చేతులతో, కాళ్లతో కాసుకుంటూ,  పారిపోవడానికి సందు దొరుకుతుందేమో అని వెతుక్కుంటున్నాడు.

***0***



# తాబేళ్లు

## ఘండికోట బ్రహ్మాజీరావు

చీఫ్ యింజనీరు గారు ఫీల్డ్ మైకులో మాట్లాడుతున్నారు. "మరొక్క పదినిమిషాలలో పని ప్రారంభించాలి. పోలీసువారి పరిశోధన ముగిసింది. ముందు పడిన యింజనులు ఒకరు, పట్టాలు తప్పిన పెట్టెను మరొకరు, ఇద్దరు యింజనీర్లు ఎత్తించి, రైలుదారి బాగుచేయాలి. రేపు మధ్యాహ్నం పండ్రెండు గంటల వేళకు రైళ్ళు మామూలుగా నడవాలి."

చీఫ్ యింజనీరుగారంటే క్రిందివాళ్ళకు సింహస్వప్నం. అన్న నిమిషానికి పని పూర్తికాకపోతే చాలా యిబ్బందులు పడవలసి వస్తుంది.

రెండు ఇంజనులూ పట్టాలు తప్పాయి. ముందుది పట్టాలు తప్పి రాళ్ళలో నిలుచుంది. రెండవది వెల్లకిలపడి చక్రాలు ఆకాశానికి చూపించుతున్నది.

ఇంజనుల వెనుక నున్న పెట్టెలు పట్టాలు తప్పినవి. డ్రైవర్లకు చిన్న గాయాలు తగిలాయి. కొంతమంది ప్రయాణికులకు కూడా చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. ప్రథమ చికిత్స కోసం కూడా చూడకుండా కొంతమంది పారిపోయారు. రైలు మరొక్క పదినిమిషాలలో నగరం చేరుకోవలసింది, ఇంతలోనే ఈ ప్రమాదం సంభవించింది.

రాత్రి తొమ్మిది గంటల వేళ ప్రమాదం జరిగింది. మరొక్క గంటలోనే స్టేషను నుండి, నగరం నుండి పోలీసులు, డాక్టర్లు, రైల్వేవారు అందరూ వచ్చారు. అప్పటి నుంచీ జనంలో వార్త అల్లుకుపోయింది. ప్రజలు మాఘమాసపు చలిని కూడా లక్ష్యపెట్టకుండా వచ్చిపడ్డారు.

వెంటనే ఏమిచేయడానికీ వీలయింది కాదు. ప్రయాణీకులలో చాలామంది ప్రాణాలు దక్కినందుకు పిట్టల్లా ఎగిరిపోయారు. మిగిలినవారిని స్టేషనుకు పంపించారు,

రాత్రికి రాత్రే అక్కడ పనివాళ్ళు గుడారాలు వేశారు. లైట్లు పెట్టారు. ఫీల్డ్ మైకు, లౌడు స్పీకర్లు అమర్చారు. ప్రతి పది నిమిషాలకు హెచ్చరిస్తున్నారు. పైనుంచి పెద్దవాళ్లు తెల్లవారేసరికి చేరుకున్నారు. అంతవరకు ఏ పని చేయలేదు. తరువాత కూడా చేయడానికి పోలీసుల ఆచూకీ పూర్తి కాలేదు. రాత్రి గడిచి పోయింది.

మధ్యాహ్నం దక్షిణం నుంచి ఒక జట్టు వచ్చింది. చిన్న యింజనీరు రావు, ఇద్దరు ఫోర్మెనులు , పని వాళ్ళు వచ్చారు బళ్ళనెత్తడానికి.  ఉత్తరం నుండి ఒక జట్టు ఇంజనులని ఎత్తడానికి వచ్చింది.

కాని, పని మొదలు పెట్టడానికి వీలుకాలేదు. పోలీసులు ప్రదేశాన్ని చుట్టు ముట్టారు. తెల్ల వారిన దగ్గరనుండి ప్రజలు రావడం హెచ్చయింది. అదొక యాత్రాస్థలంగా మారిపోయింది. పిన్నలు, పెద్దలు, స్త్రీలు ...అందరూ వస్తున్నారు. వాళ్ల కోసం టీ దుకాణాలు, పకోడీ దుకాణాలు, వేరుశనగ తట్టలు రావడం మొదలయ్యాయి.

ప్రమాదం జరిగిన చోటు ఒక కటింగ్ లో ఉంది. ఎత్తయిన దిబ్బ కోసి లైనులు వేశారు. పట్టాలు తప్పిన నాలుగు పెట్టెలలో మొదటిది ఎడమవేపు దిబ్బ పైకెక్కి వెనుక చక్రాల మీద నిలుచుంది. రెండవది కుడిచేతి వేపు దూసుకుపోయి దిబ్బను దున్ని పారేసింది. మూడవది పార్సెలు పెట్టి. అది మధ్యకు రెండు ముక్కలుగా విరిగింది. పైనున్న రేకుపట్టుతో కలిపి ఉంది. నాలుగవది పట్టాలు తప్పి నిలుచుంది. ఆ వెనుక పెట్టెలు పోలీసులు, రైల్వేవారు ఉండడానికి తాత్కాలికమైన ఆశ్రయ మిచ్చాయి.

దక్షిణం నుంచి వచ్చిన రావు రాగానే అంతటా తిరిగి వచ్చాడు.  రైలు పట్టాలు ఎవరో వేరుచేశారు. ఎగువకు పోయే లైను, దిగువకు పోయే లైను కూడా ఈ ప్రమాదం వల్ల రాకపోకలకు వీలుకాకుండా పోయాయి.

రెండు లైన్ల మధ్య రావుకో వింత దృశ్యం కనుపించింది. అక్కడో ఎముకల కుప్ప ఉంది. చిరిగిన ఆడవాళ్ల రవికలు ఉన్నవి. పనికిరాని చింకి జోళ్ళు, తలవెండ్రుకల చుట్టలు, మానవుల పుర్రెలు ఉన్నవి. వాటిపక్కనే రైలుపట్టాలు వేరయి, ప్రమాదం సంభవించింది. ఈ అమంగళకరమైన వస్తువులకు, జరిగిన

రైలు ప్రమాదానికి ఏమి సంబంధం...ఏదో ఉంది కాబోలు...ఎవరు వేరయారో...ఎవరు తిరిగి రాలేదో...

రావు, ఫోర్మెనులు తిరుగుతున్నారు. పోలీసులు అనుమతి యిచ్చేవరకు తిరుగుతున్నారు. ఏ పెట్టెలను ముందు ఎత్తాలో, ఏ పెట్టెలను కోసి వేరుచేయాలో, ఎంతమంది పనివారిని ఎక్కడ నియోగించడమో ఆలోచిస్తున్నారు.

సాయంకాలం వేళకి పోలీసు కుక్కలు వచ్చాయి. అవి అంతటా తిరిగి ఎవరివీ గుర్తుపట్టలేక పోయాయి. అప్పటితో పోలీసులు అనుమతించారు రైలు పెట్టెలను ఎత్తటానికి. అప్పుడే చీఫ్ యింజనీరుగారు మైకులో ఆర్డరిచ్చారు. చిన్నయింజనీర్లకి.

పట్టాల మీదనున్న పెట్టెలను వెనుకకు తీసుకొనిపోయారు. తరువాత పడిపోయిన నాలుగవ పెట్టెను పట్టాల మీద నిలబెట్టి వెనుకకు లాగేశారు. చెడిపోయిన రైలు లైను బాగుచేసుకుంటూ ముందుకు వచ్చేసరికి రాత్రి పన్నెండు గంటల వేళ అయింది.

అపుడు విరిగిన మూడో పెట్టె దగ్గరికి వచ్చాడు రావు. అంతవరకు వచ్చి పోతున్నాడు గాని దీక్షగా  అక్కడ నిలబడి ఉండలేదు. పెట్రోమాక్సు లైట్ల వెలుతురులోఆ విరిగిన పార్సెలు పెట్టెను చూస్తున్నాడు.

చీఫ్ యింజనీరుగారు ఇంతలో అక్కడకి వచ్చారు. దానిని గాస్ తో కోయాలి. గాస్ సిలిండర్ లు అక్కడకు తెచ్చి పైపులు తగిలిస్తున్నారు.

“రావ్! ఈ పెట్టెను తీసివేయడానికి ఎంతకాలం పడుతుంది?" అడిగారు ఛటర్జీగారు.

"అవును సార్! ... అవును...." అన్నాడు పరధ్యానంగా రావు.

"అవునేమిటి?" కోపంగా ప్రశ్నించాడు చీఫ్.

"చూడండి సార్ ... ఇంతవరకూ అవి చచ్చిపోయినవనుకున్నాను, కాని కాళ్ళు ఆడిస్తున్నవి......"

చీఫ్ చూచారు.

“పొద్దున్నే చెప్పాను, వీటిని తీసుకొని పొమ్మని...కాని ఎవరూ రాలేదా? "

“రాలేదు సార్ "

చీఫ్ వెళ్ళిపోయారు. తిరిగి మైకులో మాట్లాడారు...పార్సెలు పెట్టెలో నున్న తాబేళ్లను తీసుకొనిపొమ్మని. కాని ఎవరూ రాలేదు. మనుషులందరూ చెల్లాచెదరిపోయారు. వాటిని తీసుకొని పోవలసిన సిబ్బంది పనిచేస్తున్న వాళ్ళకు రొట్టెలు, టీ తేవడానికి ట్రక్కులో బజారుకి వెళ్ళిపోయారు.

రావు చూస్తూ నిలబడ్డాడు. . .మధ్యాహ్నం సంగతులు అతని మనస్సులో కదులున్నాయి.

గుట్ట మీద నుంచి విసురుగా ఒక పడుచు, ఒక కాలేజీ విద్యార్థి క్రిందికి దిగి ఒక్కసారిగా ఆగిపోయారు.

“చూడు ఎంత పెద్దవో ఈ తాబేళ్లు? కాని వాటి మెడలు ఎంత చిన్నవో...మనుషులను చూచి వాటిని లోపలికి ముడుచుకుంటాయి. భయంతో..."

వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒక చిన్న కుర్రాడూ, వాడి తండ్రి కాబోలు దిగివచ్చారు.

"నాన్నా .... ఈ తాబేళ్లను ఇలా వీపుమీద పడేశారేం ?"

“పారిపోతాయని..."

“అవి నడవనే లేవు కదా ... ఎలా పారిపోతాయి."

" అలాగే మెల్లిగా పారిపోతాయి...నీరు దొరికిందంటే మరి పట్టుకోలేం."

వాళ్ళుకూడా వెళ్ళిపోయారు. తరవాత ఎవరో పెద్ద మనుష్యులు. పంచెలు, వాచీలు. చేతికర్రల వాళ్ళొచ్చారు. వ్యాపార సరళిలో మాట్లాడుతున్నారు...

"పూరీలో ఈ తాబేలు ధర అయిదు రూపాయలు మాత్రమే. ....కలకత్తాలో ఎంతో తెలుసా. రమారమి నూరు రూపాయలు. మామూలు వాళ్ళు తినేదనా మీ అభిప్రాయం. పూరీ తాబేళ్ళకు గ్రాండ్ హోటలులో మంచి గిరాకీ......దొరలు పడిచస్తారయ్యా వీటి కోసం"

రావుకన్నీ వినిపిస్తున్నాయి. ఎదురుగుండా ఉన్న అరలో మూడు తాబేళ్ళున్నాయి. విరిగిన రెండో భాగం నుంచి పడిపోయిన రెండూ పక్క కాలువలో ఉన్నాయి. అరలోని తాబేళ్ళలో రెండు వెనుకకి ఉన్నాయి. ఒకటి ముందుకొచ్చి ఉంది. అది విరిగిన అరమీద వెల్లకిలా పడిఉంది. దాని మెడ దిగువకు వేలాడుతూ ఉంది. దాన్ని లోపలికి తీసుకోవాలని అది ప్రయత్నం చేస్తూ ఉంది. కాని మెడ వ్రేలాడుతూనే ఉంది.

దిగువకు వేలాడుతున్న తలలో రెండు కళ్లున్నవి. ఆ కళ్లు ఉబ్బి ఉన్నవి. రెప్పలు లేని కళ్లు ఆరిగిన గోళీకాయలలా కనిపిస్తున్నాయి. ఆ చిన్నకళ్ల నుండి అప్పుడప్పుడు ఒకటి రెండు చిక్కటి చుక్కలు పడుతున్నవి... అవి అలానే ఉన్నవి... మధ్యాహ్నం నుంచి ... కాదు కాదు... ప్రమాదం జరిగిన రాత్రి నుండి...

"పనిమానేసి ఏంచూస్తున్నావు రావ్," భుజంమీద చేయివేసి అడిగారు చీఫ్ యింజనీరుగారు.

"ఈ తాబేళ్లే సార్ ...."

"పాపం!"

"ఏం చేయడమో నాకు తోచకుండా ఉంది సార్..."

"ఏముంది. అవి ఉన్నా లేనట్లే ...ఇప్పటికే చాలా కాలం వీటికై వ్యర్థమయింది."

"అవి బాధతో కన్నీళ్లు కారుస్తున్నాయి సార్...."

"రావ్ .... అవి కన్నీళ్లు కావు. ..నాకీ విషయం తెలుసు...పడేవవి నెత్తురు చుక్కలు ... పట్టుకున్న తరువాత ఈ తాబేళ్లు ఎక్కడికీ పారిపోకుండా కళ్ళు పొడిచేస్తారు... అవి ఒకంతటికి చావవు. .. ఎంత మరణబాధకైనా నిలబడతాయి..."

"ఏం చేయడం?"

"ఈ చచ్చే తాబేళ్ల కోసం మరి, కాలం వ్యర్థం చేయడానికి వీలు లేదు"

ఆయన వెళ్లిపోయారు. ఇది ఆజ్ఞ.

వెల్డరు నారాయణ ముందుకు వచ్చాడు. సగం విరిగిన పార్సెలు పెట్టె పైకప్పు కోయడానికి మీద కెక్కాడు. నీలి మంట... ఆది ఇనుపరేకును తాకి వంగవండు రంగుగా మారింది. నిప్పురవ్వలు . . . కాకరపూలు... అవి పక్కను కాలువలో పడిన తాబేళ మీద ముందు పడ్డవి. వాటి చురకలకి అవి ఇటు అటు గాలిలో కాళ్లు ఆడిస్తున్నవి.

తరువాత మీదనున్న తాబేలు పై నిప్పురవ్వలు పడడం మొదలయింది. మొదట ఒకటి రెండు... తరువాత జల్లులుగా పడుతున్నవి. కప్పులేని దాని కడుపు మీద అవి వాతలు పెడుతున్నవి. అది కాళ్లను గాలిలో విదలిస్తున్నది...తల ఇటు అటు తిప్పుతున్నది.

"నారాయణా! ఒక్క క్షణం ఆపు... తాబేలును పక్కకు తప్పించి..."

రావు మాటలు పూర్తికాకుండా, వెనుక నున్న చీఫ్ యింజనీరు అతని భుజం తట్టాడు.

"పని ఆగడానికి వీలు లేదు.... అప్పుడే రెండు గంటల రాత్రి దాటింది. ఇంకా రెండు పెట్టెలు ఎత్తవలసి ఉంది. ఒక్క నిముషం కాదు, ఒక సెకెండు కాలం వ్యర్థమయినా, అనుకున్న వేళకు రైళ్లు నడపడానికి లేదు" అన్నారాయన.

నారాయణ తొందరగా కోస్తున్నాడు. ..నిప్పుల రవ్వలు కావవి...కాకరపూలు కావవి... అవి కరుగుతున్న లోహపు ధారలు... కప్పు లేని మెత్తటి తాబేలు కడుపుమీద పడుతున్నవి. అవి వాతలు పెట్టడం లేదు...

మర్మాలను ఛేదిస్తున్నవి... తాబేలు విలయతాండవ మాడుతున్నది. కళ్లంట ధారలు కారుతున్నవి...దాని కళ్ళు, ముఖం మరీ ఉబ్బినవి.

ఠప్!... అంతవరకు పై రేకుతో కలిసిన రెండు ముక్కలు ఒక్కసారి విడిపోయాయి. తాబేలు పడుతున్న బాధకు అది అంతం... కపాల మోక్షం కాబోలు... ఆ తాబేలు పరలోకాలకు వెళ్లిపోతుంది.

రావు అదిరిపడ్డాడు... అంతవరకు వెనుకనే ఉండి చూస్తున్న చీఫ్ వెళ్ళిపోయారు. క్రేన్ ముందుకు వచ్చింది. ఆ పెట్టెముక్కలను, తాబేళ్లను ఎత్తి, వెనుకకు తీసుకొనిపోయి, దూరంగా పారేసి వచ్చింది.

"అప్పారావూ.... ఆ తాబేలు చచ్చిపోయిందా?..." తిరిగి వచ్చిన క్రేను డ్రైవరును అడిగాడు రావు.

"లేదు సార్...ఆ పెట్టె దూరంగా పారేసిన తరువాత చూచాను సార్.... అప్పటికీ అది తల తిప్పి, కాళ్లు ఆడిస్తున్నది...

కపాలమోక్షం పెట్టెకు?... తాబేలు ఎందుకు బ్రతికి ఉంది. . .

***

అనుకున్న వేళకు రైళ్ళు నడిచాయి..రావు పరివారాన్ని తీసుకొని దక్షిణానికి వెళ్లి పోయాడు.

చీఫ్ ఇంజనీరు ఛటర్జీగారు మాత్రం ఉండిపోయారు... రెండు రోజులయి అతను ఒక చోట కూర్చొని నాలుగు మెతుకులు తినలేదు.... నడుస్తూనే టీ త్రాగడం, రొట్టె ముక్కలు నమలడం చేస్తున్నాడు. . .సాయంకాలం శుభ్రంగా స్నానం చేసుకొని, రాత్రి భోజనానికి ఊరిలో నున్న పెద్ద హోటలుకి వెళ్లిపోయాడు.

బేరరు వచ్చాడు. ఆయన పూర్తి డిన్నరు ఆర్డరుచేశాడు. బేరరు వచ్చేవరకు ప్రక్కనే వున్న 'మెనూకార్డు చూచారు . . .వరుసగా చదువుతున్నారు. సూప్ ... స్పెషల్ టర్టిల్ సూపు. . .పెంచి ఫ్రై... చికెన్ ... వరుసగా ఏవేవో ! ఆయన మామూలుగా చదివి కార్డు పక్కన పెట్టాడు.

బేరర్ ముందుగా సూప్ తెచ్చాడు. బౌల్ నుండి మంచి వాసనలు వస్తున్నవి

ఏమి సూపిది ...ఇది స్పెషల్...టర్టిల్ సూపు. . . టర్టిల్... తాబేలు...

ఆ సూపును ఆయన కళ్లు పెద్దవి చేసి చూచారు.

అందులో ఆయనకో వాలిన మెడ, దాని కంటిన చిన్న తల, ఆ తలలో అరిగిన గోళీలవంటి రెండు కనులు... వాటి నుండి చుక్కలు...కరిగిన లోహపుధారలకు పెరిగిన నెత్తుటి చుక్కలు . . . . . .

ఆ సూపు బౌలు పక్కకు పెట్టేశారు.

ఛీఫ్ యింజనీరు ఛటర్జీగారు గబగబా గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి టేబిలు నుండి లేచిపోయారు.

***O***

"యువ" మాసపత్రిక, జనవరి 1973 ప్రచురణ"

# రూపం మార్చుకుంటున్న తెలుగు కథ

అత్తలూరి విజయలక్ష్మి

కథ , లేదా కథానిక ... కథానిక అనే మాట ఎలా వచ్చిందో కాని ఇటీవలి కాలంలో కథ అనకూడదు కథానిక అనాలి అంటూ కొందరు కథ``కులు తమ స్వరాన్ని బలంగా వినిపిస్తున్నారు. అయితే కథ ఎందుకు కథానికగా మారింది అనే విషయానికి సరైన నిర్వచనం లభించలేదు.

కథ అయినా, కథానిక అయినా రూపం ఒకటే.. కథ చెప్తావా అంటాం కానీ కథానిక చెప్తావా అనం కదా..

కథ చెబుతుంటే వినడంలో ఒక ఆనందం ఉంది.. చిన్నప్పుడు అమ్మమ్మలు, తాతయ్యలు చెప్పిన కథలు అన్నీ కూడా మౌఖిక కథ లు. ముద్రణా రంగం లేని రోజుల్లో కథలు మౌఖికంగా వినిపించేవారు. అలాంటివే పురాణగాధలు, జానపద కథలు, చారిత్రిక కథలు, కాశీ మజిలీ కథలు, ఇలా అనేకం.

సాధారణంగా కథ అనగానే అది పురాణాల ఆధారంగా చెప్పేవే అయి ఉంటాయి. పెద్దవాళ్ళు అలాంటి కథ లకే కొంత కాల్పనికత జోడించి ఆసక్తికరంగా కథ లు తయారు చేసేవాళ్ళు. అలా తయారు చేయబడినవే కాల్పనిక కథ లుగా ప్రచారం పొందాయి. పురాణాలంటే వాస్తవికంగా అనిపించే కాల్పనిక కథ లుగా చెప్పుకోవచ్చు. వీటికి సాహిత్యపరమైన విలువలున్నాయి. ప్రతి కథ పురాణాల నుండో ఇతిహాసాల నుండో పుట్టినదే. అసలు పురాణానికి ఇతిహాసానికి తేడా ఏంటి అని మనం ఆలోచిస్తే " ఇతి హా" అంటే ఇలాగే జరిగింది అని అర్ధం ... ఇలా కాక మరోలా జరగలేదు. అందుకే మహాభారతం ఇతిహాసంగా చెప్పబడింది. మహాభారతం జరిగిన కథ అనడానికి అనేక దృష్టాంతాలు ఉన్నాయి. భారతదేశంలోనే కాక మలేషియా, శ్రీలంక ఇండోనేషియాల్లో కొన్ని ప్రదేశాలు మహాభారతకాలం నాటివి అని పరిశోధకులు తెలియచేయడం జరిగింది. అయోధ్యలో రాముడు నడయాడాడు అని నమ్ముతారు. ద్వారకలో శ్రీకృష్ణుడు జన్మించాడు అనడానికి అనేక సాక్ష్యాలున్నాయి అని కూడా మనకి తెలుసు. ఇవన్నీ చూస్తుంటే రామాయణం, మహాభారతాలే కాక భాగవతం కూడా జరిగినట్టు చారిత్రిక ఆధారాలు కనిపిస్తాయి.

కథ అంటే కొన్ని పాత్రలు, ఒక సంఘటన, కొన్ని సన్నివేశాల సమాహారం ... ప్రతి కథ లో కథ కి మూలం అయిన ఒక పాత్ర దాని చుట్టూ మరికొన్ని పాత్రలు.

మహాభారతానికి ప్రధాన పాత్ర వ్యాసుడు. వ్యాసుడు లేకపోతే మహాభారతం లేదు.. మహాభారతం మానవ జీవన గమనాన్ని నిర్దేశించింది కాబట్టి మానవ జీవనం లేదు. అందుకే వేదవ్యాసుడు జాతికి సూర్యుడి వంటి వాడు అంటారు. మహాభారతంలోని ప్రతి సన్నివేశంలో వ్యాసుడు ఒక పాత్ర అయి, అన్ని సన్నివేశాలను కళ్ళారా చూసి రచించిన కావ్యం కాబట్టి ఇతిహాసం అయింది. ఇందులో జరిగింది

జరిగినట్టుగా చెప్పబడింది. అనేక శ్లోకాలతో, 18 పర్వాలతో, కొన్ని వేల పాత్రలతో కూడినది కాబట్టే ఇది మహాభారతం అయింది.

అలాగే వాల్మీకి ఒక పాత్రగా ఉండి , చూసి రాసింది రామాయణం .. ఈ ఇతిహాసాలు మానవ జీవితం మీద చూపించిన ప్రభావం అమూల్యం ... ఇవే మనకు ప్రామాణికాలు.

కొందరు హేతువాదులు వీటిని పుక్కిటి పురాణాలుగా కొట్టిపారేస్తారు.. ఈ కథ లను హేతువు లేని కథ లుగా నిర్వచిస్తారు. ఉదాహరణకి జనమేజయ మహారాజు యజ్ఞం చేస్తుండగా ఒక దేవశునకం ఆ యజ్ఞ ప్రదేశం చుట్టూ తిరుగుతుంది. అది చూసిన జనమేజయుడి తమ్ముళ్ళు ఆ కుక్కని కొట్టి తరిమేస్తారు. ఆ కుక్కపిల్ల వెళ్లి తన తల్లి శునకంతో "అమ్మా నేను ఆ యజ్ఞాన్ని చూడాలనే ముచ్చటతో అక్కడ సంచరిస్తుంటే ఆ జనమేజయ మహారాజు తమ్ముళ్ళు నన్ను కొట్టారు" అని చెప్పి ఏడుస్తుంది. అది విన్న తల్లి శునకం తన పిల్లవాడిని తీసుకెళ్ళి "అకారణంగా నా పిల్లవాడిని నీ తమ్ముళ్ళు కొట్టారు .. ఇలా అమాయకులని, పేదవారిని అకారణంగా బాధిస్తే అనుకోని ప్రమాదాలు వస్తాయి నీ యజ్ఞం కూడా అలానే అనుకోకుండా ఆగిపోతుంది" అని చెప్పి మాయం అయిపోతుంది. అది విని జనమేజయుడు భయపడతాడు.

ఇలా ఆది పర్వం మొదలై మహాభారతగాధకి శ్రీకారం చుట్టడం జరిగింది. ఆ తరవాత పరీక్షిత్తు మహారాజుని తక్షకుడు చంపడం, తక్షకుడు ఆయనని చంపడానికి గల కారణం , వినతి, కద్రువల కథ ఇలా చాలా కథ లు కలిపి సాగే ఈ భారత కథ ని హేతుబద్ధంగా ఆలోచించే వాళ్ళు యజ్ఞం చేయడం ఏంటి, శునకం యజ్ఞం చూడడం ఏంటి? తల్లి శునకం శాపం పెట్టడం ఏంటి అని విమర్శించడం మామూలు.

ఒక కథ విమర్శకి లేదా చర్చకి కారణం అయిందంటే దాన్ని ఒక ఆలోచనాత్మక గాధగా భావించవచ్చు. ఏ కథ అయినా చదువరుల మనసులో ఆలోచన రేకెత్తించింది అంటే ఆ కథ లో అంతో, ఇంతో విషయం ఉందన్నమాట .

ఆ తరవాత ఎంత మంది ఎన్ని కథ లు రాసినా దాదాపు అన్నీ మహాభారతం ఆధారంగా వచ్చినవే. ఒక అన్న, దమ్ముల కథ , భార్యాభర్తల కథ , అత్తా,కోడళ్ళ కథ , ప్రేమ కథ అన్నీ కూడా మహాభారత కథ లు ప్రామాణికంగా వచ్చినవే అన్నది వాస్తవం.

రామాయణం, మహాభారతంలో అనేక ఉపకథలు వినిపిస్తాయి.. వాటిని పిట్టకథ లు అంటాము. ఈ పిట్ట కథ లు వినడానికి ఎంతో సరదాగా, ఆహ్లాదంగా ఉంటాయి. ముఖ్యంగా పిల్లలు ఎంతో ఉత్సాహంగా వింటారు . వీటిలో అనేక నీతి కథ లు మనిషి నడవడికను నిర్దేశించేవిగా ఉంటాయి. మహాభారత కథ ల్లో ఏది ఉందో అది అన్ని చోట్లా ఉంది , ఏదో లేదో అది ఎక్కడా లేదు . అంటే మహాభారతం కాల్పనికం కాదు... వాస్తవం అనే కదా.

అలాగే చారిత్రిక కథ లు ... ఒక అశోకుడి కథ  అయినా, ఒక అలెగ్జాండర్ కథ  అయినా, ఒక ఔరంగజేబు కథ  అయినా, ఒక ప్రతాపరుద్రుడి కథ  అయినా, ఒక బాలచంద్రుడి కథ  అయినా ఇవన్ని కూడా జరిగినవే.. చారిత్రిక ఆధారాలు ఉన్నవే.

కాశీమజిలీ కథ లు, విక్రమార్క కథ లు, చందమామ కథ లు ఇవన్నీ కాల్పనిక గాధలు. నిజానికి వీటిలో కూడా అంతో, ఇంతో మన ఇతిహాసాల ప్రభావం లేకపోలేదు. ఇవన్నీ  పిల్లల కథ లుగా ఎంతో ప్రాచుర్యం పొందాయి. చిన్నయసూరి రాసిన నీతిచంద్రిక కథల్లో మిత్రభేదము, మిత్రలాభము ఈనాటికీ చెప్పుకుంటున్నాం.. ఇవన్నీ కూడా యానిమేషన్ చిత్రాలుగా నిర్మించబడ్డాయి పిల్లల అభిరుచులకు అనుగుణంగా.

అలాగే జాకబ్ గ్రిం రాసిన ది ఫెయిరీ టేల్స్ లో సిండ్రెల్లా కథ  ఎంతో ప్రాచుర్యం పొందిన కథ ... A little mouse who was a princess, రాపున్జెల్ కథ లు... తరతరాలుగా మనలను ప్రభావితులను చేస్తూనే ఉన్నాయి.

పాశ్చాత్య సంస్కృతీ కథ లు twilait  కథ లుగా ప్రాచుర్యం పొందాయి.  సాధారణంగా ఇవి దయ్యాల కథ లు,   భయానకం, సస్పెన్స్, రొమాన్స్ కథ లు.

ఇవి కాక  సైన్సు ఫిక్షన్ ... ఫాంటసీ, మిస్టరీ,  సృజనాత్మక కథలు, వాస్తవిక గాధలు.. అతి వాస్తవిక కథలు..వగైరా ఆధునిక సాహితీ ప్రపంచంలోకి వచ్చి ప్రభంజనం సృష్టిస్తున్నాయి.

నెమ్మదిగా ఆధునిక మానవజీవితంలోని అనేక సంఘటనలు, జీవన శైలి, అభిరుచులు, భావాలు, కథ ల్లోకి చొచ్చుకు వస్తూ కథ యొక్క రూపాన్ని పూర్తిగా మార్చేయడం జరిగింది. నిజానికి కథ  అనేది ఊహల్లొ విహరింపచేసేది కాదు.. ఆలోచనాత్మకంగా ఉండాలి. చదువరుల మనసులో సంఘర్షణ రేగాలి. మంచికీ, చెడుకీ మధ్య ఒక సమరం జరిగి మంచిని మనకి అందచేసేది కథ .  కథ లో సందేశం ఉండాలా! అనేది కొందరి వాదన ... సందేశం ఉండాలి.. అని కొందరి భావన. సందేశం అంతర్లీనంగా ఉండాలి అది నినాదం కాకూడదు.. సాహిత్యం యొక్క ప్రభావం జీవితాల మీద పడడం ప్రారంభం అయినప్పుడే కథ కి కొన్ని విలువలు ఏర్పడ్డాయి. ... అవి ఆధునిక జీవన శైలికి మార్గం వేశాయి.

కథ  చదువుతున్నప్పుడు ఆ కథ  కళ్ళముందు జరుగుతున్న భావన చదువరులకు కలిగించగలిగితే రచయిత ధన్యత పొందినట్టే ..

కదల గురించి చెప్పుకోవాల్సివస్తే ప్రపంచ స్థాయిలో తెలుగు కథ కు గుర్తింపు తెచ్చిన కథ పాలగుమ్మి పద్మరాజుగారి గాలివానని చెప్పుకుంటాం. నిజానికి ఈ కథ లో గొప్ప సందేశం కానీ, గొప్ప జీవన సూత్రం కానీ కనిపించదు. కానీ ఒక వర్షపు రాత్రి , రైలు ప్రయాణం అది కూడా సాధారణ పెట్టెలో కలిసి ప్రయాణం చేస్తున్న రక,రకాల మనుషుల మనస్తత్వాలను , ఆవిష్కరిస్తూ ఎంతటి ఆదర్శవాది అయినా ఎదురైన ఒక బలహీన క్షణంలో పరిస్థితులకు ఎలా లొంగిపోతాడో, చాలా వాస్తవికంగా, కళ్ళకు కట్టినట్టు

చెప్పారు రచయిత. ఇది బహుశా అధివాస్తవిక ధోరణితో సాగిన కథ కావచ్చు. ఒక బిచ్చగత్తెని అంత దగ్గరగా సన్నిహితంగా తీసుకోవడం అనేది కొంత జుగుప్సని కలిగిస్తుంది. కానీ అది మానవ, మగవాడి బలహీనత... ఆ బలహీనతని నిర్మొహమాటంగా వ్యక్తపరచడంలో రచయిత విజయం సాధించాడు.

ఆ తరవాత ఏ కథ కు కూడా ఇంతటి కీర్తి లభించలేదు అంటే ఇంతటి స్థాయి ఉన్న కథ లు రాలేదనా...లేక వచ్చినా గుర్తింపుకు నోచుకోలేదు అనా..

ఇప్పటి తెలుగు కథ ల్లో జీవన వైవిధ్యం ప్రతిబింబిస్తున్నది.. అనేక రకాల భావజాలాలు, భాషలు , మాండలికాలు, వర్గ పోరాటాలు, వాదాలు ఇలా చైతన్యం, మానసిక సంఘర్షణలు ఇలా అనేకం నేటి కథ ల్లో కనిపిస్తున్నాయి. పాత్రల చిత్రణ, జీవన దృక్పదాలు అన్నీ మారిపోతున్నాయి. నిజానికి మంచి కథ రాయాలంటే రచయిత జీవితాన్ని పరిశోధించాలి. కొందరన్నట్టు శిల్పం కన్నా భావప్రకటన ముఖ్యం కాదు. శిల్పం లేకపోతే కథ చదివించదు. కథ కి వస్తువు ఎంత ప్రాణమో, శిల్పం కూడా అంతే అవసరం. ఎలాంటి వస్తువు అయినా చెపుతున్న విషయం ఆసక్తికరంగా, ప్రభావితం చేసేదిగా, చెప్తున్న విషయం చదువరుల హృదయాలను స్ప్రుశించేదిగా చెప్పాలంటే శిల్పం చాలా అవసరం. అప్పటి రచయితలు చలం, కొడవటిగంటి, పద్మరాజు, బుచ్చిబాబు, తిలక్ ఇలాంటి వారి గురించి చెప్పుకునేటప్పుడు వారందరికీ కూడా ఎవరి శైలి వారిది, ఎవరి శిల్పం వారిది, ఎవరి రచనా చమత్కృతి వారిది. కానీ ఆధునిక కథకుల్లో పోలికలు చాలా ఉన్నాయి, ఎందుకంటే కథ రాయాలి అన్న తపన తప్ప తనకంటూ ఒక ముద్ర ఏర్పరచుకోవాలన్న ఆలోచన చాలామందికి లేకపోవడం కారణం ..

ఇప్పుడు సాహిత్యం చాలా ప్రమాదకర పరిస్థితుల్లో పడింది. అనేక వాదాలుగా, కుల, మత వర్గాలుగా విడిపోయి విశ్వజనీనమైన సాహిత్యం ముక్కలుగా విడిపోయింది. ఎవరి వర్గం వారిని వారి వర్గానికి చెందిన వాళ్ళు భుజాన మోయడమే కాక వారిపే ఉత్తమ రచనలుగా ప్రచారం చేసుకోడం ఎక్కువైంది. సమాజంలో కొత్త, కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి, వాటి ప్రభావం సాహిత్యం మీద తీవ్రంగా పడుతోంది. తను రాసిందే వేదం అనుకునే మూర్ఖపు భావజాలాలు కూడా ఎక్కువైపోతున్నాయి. ప్రతి రచయిత ఏదో ఒక వాదాన్ని అడాప్ట్ చేసుకుని దాని చుట్టూ కథ లు అల్లితే కాని పేరు రాదు అనే భ్రాంతిలో పడిపోతున్నారు రచయితలు. ఇటీవల మానవ జీవితాలను తన మత్తులో పడేసిన సోషల్ మీడియా ద్వారా ఎందరో భావచౌర్యం, గ్రంధ చోర్యాలు చేస్తూ, సీనియర్ రచయితల రచనలను సునాయాసంగా కాపీ కొట్టి వాటికి కొంత అలంకారం చేసి కొత్త రూపు కల్పించడానికి తాపత్రయపడుతున్నారు. సాహిత్యాన్ని నిలబెట్టాలన్న బాధ్యత కన్నా తమకి ఏదోవిధంగా పేరు రావాలన్న ఆరాటం కనిపిస్తున్నది.

కొన్ని పత్రికలూ పోటీ కథలు నిర్వహిస్తూ కొన్ని మూస కథలనే ఉత్తమ కథ లుగా నిర్ణయించడం వలన పోటీ కథ ల పాకశాలలో పాత కథ లకు కొంత మసాలా దట్టించి ఇవే ఉత్తమ కథ లు అని పాటకులను నమ్మించే ప్రయత్నం జరుగుతున్నది. పోటీ మంచిదే కానీ ఈ పోటీల వలన ఉత్తమ రచనలు రావడం

అటుంచి ఉత్త రచనలు ఉత్తమ రచనలుగా నమ్మించే ప్రమాదం సంభవిస్తున్నది. దీని వలన భవిష్యత్తులో సాహిత్యానికి పోస్ట్ మార్టం తప్పదు అనిపిస్తుంది.


pno



# వినదగునెవ్వరు చెప్పిన ..

కథామంజరి దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికై, డిసెంబరు 2021 సంచికలో ప్రచురింపబడిన నా తొలి కథ "ప్రమాదాల అంచులలో" ను నా తల్లిదండ్రులు కీ.శే. ఘుండికోట సీతారామ మరియు బ్రహ్మాజీరావు గార్ల దివ్య స్మృతికి అంకితం చేస్తున్నాను.

ఘుండికోట విశ్వనాథం, విశాఖపట్నం.



ఈ నూతన సంవత్సరం 2022

మీకు మరిన్ని శుభాలని అందివ్వాలని కోరుకుంటూ

**కథామంజరి బృందం**